


# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 18 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 8 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-



# సమర్థుడికే పగ్గాలు

## తెలంగాణ టీడీపీ నేతలతో చంద్రబాబు కీలక సమావేశం

- ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో సమావేశం
- టీడీపీ బలోపేతంపై చంద్రబాబు ఫోకస్
- కమిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- తెలంగాణలో పార్టీ పునర్నిర్మాణంపై ప్రధాన చర్చ
- రాష్ట్రవ్యాప్తంగా 1.78 లక్షల సభ్యత్వ నమోదు
- కమిటీల నియామకం వేగవంతం చేయాలని ఆదేశం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చాలా కాలం తర్వాత తెలంగాణ పార్టీ వ్యవహారాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తెలంగాణలో పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా ఆయన కీలక నేతలతో సమావేశమయ్యారు. సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టి, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయాలంటూ తెలంగాణ టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం తెలంగాణకు చెందిన పలువురు సీనియర్ టీడీపీ నేతలు చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా తెలంగాణ టీడీపీకి కొత్త అధ్యక్షుడిని నియమించడం, రాష్ట్ర, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం వంటి సంస్థాగత అంశాలపై చర్చించారు. ఇప్పటికే మండల అధ్యక్షుల నియామకానికి సంబంధించిన కసరత్తు పూర్తయిందని, దానిని వెంటనే పూర్తి చేయాలని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా, తెలంగాణలో పార్టీకి 1.78 లక్షల సభ్యత్వ నమోదు పూర్తయినట్లు నేతలు చంద్రబాబుకు - మిగతా2లో



## వారి వివరాలు ఇవ్వండి

- బిహార్ తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది పేర్లను రేపట్లోగా ఇవ్వండి
- చేర్చిన పేర్లు గతంలో తొలగించినవా.. కొత్తవా?
- ఆ వివరాలు వెల్లడించి గందరగోళం తొలగించండి
- ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు ఆదేశం

5



## బడా సంస్థల చేతుల్లోనే భవిష్యత్తు

- అల్గారిథమ్‌ల ద్వారా కుమ్మక్కు
- ధరల వివక్షతో మార్కెట్‌కు ముప్పు..
- భారత్‌లో విస్తరిస్తున్న ఏఐ సామ్రాజ్యం
- అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా నివేదిక

# మద్యం ఆదాయం బాబు మాఫియాకే



- రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గాల
- పరిశీలకుల సమావేశంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపాటు
- మాఫియా వ్యవహారంలా సరఫరా, విక్రయాలు.. పెదబాబు, చినబాబు
- అందదండలతో ప్రాంతాలవారీగా ఫ్రాంచైజీలు, వసూళ్లు
- ప్రతి నాలుగైదు బాటిళ్లలో ఒకటి నకిలీనే
- అమాయకుల ప్రాణాలు హరిస్తూ కాసుల దందా..
- ప్రభుత్వ ఆధ్వర్యంలోని మద్యం దుకాణాల తొలగింపు
- ఊరూరా బెల్టు షాపులు, పోలీసు రక్షణతో వేలం పాటలు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రంలో మద్యం సరఫరా, విక్రయాలన్నీ ఒక మాఫియా వ్యవహారంలా సాగుతున్నాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ దుకాణాలన్నీ మూసివేసిన సీఎం చంద్రబాబునాయుడు ఆయన మాఫియాకు సంబంధించిన ప్రైవేటు దుకాణాలను తెరపైకి తెచ్చారని ధ్వజమెత్తారు. ఊరూరా 70 వేలకుపైగా బెల్టు షాపులను నెలకొల్పి పోలీసు ప్రొటెక్షన్ ఏర్పాటు చేసి మరీ మద్యం దుకాణాలకు వేలం పాటలు నిర్వహించారని దుయ్యబట్టారు. వేలం పాటలు పాడి డబ్బులు వసూలు చేసి.. మంత్రులకు ఇంత, ఎమ్మెల్యేకు ఇంత, పోలీసులకు ఇంత, పైన పెద్దబాబుకు, చిన్నబాబుకు ఇంత.. అంటూ మొత్తం డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను వారి నియంత్రణలోకి తీసుకున్నారన్నారు. ప్రతి నాలుగైదు బాటిళ్లలో ఒకటి నకిలీ మద్యాన్ని విక్రయిస్తూ ప్రాణాలను హరిస్తున్నారన్నారు. కుటీర పరిశ్రమలా నకిలీ మద్యం తయారీతో ఒకవైపు భారీగా దోపిడీ చేస్తూ మరోవైపు అమాయకుల - మిగతా2లో

## ప్రభుత్వాధినేతగా పాతికేళ్లు!

- ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన ఘనత
- 2001 అక్టోబరు 7న గుజరాత్ సీఎంగా బాధ్యతలు
- అదే నెల 26న ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన మోదీ 11 ఏళ్లకుపైబడి ఆ పదవిలో కొనసాగుతున్నారు.

5



# 16న శ్రీశైలానికి ప్రధాని మోదీ

- భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారుల సమీక్ష
- హెలిప్యాడ్, శివాజీ స్ఫూర్తి కేంద్రం పరిశీలన
- ప్రధాని రాకతో శ్రీశైలానికి మరింత వైభవం: పీవీఎన్ మాధవ్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16న శ్రీశైలం పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ప్రధాని పర్యటన స్పెషల్ అధికారి వీరపాండియన్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు, పోలీసు ఉన్నతాధికారులు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సున్నిపెంట హెలీప్యాడ్ పరిసరాలను, శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడినుంచి మల్లికార్జునస్వామి ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్దకు చేరుకుని ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లపైనా ఆరా తీశారు. మోదీ సున్నిపెంట హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన శ్రీశైలానికి రానున్నారు. దీంతో ఈ రహదారికి మరమ్మతులు వేగవంతంగా చేయాలని - మిగతా2లో

## బిహార్‌లో సీటు పోరు!

- కూటముల్లో పెద్దన్న పాత్ర కోసం పార్టీల పట్టు..
- సీట్ల పంపకంపై విస్తృతంగా చర్చలు
- మరోవైపు మహాఘట్‌బంధన్ కూటమిలో సీట్ల లెక్కతోపాటు సీఎం అభ్యర్థి అంశమూ సందిగ్ధత

5



# గ్రామాభివృద్ధిలో స్వచ్ఛ సుందర చల్లపల్లి పాత్ర కీలకం

## సర్పంచ్ కృష్ణకుమారికి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, డీపీఓ, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ చైర్మన్ అభినందనలు








**చల్లపల్లి**

గ్రామ అభివృద్ధి స్వచ్ఛతలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సీఎం చేతులమీదుగా స్టేట్ బెస్ట్ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్న కృష్ణకుమారిని మంగళవారం అవనిగడ్డలోని తమ స్వగృహంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదకొండు ఏళ్ల నుంచి డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్- డాక్టర్ టీ.పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం గ్రామ రూపురేఖలు మార్చిందన్నారు. గ్రామ అభివృద్ధికి, స్వచ్ఛత సాధనకు పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు తమవంతు కృషి చేస్తూ ఇలాంటి అనేక అవార్డులు అందుకోవటం ద్వారా చల్లపల్లి గ్రామం స్వచ్ఛ భారత్ కార్యక్రమ నిర్వహణకు అధ్యయన కేంద్రంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా గ్రామంలో స్వచ్ఛత నెలకొల్పిన గ్రామ పంచాయతీ సర్పంచ్ కృష్ణకుమారి, ఈఓ మాధవేంద్రరావు, పాలకవర్గానికి, అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణకుమారి, ఈఓ మాధవేంద్రరావులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్- విజయలక్ష్మి దంపతులు సత్కరించారు. అనంతరం మచిలీపట్నంలో జిల్లా కలెక్టరేటులో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా పంచాయతీ అధికారిణి జె.అరుణలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంలో స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ చైర్మన్ డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్ సర్పంచ్ కృష్ణకుమారిని అభినందించారు. గ్రామ స్వచ్ఛతకు పదకొండు ఏళ్ల నుంచి మన కోసం మనం ట్రస్ట్ ద్వారా కృషి చేస్తున్న డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్, డాక్టర్ టీ.పద్మావతిలకు, స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలకు సర్పంచ్ కృష్ణకుమారి ధన్యవాదములు తెలిపారు.

# శ్రీ కృష్ణసాయి ధ్యాన మందిరంలో మహా కుంభాభిషేకం





**చల్లపల్లి**

చల్లపల్లి మండలం పురిటిగడ్డలోని శ్రీకృష్ణసాయి ధ్యాన మందిరంలో ఆలయ 12వ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో యాగాది క్రతువులు నిర్వహించగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విచ్చేసి మహా పూర్ణాహుతి సమర్పించారు. ఆలయంలో సాయిబాబాకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, భక్తులు నవవిధ అభిషేకాలు చేశారు. ఈ నెల 2వ తేదీ ప్రారంభమైన ఈ ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపకులు, సద్గురు సాయినాథ్ సేవాసంస్థ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత రవాణా శాఖ అధికారి నాదెళ్ల శివరామకృష్ణ పర్యవేక్షించారు. ఉత్సవాల సందర్భంగా పీసపాటి తిరువెంగళ ముడయాన్ బృందం వారు యాగాది క్రతువులతో ఆలయంలో విశేష పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, నాదెళ్ల నరసయ్య, వెలువోలు సర్పంచ్ వేములమడ రజిత, మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# మద్యం ఆదాయం బాబు మాఫియాకే

-మొదటిపేజీ తరువాయి

ప్రాణాలను బలి తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్సైజ్ అధికారులు ర్యాండమ్‌గా జరిపిన దాడుల్లో నకిలీ మద్యం తయారీ డంపులు భారీగా బహిర్గతుమయ్యాయన్నారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు నియోజుకవర్గాల పరిశీలకులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి, కూటమి సర్కారు ప్రజా కంటక పాలనపై చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ.. యథేచ్ఛగా, అంతు లేకుండా సాగుతున్న కల్తీ మద్యం విషయాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలకు వైఎస్ జగన్ నిర్దేశించారు. కల్తీ మద్యానికి వ్యతిరేకంగా పార్టీ పరంగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేస్తామన్నారు. సమావేశంలో జగన్ ఏమన్నారంటే.

**మద్యం మాఫియా నెట్‌వర్క్**

ఇవాళ మద్యం సరఫరా, విక్రయాలన్నీ ఒక మాఫియా వ్యవహారంలా సాగుతోంది. మొత్తం వ్యవస్థను తమ కంట్రోల్లోకి తీసుకున్న తరువాత ఎమ్మార్పీకి మించి మద్యం అమ్ముతున్నారు. వైన్ షాపుల పక్కనే పర్మిట్ రూముల్లో పెగ్గుల రూపంలో ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుకు లిక్కర్ అమ్మకాలు సాగిస్తున్నారు. వేలంపాటలో గ్రామాల్లో బెల్ట్ షాపులు పొందిన నిర్వాహకులు ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు ఎక్కువ రేటుకు మద్యం అమ్ముతున్నారు. ఏ స్థాయిలో అవినీతి జరుగుతోందో కళ్ల ముందే కనిపిస్తోంది. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం మాఫియా జేబుల్లోకి వెళ్తోంది. మరోవైపు డిస్టిలరీల నుంచి మద్యం సేకరణలో అక్రమాలు చేస్తున్నారు. ప్రముఖ బ్రాండెడ్ డిస్టిలరీల నుంచి కాకుండా బాగా డబ్బులిచ్చే (కమీషన్లు) డిస్టిలరీల నుంచి మద్యం సేకరిస్తున్నారు. వీళ్లకు కావాల్సిన డిస్టిలరీలకు ఇండెంట్లు ప్లేస్ చేసి వాళ్లకు సంబంధించిన సరుకు మాత్రమే అందుబాటులోకి తెస్తున్నారు. ఇవన్నీ వీళ్ల సొంత ఆదాయం పెంచుకునే ఎత్తుగడలు.

**నకిలీ మద్యంతో బరి తెగింపు.. బాబు పరిపాలనలో రాక్షసయుగం**

బాధ కలిగించే విషయం ఏమిటంటే.. వీళ్ల డబ్బు ఆశ ఏ స్థాయికి వెళ్లిపోయిందంటే.. ప్రజలు ఏం తాగినా పర్వాలేదు... చనిపోయినా పర్వాలేదు.. తమ జేబుల్లోకి డబ్బులు ఇంకా ఎక్కువగా రావాలనే తలంపుతో దారుణంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు పరిపాలనలో రాక్షసయుగం నడుస్తోంది. భయభ్రాంతులకు గురి చేస్తూ పోలీసుల ద్వారా పరిపాలన సాగిస్తున్నారు. నకిలీ మద్యం ఏరులై పారుతోంది. ఆ మాఫియాను కంట్రోల్ చేసే కొందరు కేబినెట్ మంత్రులు, ప్రముఖ రాజకీయ పదువుల్లో ఉన్నవారు, పెద్దబాబు, చినబాబు ఆధ్వర్యంలో నకిలీ మద్యం తయారీ విచ్చలవిడిగా సాగుతోంది. ఏకంగా ఫ్యాక్టరీలు నెలకొల్పి క్వాలిటీ లేని లిక్కర్ తయారు చేసి వారి డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా షాపుల్లోకి, బెల్ట్ షాపుల్లోకి నేరుగా పంపిస్తున్నారు.

**ప్రతి నాలుగైదు బాటిళ్లలో ఒకటి నకిలీ.. పరిశ్రమను స్థాపించి యంత్ర పూజ...**

మరో విషయం ఏమిటంటే.. ఇవాళ ప్రతి నాలుగైదు బాటిళ్లలో ఒకటి నకిలీ మద్యం బాటిల్. అది తాగి మనుషులు చనిపోతున్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జనార్దన్‌రావు, సురేంద్రనాయుడు ఈ నకిలీ మద్యం దందా నడుపుతున్నారు. వీళ్లపై పర్యవేక్షణ బాధ్యతలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి అప్పగించారు. ములకలచెరువులో ఏకంగా పరిశ్రమను స్థాపించి పెద్ద సంఖ్యలో నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. దానికి సంబంధించిన ట్యాంక్, క్యాన్లు, బాటిళ్లు, మూతలు, బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ లేబుళ్లు అన్నీ అక్కడ ఉన్నాయి. చివరకు దసరాకు అక్కడ యంత్ర పూజ కూడా చేశారు. అంటే అంత పకడ్బందీగా నకిలీ మద్యం తయారు చేస్తున్నారు.

**ఒక్కో ఏరియా పంచుకున్నారు.. ఇబ్రహీంపట్నంలో రెండు భారీ డంప్‌లు**

అధికార పార్టీ అండతో రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం యూనిట్లు నెలకొల్పి ఒక్కొక్కరు ఒక్కో ఏరియా పంచుకున్నారు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేస్తున్న జనార్దన్‌రావు, సురేంద్రునాయుడు.. నారా లోకేశ్, చంద్రబాబుతో కలసి ఫొటోలు కూడా దిగారు. ఇక్కడ తయారైన నకిలీ సరుకు రాయలసీమ లో మద్యం షాపులు, బెల్ట్‌షాపులకు పంపిణీ చేసే బాధ్యతను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సూపర్‌వైజ్ చేస్తున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ సామ్రాజ్యాన్ని విస్తరింపజేసేందుకు ఇబ్రహీంపట్నంలో ఏకంగా రెండు చోట్ల భారీగా నకిలీ మద్యం ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. రాయలసీమ నుంచి రవాణా చేస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని ఇబ్రహీంపట్నంలోనే యూనిట్ ఏర్పాటు చేశారు. అక్కడ వాళ్లే బాటిళ్లు, లేబుల్స్, మూతలు తయారు చేసుకుంటూ బ్రాండ్లు కూడా ప్రమోట్ చేస్తున్నారు. ఎక్కడ చూసినా కార్టన్ బాక్సుల్లో స్పిరిట్ నింపిన డ్రమ్స్, ఖాళీ సీసాలు, బాటిళ్లను చూసి ఎక్సైజ్ అధికారులే విస్తుపోయారట. నర్సీపట్నంకు చెందిన నేత ఉత్తరాంధ్ర బాధ్యతలు చూసుకుంటారు. ఈయన స్పీకర్ అయ్యన్నపాత్రుడికి సన్నిహితుడు. ఏలూరుకు చెందిన వివాదాస్పద ఎమ్మెల్యే బాగా దౌర్జన్యం చేస్తాడని ఆయనకు ఉమ్మడి గోదావరి జిల్లా బాధ్యతలు అప్పగించారు. పాలకొల్లులో మరో పరిశ్రమ.. అక్కడ కూడా మిషన్, క్యాన్లు, బాటిళ్లు, లేబుల్స్ అన్నీ ఏర్పాటు చేశారు. అమలాపురంలో కూడా మిషన్లు, కల్తీ మద్యం, బాటిల్స్, లేబుల్స్, మూతలు, స్పిరిట్ అన్నీ అమర్చుకున్నారు. నెల్లూరులో డిస్ట్రిబ్యూషన్ ఛానల్, అనకాపల్లి జిల్లా పరవాడలో పరిశ్రమ ఏర్పాటు చేశారు.

**నకిలీ మద్యానికి అమాయకులు బలి..**

ఇబ్రహీంపట్నం మండలం చిలుకూరులోని ఓ మద్యం షాపులో లిక్కర్ తాగిన కొద్దిసేపటికే షేక్ చిన్న మస్తాన్ మరణించాడు. జూపూడి వైన్ షాప్‌లో మద్యం తాగి ఇంటికి వెళ్తూ కిలేశ్వరం గ్రామానికి చెందిన నాగరాజు చనిపోయాడు. అనంతపురం జిల్లా గుంతకల్లులోని వైన్ షాపులో మద్యం సేవిస్తూ బెల్దారీ పెద్దన్న అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. నకిలీ మద్యానికి అమాయకులు బలి అవుతున్నారు

రాష్ట్ర ముఖ్యమంత్రి డబ్బుల కోసం ఏ స్థాయిలోకి దిగజారి పోతున్నారంటే.. సొంత ఆదాయాలు పెంచుకునేందుకు రాష్ట్ర ఖజానాను లూటీ చేయడంతో సరిపెట్టుకోకుండా అమాయకుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఆయన రాష్ట్రాన్ని ఏ రకంగా లూటీ చేస్తున్నారో ఇవాళ స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా ఇబ్రహీంపట్నంలోని గోడౌన్లలో దాడులు చేసి నకిలీ మద్యం బాటిళ్లు, లేబుల్స్, సిద్ధం చేసిన వివిధ బ్రాండ్ల నకిలీ మద్యం, మిషన్లు, పెద్ద సంఖ్యలో ఖాళీ బాటిల్స్, లేబుల్స్ లేని బాటిల్స్, స్పిరిట్‌ను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉంచిన 95 క్యాన్లలో 3,325 లీటర్ల స్పిరిట్‌ను సీజ్ చేశారు. అందులో ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ 725 బాటిల్స్, క్లాసిక్ బ్లూ 44 బాటిల్స్, కేరళ మాల్ట్ 384 బాటిల్స్, మంజీరా బ్లూ 24 బాటిల్స్.. ఇలా మొత్తం 1,300 బాటిళ్లను ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్నారు. లేబుల్స్ లేని 136 కేసులు, 6,578 బాటిల్స్, ఓఏబీ లేబుల్స్ 6,500, ఖాళీ బాటిల్స్ 22 వేలు, ఖాళీ కార్టూన్లు 6, ఒక మిషన్, రెండు పైపులను సీజ్ చేశారు. ఇవన్నీ చూస్తే ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ప్రజల ప్రాణాలను హరిస్తున్న నకిలీ మద్యంపై పార్టీ పరంగా నిరసనలు తెలియచేయాలి. ప్రతి నాలుగైదు బాటిళ్లలో ఒకటి నకిలీ మద్యం విక్రయిస్తున్నారు. కల్తీ మద్యం వద్దు, మా ప్రాణాలను కాపాడాలని, అయ్యా చంద్రబాబు... మా ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని నియోజకవర్గ కేంద్రంలోని మద్యం దుకాణాల వద్ద ప్లకార్డులతో ఆందోళనలు చేయాలి.

## రోహిత్ శర్మతో రాయల్ స్టాగ్ సెలబ్రేట్ లార్జ్ ఏఐ పవర్డ్ పండగ క్యాంపెయిన్




**విజయవాడ**

యువత తమ విలక్షణమైన స్టైల్, ఉత్సాహాలను నింపుకోవడానికి రాబోయే సంవత్సరాల్లో గుర్తుండిపోయే జ్ఞాపకాలను సృష్టించడానికి, లివ్ ఇట్ లార్జ్ గా ఉండటానికి రాయల్ స్టాగ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ సెలబ్రేట్ లార్జ్ ఏఐ పవర్డ్ పండగ క్యాంపెయిన్ ప్రారంభించింది. ఈ ఏడాది కాంపైన్ సంస్కృతిలో లోతుగా పాతుకున్న టెక్-ఫార్వర్డ్, ఏఐ ఆధారిత అనుభవాన్ని రాయల్ స్టాగ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ఆవిష్కరిస్తుంది. బ్రాండ్ లివ్ ఇట్ లార్జ్ సిద్ధాంతంతో యువతరం కోరికను సొగసుగా అల్లుకుని వినియోగదారులను సంబరంలో ప్రధాన ఆకర్షణగా ఉంచుతుంది. రీజనరేటివ్ ఏఐ ఆధునిక స్వరం సంశ్లేషణలను ఉపయోగిస్తూ, రాయల్ స్టాగ్ కొత్త పండగ శుభాకాంక్షల అనుభవాన్ని అభిమానులు రోహిత్ శర్మతో పాటు వ్యక్తిగత వీడియో శుభాకాంక్షలతో సృష్టించవచ్చు. సహజమైన సంభాషణల రూపంలో రూపొందించబడిన, వినూత్నమైన, వాస్తవమైన శుభాకాంక్షలు పండగ కోరుకును కనక్షన్ క్షణంగా సెలబ్రేట్ లార్జ్ స్ఫూర్తి నిజమైన సూచనగా మారుస్తాయి.

## అవధూత్ సాథే ఓ శిక్షణ సంస్థ మాత్రమే

**హైదరాబాద్**

గత కొన్ని రోజులుగా అందుకున్న అనేక విచారణలకు స్పందనగా అవధూత్ సాథే ట్రేడింగ్ అకాడమి ఒక ప్రకటన విడుదల చేసింది. తాము సెబీతో పూర్తిగా సహకరిస్తూ వారు కోరిన అదనపు సమాచారం అందిస్తూ సహకరిస్తున్నామని, అత్యధిక ప్రమాణాలు, పారదర్శకతను నిర్ధారించుటకు వారి మార్గదర్శనాన్ని స్వాగతిస్తున్నామని సంస్థ పేర్కొంది. 'అవధూత్ సాథే ట్రేడింగ్ అకాడమి ఒక శిక్షణ సంస్థ మాత్రమే. ఎట్టి ప్రయోజనాల కోసం, వ్యక్తిగత సలహాలు ఇవ్వడం, ఫిన్‌ఫ్లుయెన్సర్లుగా వ్యవహరించడం, పరిశోధనా నివేదికలు, స్టాక్ రికమెండేషన్లు ప్రచారం చేయడం జరగదు. మేము గురుకుల శిక్షణ వ్యవస్థను అనుసరిస్తూ మార్కెట్లో ఒడిదుడుకులను తట్టుకోవటానికి కావలసిన విలువలు, నైపుణ్యాన్ని, జ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం. అవధూత్ సాథే ట్రేడింగ్ అకాడమీ వద్ద మా దృష్టి ఎప్పుడు నిర్మాణాత్మక శిక్షణ కార్యక్రమాల ద్వారా స్వతంత్ర వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులను అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. మా శిక్షణ సెషన్లు విశ్లేషణాత్మకత, అమలు, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేయటానికి రూపొందించబడ్డాయి. తద్వారా మా విద్యార్థులు జ్ఞానం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ట్రేడ్ చేయటానికి సంసిద్ధులై ఉంటారు' అని వివరణనిచ్చారు.

## 16న శ్రీశైలానికి ప్రధాని మోదీ

-మొదటిపేజీ తరువాయి

అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీశైలం దేవస్థానం పరిపాలన భవనంలో ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. కాగా, ప్రధాని మోదీ పర్యటనతో శ్రీశైలం వైభవం మరింత పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర ఆధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మంగళవారం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ తొలిసారి ఇక్కడి జ్యోతిర్లింగ క్షేత్రానికి వస్తున్నారని, ఆయన రాకతో ఈ ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## సమర్థుడికే పగ్గాలు

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారని, సరైన నాయకత్వం అందిస్తే పార్టీని మళ్లీ క్రియాశీలంగా మార్చవచ్చని వారు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడి నియామకం ఆలస్యమైతే, తాత్కాలికంగా ముఖ్య నేతలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కూడా వారు సూచించారు. నేతల అభిప్రాయాలను పూర్తిగా విన్న చంద్రబాబు, పార్టీ బలోపేతంలో భాగంగా రెండు మూడు రోజుల్లో 638 మండల కమిటీలు, డిజవిన్ కమిటీల నియామకం పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వీలైనంత త్వరగా కమిటీల నియామకం పూర్తి చేసి, పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయాలని దిశానిర్దేశం చేశారు. పార్టీని సమర్థవంతంగా నడిపించగల నాయకుడికే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని ఆయన స్పష్టమైన సందేశం ఇచ్చారు. సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ నేతలతో చంద్రబాబు సమావేశం కావడం పార్టీ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సమావేశంలో పార్టీ నేతలు బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్ గౌడ్, కంభంపాటి రామ్మోహన్, నన్నూరి నర్సిరెడ్డి, బంటు వెంకటేశ్వర్లు, నందమూరి సుహాసిని, ఆశోక్ గౌడ్, జోత్స్న, వాసిరెడ్డి రామనాథం, పొగాకు జైరామ్ తో పాటు పలువురు హాజరయ్యారు.

## మూడు పార్టీలనూ 'లోకల్' ముంచేస్తుందా?

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు పెద్దగా సమయం లేదు. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు విడతల వారీగా ఎన్నికలు జరగడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిద్ధమయింది. 2026 జనవరి లేదా మార్చి నెలల్లోనే ఈ ఎన్నికలు ఉండే అవకాశముంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి అడ్వాంటేజీ ఉంటుంది. అంగబలం, అర్థబలం సమృద్ధిగా ఉండటంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ ప్రాంతంలో కూడా గెలిస్తే మేలు జరుగుతుందని ప్రజలు సహజంగా భావిస్తారు. అందుకే లోకల్ బాడీ ఎన్నికల్లో ఎక్కువగా అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు వస్తూ ఉంటాయి.. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉన్న నేతల మధ్య విభేదాలు ఎన్నికల ఫలితాలను ఏ రకమైన ప్రభావానికి గురి చేస్తాయోనన్న ఆందోళన అందరిలోనూ ఉంది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన నేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ అగ్రనేతలు మాత్రం కలసికట్టుగానే ఉన్నారు. కానీ నేతల మధ్యనే సఖ్యత లేదు. అది వాస్తవం. ఏ పార్టీ నియోజకవర్గంలో అధికారంలో ఉంటే మిగిలిన కూటమి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నేతలు వ్యతిరేకిస్తున్నారు. నామినేటెడ్ పదవులు తమకు దక్కకపోవడంతో పాటు పనుల కేటాయింపులో కూడా తమకు ప్రాధాన్యత దక్కడం లేదన్న అసహనం, అసంతృప్తి ఎక్కువగా కనిపిస్తుంది. మద్యం షాపులు, ఇసుక, కాంట్రాక్టు పనులు వంటి విషయాల్లో తమకు అన్యాయం జరుగుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు.? అసంతృప్తి.. అసహనం... కూటమి ప్రభుత్వం ఇటు సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మరొకవైపు అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తున్నారు. కానీ నేతల మధ్య సమన్వయం లేమి కూటమి కొంపముంచుతుందేమోనన్న ఆందోళన ఎక్కువగా కనిపిస్తుంది.

చట్టి గ్రామపంచాయతీ

## సమస్యలపై దృష్టి సారించాలి

### మండల టిడిపి అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్



**చింతూరు డివిజన్, విశ్వం వాయిస్ న్యూస్ :** చట్టి గ్రామపంచాయతీలో పేరుకుపోయిన మౌలిక సమస్యలపై తెలుగుదేశం కార్యకర్తలు గ్రామ కమిటీ ప్రతినిధులు దృష్టి సారించాలని ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేలా ప్రజల మధ్యనే ఉండి పరిష్కరించే దిశగా పనిచేయాలనీ చింతూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ చట్టి లో జరిగిన గ్రామసభలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మతం భాస్కర్ల ఆదేశానుసారం గ్రామ సభలను నిర్వహించడం జరుగుతుందని ఈ సభల్లో గ్రామాల్లోని త్రాగునీటి సమస్య రోడ్లు డ్రైన్లు వీధిలైట్లు ఇతర వ్యక్తిగత ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలని అన్నారు. సభను ఉద్దేశించి హాజరైన చట్టి గ్రామ ప్రజలు తమ గ్రామంలో రోడ్లు సరిగా లేవని వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో చీకటి పడితే అంధకారం నెలకొంటుందని. త్రాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. వితంతు వృద్ధాప్య పింఛన్లు కూడా కొందరికి అందడం లేదని సాంకేతిక కారణాలతోనే నేటికీ పింఛన్దారులు అర్హత ఉండి కూడా పొందలేకపోతున్నారని వారి సమస్యను పరిష్కరించాలని వరదలతో నష్టపోయిన పంటలకు పూర్తి స్థాయిలో పరిహారం అందించాలని. వరదలు సంభవించినప్పుడు పోలవరం వద్ద 36 అడుగుల నీటి మట్టానికే తమ గ్రామం మొత్తం ముంపునకు గురి అవుతుందని 41.15 కాంటూరు స్థాయిలో వరద వచ్చి ఉంటే గ్రామం మొత్తం కనుమరుగు అవుతుందని అటువంటి సమస్య ఉన్నప్పటికీ 41.15 కాంటూరులో చట్టి గ్రామం పొందుపరచకపోవడం తో పంచాయతీ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని మొదటి ప్రాధాన్యత క్రమంలో చట్టి గ్రామాన్ని కూడా చేర్చి వీరాపురం గిరిజన గ్రామాన్ని కూడా ముంపులోనే పరిగణించాలని ప్రజలు తెలిపారు. దీనికి సమాధానంగా అధ్యక్షులవారు మాట్లాడుతూ ఈ విషయంపై సంబంధిత మంత్రులకు ఇప్పటికే దరఖాస్తు రూపేనా పత్రాలు తయారు చేయడం జరిగిందని త్వరలో వాటిని మంత్రుల వారికి శాఖాల వారీగా పంపించడం జరుగుతుందని తెలిపారు. చట్టి గ్రామంలోని వీధిలైట్లు రోడ్లు త్రాగునీరు సమస్యను తప్పకుండా సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తానని గ్రామసభలో వెల్లడించారు. అధ్యక్షులు వారు ఇచ్చిన హామీకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సభలో కమిటీ అధ్యక్షులు కుంజ కన్నయ్య, కార్యదర్శి దానియ వెంకటేశ్వర్లు. నాయకులు తుర్రం ముత్తయ్య, తుర్రం బాబురావు. అప్పయ్య. మాజీ మండల అధ్యక్షులు చిన్నారెడ్డి,మాజీ మండల అధ్యక్షులు ఎండి జహంగీర్, అజం వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు పి.సాల్మన్ రాజు, ఆసిఫ్, ఓబులనేని నరసింహారావు, జంగం నరసింహం, సునీత లక్ష్మి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో

## పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కొవ్వూరు మండలం కాపవరం, ఐ.పంగిడి, వాడపల్లి, వేములూరు, ధర్మవరం, ఆరికిరేవుల, తోగుమ్మి, సీతంపేట గ్రామాలకు చెందిన 12 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.5,70,693 /-ల విలువగల చెక్కులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు లబ్దిదారులకు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా అమలు కానీ వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకున్న పేద మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ సూరపనేని చిన్ని, ఎంపీపీ కాకర్ల నారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ పెనుమాక జయరాజు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు, అర్జిల్లె రామకృష్ణ జనసేన కొవ్వూరు మండల అధ్యక్షులు సుంకర సత్తిబాబు, వరిగేటి కాంతా రాజు, కొక్కిరపాటి వెంకటేష్, తదితర ఎన్డీఏ కూటమి నాయకులు లబ్దిదారులు పాల్గొన్నారు.

## సాయిదుర్గా మందిరంలో దేవీ నవరాత్రుల వేడుకల్లో అన్నసమర్పణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం ఉదయం స్థానిక కోరుకొండ రోడ్డు వివర్స్ కాలనీ సాయి దుర్గా మందిరం వద్ద ఏర్పాటు చేసిన దేవీ నవరాత్రుల మండపం వద్ద భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేయడం జరిగినది. సుమారు నాలుగువేల మంది భక్తులు ఈ అన్న ప్రసాదాలు స్వీకరించినారు.దేవీ నవరాత్రుల తొమ్మిది రోజులు దేవికి ప్రతిరోజు పూజా కార్యక్రమాల నిర్వహించి పూజించడం జరిగినది. మూలా నక్షత్రం రోజున సరస్వతి దేవి అవతారాన్ని అనేకమంది పిల్లలు వచ్చి దర్శించుకుని పూజించినారు.ఈ తొమ్మిది రోజులు కూడా నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి 10వ రోజున మహా అన్నదాన కార్యక్రమాన్ని తూగో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టీ.కే.విశ్వేశ్వర రెడ్డి,జీవి శ్రీరాజ్ భక్తులకు ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దుర్గాదేవి కరుణాకటాక్షాలు ప్రజల మీద మెండుగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయి దుర్గ గుడి కమిటీ అధ్యక్షులు దుద్దుపూడి శ్రీనివాసు, జొన్నాడ వీర వెంకట సుబ్బారావు, కంటిపూడి శ్రీను, మురళీకృష్ణ,భీమవరం వెంకటేశ్వరరావు,జొన్నాడ దేవా,సుబ్బరాజు, అప్పారావు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన

## ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ఉండేశ్వరపురం మిర్తి పాడు గ్రామానికి చెందిన రోజు వారి శ్రామికులు టి.వెంకటరావు,కె.పవన్ కుమార్, కె.కృష్ణ, జి.శ్రీనివాస్, ఎ.వీరభద్రమ్మ రోజువారి పనికి వెళ్తుండగా రాజమండ్రి అకీరా హాస్పిటల్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న వ్యానును ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలైన వారిని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారని కూటమి నాయకుల ద్వారా తెలుసుకొన్న రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ హుటాహుటిని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి, ఆసుపత్రి ఆర్ఎంఓ సుబ్బారావు, న్యూరాలజీ డిపార్ట్మెంట్ కెనడితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

శ్రీ దుర్గా భవాని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో

## పలివెల వీరబాబుకు ఘన సన్మానం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం శ్రీ దుర్గా భవాని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సీపీఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబును ఘనంగా సత్కరించారు. ఆటో యూనియన్‌కు ఆయన అందిస్తున్న సహాయ సహకారాలకు కృతజ్ఞతగా పూలమాలలు, శాలువాలతో ఆయనను గౌరవించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ సభ్యులు చిడిపి బంగారయ్య మాట్లాడుతూ, ఇటీవల వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన భారీ అన్న సమారాధనకు పలివెల వీరబాబు రూ. 16,516 విరాళంగా అందించారని తెలిపారు. యూనియన్‌కు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న వీరబాబుకు ఆటో యూనియన్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకులు నందమూరి చిట్టి స్వామి, ఆటో యూనియన్ సభ్యులు ఈతకోట గంగాధర్, పసలపూడి పండ, గొల్లపల్లి కృష్ణ, జాము రాంబాబు, కొల్లి శ్రీను, కొత్తపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాట్య పండితుడు

## డాక్టర్ సప్పా శిష్యుల ప్రతిభ

### యూనివర్సిటీ సర్టిఫికెట్ కోర్సులో ఉత్తీర్ణులైన ఆరుగురు శిష్యులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విఖ్యాత నాట్య పండితుడు, నర్తన యోగి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ వద్ద ఆంధ్ర నాట్యంలో ఆలయ నృత్యం, పేరిణి శివతాండవంలో శిక్షణ పొందిన శిష్యులు శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రతిభ చూపించారు.డాక్టర్ సప్పా శిష్యులు పి.భానుదుర్గ, సప్పా దుర్గా జాహ్నవి, వి.రిషి హాసిని, ఎస్.భువన, డి.నవ్యశ్రీ, పి.భాను ప్రసాద్ సర్టిఫికెట్ కోర్సులు రాసి ఉత్తీర్ణలయ్యారు. పరీక్ష రాసిన ఆరుగురు ఉత్తీర్ణులై విజయం సాధించడం అరుదైన విషయమని నటరాజ నృత్య నికేతన్ విద్యార్థుల తలిదండ్రులు, ప్రముఖులు సప్పా శిష్యులను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి సభ్యుడు జి.వి.రమణ ఉత్తీర్ణులైన చిన్నారులను అభినందించారు. నాట్యంలో ప్రతిభ చూపిస్తున్న తన శిష్యులు విశ్వవిద్యాలయం పరీక్షల్లో కూడా విజేతలుగా నిలవడం పట్ల నర్తనయోగి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు.

## సీజేఐ బీఆర్ గావాయ్‌పై దాడిని ఖండిస్తున్నాం..

### ఆంధ్ర మాలమహానాడు యువజన రాష్ట్ర విభాగం అధ్యక్షుడు ఉల్లం రవి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సుప్రీంకోర్టులో విచారణ చేస్తుండగా ఒకన్యాయవాది సీజేఐ బీ.ఆర్.గావాయ్‌పై దాడికి యత్నించాడు ఈచర్యను పూర్తిగా ఖండిస్తున్నాం అని ఆంధ్ర మాలమహానాడు యువజన రాష్ట్ర విభాగం అధ్యక్షుడు ఉల్లం రవి ఒక ప్రకటనలో ఖండించారు. రవి మాట్లాడుతూదేశానికి ఎంతో ప్రధానమైన సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గావాయ్‌పై దాడి చేయడం చాలా అమానుషం ఈ దాడి ఒక ఉద్దేశపూర్వకంగానే న్యాయవాది చేయడం ఖండిస్తున్నాం.. అతనిని కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఆయన ఇకపై న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయడానికి అనార్హుడుగా అతనిపై అక్కడ బార్ కౌన్సిల్ కూడా గట్టి నిర్ణయం తీసుకోవాలని, లేదంటే సమాజంలో ఉన్మాదం పెరిగే అవకాశాలు ఎక్కువ అవుతాయి అని ఆయన అన్నారు.

## పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో మంజూరైన చెక్కులను సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన అడ్డగర్ల హర్ష శ్రీ అంజిత్‌కు రూ.46,641/లు, ప్రగడ దుర్గకు రూ 23920/లు, సింగవరం గ్రామానికి చెందిన సరికుప్పల అఖిల్ వర్మకు రూ.92,359/లు, సంగాన మహేష్ కు రూ 92,359/ల చెక్కును వారి ఇంటికి వెళ్లి స్వయంగా జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు వంగలపూడి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సర్పవరం గ్రామసభలో దళితులకు అవమానం

### మాతో సమానం కాదు వారికి ప్రత్యేక వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయండి..



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గం అత్యంత ప్రాధాన్యత కలిగిన గ్రామపంచాయతీ సర్పవరం గ్రామంలో ఈరోజు ఏర్పాటు చేసిన గ్రామసభలో గ్రామసభ వేదిక సాక్షిగా కార్యదర్శి సమక్షంలో ఏర్పాటు చేసిన గ్రామసభ మీటింగ్ లో దళితులకు వాటర్ ట్యాంక్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయండి మా వాటర్ ట్యాంకు వాడడానికి వీలులేదు అని కార్యదర్శి సమక్షంలో సర్పవరం నాయకులు మాట్లాడడం చాలా దారుణమైన విషయం. వివరాల్లోకి వెళితే సర్పవరం జనసేన నాయకుడు ముద్దన ప్రకాష్ గ్రామ సమస్యలపై మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో గ్రామంలో దళితుడు ఒకరు చనిపోయిన సమయంలో స్మశాన వాటిక దహన సంస్కారాల సమయంలో నీటి అవసరం నిమిత్తం స్నానాల కొరకు అగ్రవర్ణాలకు చెందిన వాటర్ ట్యాంక్ లో నీరు వాడారని అక్కడ చెప్పులతో మరియు తాగి స్నానాలు చేశారని దళితులను తక్కువ చేసి మాట్లాడి హిందూ సాంప్రదాయానికి విరుద్ధంగా దళితులు ప్రవర్తిస్తున్నారని దళితులను తప్పుచూపి దళితులపై ప్రేమ నటిస్తూ వారికి ప్రత్యేకంగా మా నుంచి దూరంగా వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామసభ సాక్షిగా ఈవోను కోరారు. రూరల్ నియోజకవర్గంలో దళితులు పై జరుగుతున్న వివిధ రకాల ఇబ్బందులు మరిచిపోతున్న సమయంలో కూటమి నాయకత్వంలో ఉన్న నాయకులు ఎక్కడో ఒకచోట ఇలాగే దళితులపై ప్రత్యక్షంగాను లేదా పరోక్షంగాను దాడులకు దిగుతున్నారు నోటి మాటల ద్వారా దళితుల అభ్యున్నతిని దిగజార్చే విధంగా మాట్లాడుతూ ఊరికి దూరంగా దళితులు ఉండాలి ఊరిలోకి రాకుండా చూడండి అంటూ అధికారులను కోరడం చాలా విడ్డూరంగా మారింది. ఈరోజు గ్రామసభలో జరిగిన దళితులకు దళితులపై చూపుతూ వివక్ష చూపుతూ మాట్లాడిన విషయాలను ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి దళితులపై ఇలాంటి మాటలు మాట్లాడి చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

నిడదవోలులో నూతనంగా

## "నిడదవోలు జర్నలిస్ట్స్ ఫెడరేషన్" ఏర్పాటు



**కొవ్వూరు/నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విలేకరుల పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనదని ఉల్లూరి సతీష్ కుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో ప్రముఖ న్యాయవాది ఉల్లూరి సతీష్ కుమార్ కార్యాలయం నందు సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రోజులలో విలేకరులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కార సాధన కొరకు విలేకరులు అంతా ఐక్యంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నుండి పొందాల్సిన వివిధ సదుపాయాల గురించి చర్చించారు. సమస్యల సాధన కొరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నిడదవోలు జర్నలిస్ట్స్ ఫెడరేషన్(ఎన్ జె ఎఫ్) అధ్యక్షులుగా బుగ్గే శివరామకృష్ణ శాస్త్రి( ఆంధ్రపత్రిక) ఉపాధ్యక్షులుగా దాసరి కరుణాకరన్( 1 టీవీ )కార్యదర్శిగా ఎన్. గురునాథరెడ్డి( మెగా 9 టీవీ- ఈరోజు )అదనపు కార్యదర్శిగా కర్రీ వాసు (సూర్య-వెలుగు) కోశాధికారిగా ఏ. ప్రసన్నరాజు (ప్రజాశక్తి )న్యాయ సలహాదారునిగా ఉల్లూరి సతీష్ కుమార్ (దళిత ప్రశ్న సంపాదకులు) సభ్యులుగా పి. సాయికుమార్ (మై టీవీ), విప్పర్తి. రత్న కిషోర్ (ఉదయ తరంగం), ఉసురుమర్తి జ్ఞానేంద్ర( ఆంధ్రడైరీ), దాసరి ప్రజ్వల్ కిరణ్ (అంగన్వాడి వాయిస్ ) తదితరులు ఎన్నికయ్యారు.

# ఎడిటర్ వాయిస్

## పౌరహక్కుల మేధావి బాలగోపాల్

పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాలగోపాల్ కే దక్కుతుంది. బాలగోపాల్ ఒక మధ్యతరగతి తెలుగు బ్రాహ్మణ దంపతుల ఎనిమిది మంది పిల్లలలో ఐదవ సంతానం- కందాళ్ళ పార్థనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్. . మాతామహుడు: ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. ఈటీవీ2లో చాలాకాలం తెలుగు వెలుగు కార్యక్రమానికి నిర్వాహకురాలు గా ఉన్న మృణాళిని సోదరి. ఒకటి నుంచి డిగ్రీ వరకు తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి, వరంగల్ లోని ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్డీ, 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకుడిగా ఉద్యోగంలో చేరిక, 1985లో ఉద్యోగానికి రాజీనామా, అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితం అయ్యారు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్ లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన భార్య వసంత లక్ష్మి ఆంధ్రజ్యోతిలో పాత్రికేయురాలు. వారికి ప్రభాత అనే కుమారుడు కలిగాడు. మానవతా విలువల కోసం పోరు సల్పుతు, ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌరహక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకు పోయిన నాయకుడాయన. ఎక్కడ అన్యాయం, వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడారు. ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను వెలుగు లోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్‌గా ముద్ర వేశారు. కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయాడని భావించి, మురికి కాల్వలో పడేసి వెళ్లగా పీడీఎస్‌యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారడానికి ఎంచుకున్నాడు. బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఎపిసిఎల్సి) ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఎపిసిఎల్‌సి లో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఎపిసిఎల్‌సిని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు. 26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. 1980 ల చివరలో మావోయిస్టులు చేసిన కిడ్నాప్ వరుస సందర్భంగా, అప్రమత్తమైన సంస్థ ప్రజా బంధు ( ?ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్ ) ఆయనను అపహరించి, ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్ కస్టడీ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులతో సంబంధాలున్నాయని అనుమానించిన ఈ సంస్థ, అపహరణకు గురైన పోలీసులను తిరిగి ఇచ్చిన తర్వాతే ఆయనను విడుదల చేసింది. బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాలలో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు. సోవియట్ యూనియన్ పతనంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలగోపాల్ సమాధానాల కోసం మార్క్సిజంలో మానవతావాద సంప్రదాయాలను అన్వేషించడం ప్రారంభించాడు. 90 వ దశకంలో ఆయన వ్యాసాలు ఈ మార్పును ప్రతిబింబిస్తాయి. రాజ్యహింస తోపాటు ప్రైవేటు హింసను ఆయన వ్యతిరేకించాడు. నక్సల్బరీ ఉద్యమానికి ఎంతోమంది కార్యకర్తలను అందించిన ఆయన ఆ తర్వాత క్రమంలో విప్లవపార్టీల వైఖరిని తప్పుబట్టారు. ప్రజలకు చేరువకావడంలో ఎం.ఎల్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించాయి. మావోయిస్టుల హింస చర్యలపై ఆయన బహిరంగంగా విమర్శించడం నక్సలైట్ల నుండి తీవ్ర విమర్శలను ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్‌లోని లాల్ ఘడ్ లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు... బాలగోపాల్‌ను లాల్ గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008 లో భారతదేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్తమైనవని ఆయన నమ్మాడు. అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ది చెందాడు. ఇపిడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, భూసేకరణ, ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సిపిఐ-మావోయిస్టుల మధ్య చర్చలు తదితరాలతో ఆయన పాత్ర విడదీయరానిది. రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు'



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# జర్నలిస్టులకు మార్గదర్శి కేశవ పిళ్ళై

దీవాన్ బహదూర్ పట్టు కేశవ పిళ్ళై (అక్టోబరు 8, 1860 – మార్చి 28, 1933) భారతీయ పాత్రికేయుడు, రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు. పట్టు కేశవపిళ్లే తమిళనాడు లోని ఉత్తర ఆర్కాటు జిల్లాలో వేంకటా చలం, సుబ్బమ్మ దంపతులకు 1860, అక్టోబరు 8వ తేదీన జన్మించాడు. మద్రాసులో ఆయన విద్యాభ్యాసం జరిగింది. ఆయన హిందూ పత్రికలో విలేఖరిగా తన వృత్తిని ఆరంభించాడు. అనంతపురం జిల్లా, గుత్తిలో కరెస్పాండెంటుగా ఆయన 1883లో తన 22వ యేట నియమించ బడ్డాడు. గుత్తిలో స్థిరపడటం వలన పట్టు కేశవ పిళ్లెను ప్రజలు "గుత్తి కేశవపిళ్లె"గా పిలువ సాగారు. 1893, అక్టోబర్ 4వ తేదీన బ్రిటిష్ సైనికుల అత్యాచారం నుండి యిద్దరు హిందూ మహిళలను రక్షించే క్రమంలో, గుత్తిలోని రైలుగేటు కీపర్ గూళిపాలెం హంపన్న ప్రాణాలొడ్డాడు. ఈ సంఘటనలో బ్రిటిష్ సైనికులు హంపన్నను కాల్చి చంపారు. ఆ సంఘటన గురించి గుత్తి కేశవపిళ్లే హిందూ పత్రికకు వార్త పంపగా అది ప్రముఖంగా ప్రచురింప బడింది. ఆ వృత్తాంత మంతా హిందూ పత్రికలో రావడంతో ఇంగ్లీషు వారు ఆంగ్లేయులకు ఏర్పరిచిన ప్రత్యేకమైన ప్రతిపత్తులతో కూడిన కోర్టులో విచారణ జరిపించారు. అప్పట్లో కేశవపిళ్లే గుత్తిలో సెకెండ్ గ్రేడ్ ప్లీడర్‌గా ప్రాక్టీసు చేసేవాడు. ఈ సంఘటన గురించి బ్రిటిష్ సైనికులకు వ్యతిరేకంగా వాదించాడు. అక్కడ ఉన్న జ్యూరీ వారిలో అధికభాగం ఆంగ్లేయులు, మిగిలిన కొందరు వారిపై జీవనము ఆధారపడిన దుబాసీలు. కోర్టులో ఆ స్త్రీలు వ్యభిచారులని, హంపన్న వ్యభిచరింప జేసే వ్యాపారియని వ్యభిచారం విషయంలో డబ్బు ఎక్కువ తక్కువల్లో తమను కొట్టవచ్చాడని, ఆత్మరక్షణార్థం తాము కాల్చామని వాదించారు. వాదనలు నడుస్తూండగానే ఈ కేసుకు వ్యతిరేకంగా హిందూ పత్రికలో చాలా వార్తలు, అభిప్రాయాలు వచ్చాయి. చివరకు ఈ కేసులో వ్యభిచార వ్యవహారంలో తేడా రావడంతోనే ఈ ఘటన జరిగిందని, హంపన్న అమాయకుడేమీ కాదన్న వ్యాఖ్యలు చేస్తూ ఈ నేపథ్యంలో ఆంగ్ల సైనికుల దోషం ఏమీ లేదని తేల్చి, నిర్దోషులుగా విడిచి పెట్టాయి. ఇది జాత్యహంకారానికి ఉదాహరణ అంటూ హిందూ దినపత్రిక తీవ్రంగా ఖండించింది. స్థానికులు



వీరుడైన హంపన్నపై ఇటువంటి ఘోరారోపణ చేయడాన్ని సహించలేక ఓ స్మారక చిహ్నం నిర్మించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీనికి హిందూ పత్రిక సహకరించి, తమ పత్రిక ద్వారా విరాళాల కోసం ప్రయత్నాలు సాగించింది. గ్రామస్థులు, హిందూ పత్రికవారూ విరాళాలిచ్చిన దాతల సహకారంతో హంపన్న స్మారక చిహ్నాన్ని నిర్మించారు. స్మారక సంఘం వారు స్మారక చిహ్నం నిర్మాణానికి తొమ్మిది చదరపు టడుగుల స్థలాన్ని కొనుగోలు చేసి, దానిపై ఏడడుగుల ఎత్తుగల రాతిస్తంభం నిలబెట్టి, దానికి ఓ స్మారక ఫలకాన్ని వ్రాయించి పెట్టారు. చుట్టూ ఆవరణ గోడ కూడా కట్టించారు. డిప్యూటీ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ సూపరింటెండెంట్ అయిన లెగ్గట్ ఈ స్మారక చిహ్నాన్ని చూసి చాలా ఆగ్రహించారు. దీనిని ఎలాగైనా తొలగించాలని సిఫారసు చేస్తూ చెన్నపట్టణ ప్రభుత్వం వారికి వ్రాశారు. గుత్తి విలేఖరి యైన కేశవపిళ్లైపై రాజద్రోహ నేరం కింద కేసు నమోదు చేయాలని ప్రయత్నాలు చేశారు. ఐతే ఇవేవీ జరగలేదు. మద్రాసు గవర్నర్ వెన్లక్ ప్రభుత్వం హంపన్న స్మారక చిహ్నం ఏమీ చేయరాదన్న ఉత్తర్వు చేసింది. ఈ సంఘటనతో హంపన్నతో పాటుగా గుత్తి కేశవపిళ్లే కూడా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించాడు. హంపన్న వృత్తాంతంతో ఆయనను స్థానిక ప్రభుత్వం గుర్తించి అనంతపురం, కర్నూలు, బళ్ళారి జిల్లాలకు జిల్లా బోర్డు సభ్యుడిని చేసింది. 1916–17లో ఇతడు కాంగ్రెస్ సభ్యునిగా చురుగ్గా పని చేశాడు. మద్రాసు శాసన మండలి సభ్యునిగా ఎన్నుకో బడ్డాడు. ఆయన గుత్తి తాలూకా బోర్డు ఉపాధ్యక్షుడిగా కూడా పని చేశాడు. మద్రాసు ఫారెస్ట్ సభ్యుడిగా సేవలను అందించాడు. శ్రీలంకలోని భారతీయ వర్తకుల కోరిక మేరకు అక్కడికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి ఒక నివేదికను సమర్పించాడు. 1885లో బొంబాయిలో జరిగిన స్వాతంత్ర్యోద్యమ ప్రథమ మహాసభకు అయన హాజరయ్యాడు. కేశవ పిళ్ళై గుత్తి నగరపాలికకు ఎన్నికై, నగర పాలిక సభ్యుడుగా పనిచేశాడు. చివరకు ఆయన నగర పాలికలకు ప్రాతినిధ్యం వహించడానికి మద్రాసు శాసన మండలికి ఎన్నికయ్యాడు. కేశవ పిళ్ళై తన తొలినాటి నుండి రాజకీయాల్లో ఆసక్తి చూపాడు. 1885, డిసెంబరు 28న బొంబాయిలో జరిగిన తొలి భారత జాతీయ కాంగ్రెసు సమావేశంలో, గుత్తి పట్టణ ప్రతినిధిగా పాల్గొన్నాడు. ఆ తర్వాత మరింత తీవ్రవాద పద్ధతులను అవలంబించి కొన్నిసార్లు జైలుకు కూడా వెళ్ళాడు. ఆయన జస్టిస్ పార్టీని, ద్రవిడ ఉద్యమాన్ని గట్టిగా వ్యతిరేకించాడు. కేశవ పిళ్ళై మద్రాసు శాసన మండలిలో చాలాకాలం పాటు పనిచేశాడు. సభలో అనేక సంస్కరణా ప్రతిపాదనలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకు దక్కుతుంది. పానగల్ రాజా ప్రభుత్వం ఆమోదించిన జైలు మార్గదర్శకాలు, జైలు కమిషన్ యొక్క ప్రధాన రచయిత పిళ్ళై. మద్రాసు అటవీ కమిషన్ సృష్టికర్త కూడా ఆయనే. ఆ తర్వాత కేశవ పిళ్ళై శాసనమండలి ఉపాధ్యక్షుడిగా కూడా ఎన్నికై, ఆ హోదాలో కొంతకాలం పని చేశాడు. ఆయన సేవా దృక్పథాన్ని గుర్తించి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం రావు బహద్దూర్ బిరుదుతో సత్కరించింది.

# ఐఎఎఫ్ సేవలు ప్రశంసనీయం



భారత వైమానిక దళ దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 8న నిర్వహించబడుతుంది. భారతీయ వైమానిక దళం (ఇండియన్ ఎయిర్ ఫోర్స్) 1932, అక్టోబరు 8వ తేదీన స్థాపించబడి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద వైమానిక దళంగా పేరు పొందింది. అంతటి శక్తివంతమైన వైమానిక దళం సేవలను గుర్తిస్తూ ప్రతిఏటా అక్టోబర్ 8న భారత వైమానిక దళ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది. 1932, అక్టోబర్ 8న ఏర్పడిన భారత వైమానిక దళం బ్రిటీష్ తరపున రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నది. దానికి గుర్తుగా 1945లో రాయల్ భారత వైమానిక దళంగా మార్చబడింది. 1950లో గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన తరువాత భారత వైమానిక దళంగా రూపాంతరం చెందింది. 1933 ఏప్రిల్ 1న భారత వైమానిక దళానికి తొలి ఎయిర్‌క్రాఫ్ట్ వచ్చింది. తొలినాళ్ళలో కేవలం ఐదు మంది పైలట్స్, ఒక ఆర్ఏఎఫ్ మాత్రమే ఉండేవారు. మొత్తం ఐదు ఆపరేషనల్ కమాండింగ్ కేంద్రాలను కలిగిన ఐఎఎఫ్‌కు 1,130 కంబోట్ 1,700 నాన్ కంబోట్ ఎయిర్‌కాఫ్ట్‌లు ఉన్నాయి. ప్రపంచం లోనే నాలుగో అతిపెద్ద వాయు సేనగా భారత వైమానిక దళం పేరు గడించింది. తనకు అవసరమైన సిబ్బందికి అధునాతన శిక్షణ ఇచ్చుకోవడం లోను, అధునాతన యంత్ర సామాగ్రిని సమకూర్చు కోవడం లోను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ముందంజలో ఉండటమే కాకుండా.. ప్రపంచ దేశాలతో పోటీ పడుతోంది. ఇండియన్ ఎయిర్ ఫోర్సుకు తొలి ఐదుగురు పైలట్స్‌గా విధులు నిర్వహించిన ఘనత హరీష్ చంద్ర సిర్కార్, సుబ్రొతో ముఖర్జీ, భూపేంద్ర సింగ్, అజాద్ భక్షా అవాన్, అమర్జీత్ సింగ్‌లు వైమానిక చరిత్ర పుటల్లో నిలిచిపోయారు. ఆ తర్వాత సుబ్రతో ముఖర్జీ తొలి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. తర్వాత రెండో ప్రపంచ యుద్ధానికి ముందు.. అంచలం చెలుగా మరింత మంది సిబ్బందిని ఐఎఫ్ నియమించుకుంది. వారిలో ఇంజనీర్, కే.కే.ముజుందర్, నరేంద్ర, దల్జీత్ సింగ్, హెన్రీ రంగనాథన్, ఆర్.హెచ్.డి సింగ్, బాబా మెహర్ సింగ్, ఎస్.ఎన్.గోయల్, ప్రితీపాల్ సింగ్, అర్జన్ సింగ్‌లు అగ్రగణ్యులు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో భారత వాయుసేన క్రీయాశీలక పాత్రను పోషించింది. తొలి వైమానిక దళ దాడి అర్కన్ ప్రాంతంలోని జపనీస్ సైనిక స్థావరంపై జరిపింది. ఈ యుద్ధం తర్వాత ఐఎఫ్‌ను అంచలం చెలుగా వృద్ధి చెందింది. యూఎస్‌కు చెందిన వుల్టీ వెంగీయన్స్, బ్రిటీష్ హాకర్ హరీకేన్, వెస్ట్‌లాండ్ లైసండర్ వంటి అధునాతన ఎయిర్ క్రాఫ్ట్‌లు ఐఎఫ్‌లో వచ్చి చేరాయి. అంతేకాకుండా.. భారతావనిపై పొరుగు దేశాలు దాడికి తెగబడినపుడల్లా భారత వాయుసేన కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా.. 1960లో ఏర్పడిన కాంగో సంక్షోభ సమయంలోను, 1962లో జరిగి ఇండో-చైనా పోరు సమయం లోను, కాశ్మీర్ కోసం 1965లో పాకిస్తాన్‌తో జరిగి యుద్ధ సమయంలోను, 1971లో జరిగిన బంగ్లాదేశ్ విముక్తి పోరాటం లోను, 1984లో జరిగి ఆపరేషన్ మేఘదూత్ లోను, 1988లో ఆపరేషన్ కాక్టస్ లోను, 1999లో జరిగిన ఆపరేషన్ సఫేద్ సాగర్ (కార్గిల్ వార్) సమయాల్లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సేవలు ప్రశంసనీయం. భారత వైమానిక దళంలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ క్రాఫ్ట్‌లలో మిగ్-21, హాల్-హెచ్‌జెటి - 36, హెచ్‌జెటి-16 కిరణ్, హెచ్‌పిటి-32 దీపక్, ఇయూషిన్ ××-78 ఎంకెఎల్, ఇయూషిన్ ××-76, అంటోనోవ్ ఎఎన్-32, అవ్రో-748, డిఓ-228, ఇఆర్‌జె-135, బోయింగ్ -737, ఎంఐ-8, ఎంఐ-17, ఎంఐ-35, ఎంఐ-26, హెచ్‌ఎఎల్ చేతక్, హెచ్‌ఎఎల్ చీటా, హెచ్‌ఎఎల్ ధృవ్, సుకోయ్-30, మిరజ్-2000, మిగ్-29, జగర్, మిగ్-27, మిగ్-23 తేజాస్, హెచ్‌ఎఎల్ లైట్ కంబోట్ హెలికాప్టర్, బహళ రవాణా, ఐఎల్-76 రకం ఎయిర్ క్రాఫ్ట్‌లతో పాటు. స్వదేశ ఎయిర్‌క్రాఫ్ట్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థ హాక్ ఎంకే-132 రకం వంటి పలు రకాలు వాయుసేన అమ్ముల పొదిలో ఉన్నాయి. 1.70 లక్షల మంది సిబ్బందితో, 1300 విమానాలతో భారత వైమానిక దళం ప్రపంచంలోనే నాలుగవ పెద్ద వైమానిక దళంగా ప్రసిద్ధి పొందింది. భారత వైమానిక దళంలో ఐదు ఆపరేషన్ కమాండ్‌లు, రెండు ఫంక్షనల్ కమాండ్‌లు ఉన్నాయి. ఆపరేషన్ కమాండ్‌లు: 1.సెంట్రల్ ఎయిర్ కమాండ్, అలహా బాద్‌బీ 2.ఈస్టర్ న్ ఎయిర్ కమాండ్, షిల్లాంగ్‌బీ 3.సదరన్ ఎయిర్ కమాండ్, తిరువనంత పురంబీ 4.సౌత్ వెస్టర్న ఎయిర్ కమాండ్, గాంధీనగర్‌బీ 5.వెస్టర్న ఎయిర్ కమాండ్, న్యూఢిల్లీబీ డిఫెన్స్ రీసెర్చ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది. దీన్ని 1958లో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ క్షిపణులను తయారు చేయడంలో ప్రధానపాత్ర వహిస్తుంది. మన దగ్గర ఉన్న క్షిపణుల్లో బ్రహ్మోస్.. సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి. ఇది ధ్వని కంటే వేగంగా ప్రయాణిస్తుంది. దీన్ని భారత్, రష్యాలు సంయుక్తంగా నిర్మించాయి. భారతదేశం లోని బ్రహ్మపుత్ర, రష్యాలోని మాస్కోవా నది పేర్ల మీద ఈ క్షిపణికి బ్రహ్మోస్ అని పేరు పెట్టారు. దీని పరిధి 290 కిలోమీటర్లు. ఇది 2.5 నుంచి 2.8 మ్యాక్ వేగంతో ప్రయాణిస్తుంది. నిర్భయ్ అనే సబ్‌సోనిక్ క్షిపణి.. ధ్వని వేగం (1 మ్యాక్) కంటే తక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. దీని పరిధి 1,000 కి.మీ. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత పాకి స్తాన్‌తో 1947, 1965, 1971, 1999లలో నాలుగుసార్లు యుద్ధాలు చేసింది. 1971లో పాకిస్తాన్‌ను ఓడించి, బంగ్లాదేశ్ ఏర్పాటుకు కారణమైంది. 1962లో చైనాతో యుద్ధం చేసింది. భారత రక్షణ వ్యవస్థలో త్రివిధ దళాలు ఉన్నాయి. అవి.. సైనిక దళం, వైమానిక దళం, నావికా దళం. భారత రక్షణ దళాల అధిపతి (సుప్రీం కమాండర్) రాష్ట్రపతి. రక్షణ దళాలు కేంద్ర రక్షణ శాఖ మంత్రి ఆధీనంలో ఉంటాయి. ప్రస్తుత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. త్రివిధ దళాల ప్రధాన కార్యాలయాలు న్యూఢిల్లీలో ఉన్నాయి.



## టిడిపి గూటికి చేరిన వైసీపీ నాయకులు

### పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గంలో ఆదివారపు పేట గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ, గ్రామ కన్వీనర్,ఇతర వైస్సార్సీపీ నాయకులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ సమక్షంలో టిడిపి పార్టీలోకి చేరారు. వీరందరినీ మంత్రి సుభాష్,వాసంశెట్టి సత్యంలు పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు.టిడిపిలో చేరిన వారిలో ఆదివారపుపేట వైసిపి ఎంపీటీసీ బల్ల సుధాకర్ రావు,గ్రామ కన్వీనర్ అల్లక భాస్కరరావు, పంచాయతీ వార్డు మెంబర్ యర్రా సత్తిబాబు,పిచ్చుక వీరభద్రరావు, మచ్చ వెంకటేశులు, ఉప్పు గంగాధరం, నక్కిన చంద్రరావు, ఏడెళ్ల శ్రీను, వరప్రసాద్ తో పాటు 20 మందికి పైగా తెలుగుదేశం పార్టీలో చేరారు.కూటమి ప్రభుత్వంపై మరియు మంత్రి సుభాష్ నియోజవర్గంలో చేస్తున్న అభివృద్ధి,సామాజిక సేవా కార్యక్రమాలకు ఆకర్షితులమై వైసిపి పార్టీని వీడి తెలుగుదేశంలో చేరామన్నారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సంక్షేమం సమపాళ్ళలో జరుగుతుందని విశ్వసించి,సీఎం చంద్రబాబుపై అపారమైన నమ్మకంతో పార్టీలోకి రావడం సంతోషకరమన్నారు. ఆదివారపుపేటలో ఉన్న చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తానని అన్నారు.కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామన్నారు.గత వైసిపి ప్రభుత్వం బీసీల నడ్డి విరిచిందని వారికోసం ఉద్దేశించిన ఆదరణ పథకాన్ని ఎత్తివేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1000 కోట్లతో ఆదరణ పథకాన్ని తిరిగి పునః ప్రారంభించామన్నారు. బీసీలకు సంబంధించిన అన్ని పథకాలు ఎత్తివేసి వైసిపి అత్యంత హేయంగా పాలించిందన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు అండగా ఉండి, వారి అభివృద్ధికి పెద్దపీట వేసి వేశామన్నారు. హామీల్లో భాగంగా మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి రూ.25 వేలు అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు చందకన్న బాబులు,కొండా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్లో

## వ్యాసరచన, వక్తృత పోటీలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, అమలాపురం మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్లో జీఎస్టి వారోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత విభాగాలలో సీనియర్స్, జూనియర్స్ కేటగిరీలుగా పోటీలు నిర్వహించడం జరిగింది ఈ పోటీల్లో జిల్లాలోని మండలాలకు చెందిన 22 మండలాల నుండి మండల స్థాయి ఫస్ట్ సెకండ్ వచ్చినవారు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా విచ్చేసిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ షేక్ సలీమ్ బాషా, డిప్యూటీ కలెక్టర్,అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డనేటర్, జి మమ్మీ పర్యవేక్షంచారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ శాఖ డిప్యూటీ కమీషనర్ రవికాంత్, కమర్షియల్ టెక్స ఆఫీసర్ ఎస్ తిరుమలరావు, జిల్లా నోడల్ ఆఫీసర్ బివిఎస్ఆర్కెవెన్ శర్మ, సిఎమ్ఓ, బివివి సుబ్రహ్మణ్యం, డిసిఈబి సెక్రటరీ బీరా హనుమంత రావు, ఎపిఓ జిసిడిఓ ఎమ్ఎకె భీమరావు, ఎఎల్ఎస్ రమేష్, డిప్యూటీ ఈఓ జి.సూర్యప్రకాశం పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా, కడలి సాయిరాం, ఎస్.శ్రీనివాసరావు, యర్రంశెట్టి బాబీ, కె.సుబ్బారాయి శర్మ, కాలే. దుర్గాభవాని, చంద్రరావు కుమార్, వరదా శ్రీనివాస్, బిఎన్ వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.ఘన సత్యనారాయణ కోఆర్డినేటర్గా వ్యవహరించారు.

## భారత రాజ్యాంగ విలువలు కాపాడుకుందాం..

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దాడిపై నిరసన



**రామచంద్రపురం, టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ రామకృష్ణ గవాయ్ పై జరిగిన దాడిని ఖండిస్తూ రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు అధ్యక్షతన మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు.గోపాలరావు మాట్లాడుతూ భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవ్యవస్థ అతి పవిత్రమైన సర్వోన్నత ఉన్నత స్థాయిన్యాయ వ్యవస్థని రాజ్యాంగ వ్యవస్థకు రక్షకుడని అటువంటి అధిపతిపై రాకేష్ కిషోర్ అనే న్యాయవాది దాడికి యత్నించడం చాలా విచారకరమని ఆ దాడిని ఖండిస్తున్నామని అన్నారు.అతన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుండి వెంటనే సస్పెండ్ చేసి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు వరాహ నరసింహమూర్తి, జాయింట్ సెక్రటరీలు పి.జానకి,ఎన్.శేషు కుమార్,ట్రెజరర్ చింతపల్లి శ్రీనివాసు,సీనియర్ న్యాయవాదులు ఆర్.ఆర్.కె కొండేపూడి భరత్ కుమార్,లఖాన్ పద్మ కమల కుమారి,కెవివి సత్యనారాయణ, సూరంపూడి గంగాధరం, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ములకల శ్రీహరి, దొమ్మాలపాటి సత్యనారాయణ, బొడ్డపాటి సురేష్ కుమార్, ఎస్.బి ఎస్.కుమార్ స్వామి, కాకినాడ శ్రీనివాస్ రావు,జూనియర్ న్యాయవాదులు మహిళా న్యాయవాదులు న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

### వికాసా జాబ్ మేళాలో ఎంపికైన వారికి

## నియామక ఉత్తర్వులు అందించిన కలెక్టర్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరుద్యోగ యువత ప్రగతి కోసం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వికాస సంస్థ అవిరళ కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన మినీ జాబ్ మేళాలో సుమారు 123 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరికి ముఖాముఖి ఇంటర్వ్యూలు అర్హత ధ్రువ పత్రాల పరిశీలన చేసి 81 మంది అభ్యర్థులను ఉద్యోగాల కల్పన కై ఎంపిక చేసి నియమాకపు ఉత్తర్వు లు అందించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు సేవా రంగాల సమన్వయం తో వికాస సంస్థ నిరుద్యోగ యువత భవిష్యత్తు కొరకు కృషి చేస్తుందన్నారు. జాబ్ మేళా అనేది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఒక అద్భుత కార్యక్రమమని నిరుద్యోగ యువత ఈ యొక్క అవ కాశాన్ని సద్వినియోగ పరుచుకుని మొదటిగా వచ్చిన ఉద్యోగాన్ని బేస్ గా చేసుకుని తమ కాళ్ళ మీద తాము నిలబడి నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా అంచెలంచెలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. యువత కెరీర్ అభివృద్ధికి, కుటుంబ సౌభాగ్యానికి, సమాజ ప్రగతికి జాబ్ మేళాలు ఎంత గానో ఉపకరిస్తాయన్నారు జాబ్ మేళా ద్వారా వివిధ రంగాల్లో ఐటీ, ఫార్మా, కెమికల్స్, ఆటో మొబైల్, ఎలక్ట్రానిక్స్, ఫైనాన్స్, ఎనర్జీ మొదలైన రంగాలలో అవకాశాలను చేజిక్కించుకుని జీవన ప్రమాణాలు మెరుగు వచ్చు కోవాలని ఆయన యువతకు ఉద్బోధించారు. జాబ్ మేళా నిర్వహణలో అర్హతా ప్రమాణాలు సాధారణంగా పదవ తరగతి ఉత్తీర్ణత నుండి డిగ్రీలు వరకు మరియు వివిధ రకాల నైపుణ్యాల ఆధారంగా అభ్యర్థులు మంచి అవకా శాలను పొందాలన్నారు. జాబ్ మేళా నిరుద్యోగ యువత కెరీర్ కు పునాది వేయడానికి ఉద్యోగ అవకాశాలను స్వీకరించ డానికి అనువైన వేదికని దీన్ని సద్వినియోగపరు చుకుని జీవితంలో స్థిరప డాలన్నారు. ప్రభుత్వ రంగంలోనే కాకుండా ప్రైవేట్ రంగంలో ఎన్నో, అద్భుత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని వాటిని అందిపుచ్చుకొని మెరుగైన జీవనాన్ని పొందా లన్నారు. జాబ్ మేళాలు యువతకు, సమాజ అభి వృద్ధికి దోహదపడతాయన్నారు. ఉద్యోగాన్ని వెతు కుతున్న వారిని, ఉద్యోగాలను భర్తీ చేయాలనుకునే కంపెనీలతో కలిపే జాబ్ మేళా వేదికలను నిరుద్యోగ యువత సద్వి నియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో నిరుద్యోగాన్ని తగ్గించేం దుకు ప్రైవేటు సంస్థలు తమ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నా యని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసు కోవాలన్నారు ఎంపికైన ఉద్యో గార్దులు కంపెనీలకు వెళ్లిన తరువాత వారి యొక్క యోగ క్షేమాలను ఆయా కంపెనీల సహకా రంతో పర్యవేక్షించాలని ఎవరికీ ఏ అసౌకర్యం కలుగ కుండా మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వికాస సంస్థ ప్రతి నిధులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో వికాస పథక సంచాలకులు కె లచ్చారావు, మేనేజరు గోళ్ళ రమేష్, హెచ్ ఆర్ పవన్ కుమార్ ఎం రవితేజ తదితరులు పాల్గొన్నారు

## 20 సెంట్లు భూమిలో మాదిగ కళ్యాణ మండపం



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ స్థాయి టిడిపి ఎస్సీ మాదిగ నాయకులు మంత్రి వాసంశెట్టి సుభాష్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మాదిగ కులస్తులకు పలు సమస్యలుపై చర్చించారు. అందులో ప్రధానంగా నియోజకవర్గంలో కళ్యాణ మండపం నిర్మాణం కోసం మరియు అంబేద్కర్, జగన్ జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటు కోసం విన్నవించగా మంత్రి సుభాష్ సానుకూలంగా స్పందించారు.వెంటనే భవన నిర్మాణం కోసం ద్రాక్షారామ వేగంపేటలో 20 సెంట్లు భూమి ఏర్పాటు చేసి అందులో కళ్యాణ మండపం నిర్మిస్తామని హామీ ఇచ్చారు.మాదిగ నాయకులు హార్షం వ్యక్తం చేసి మంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు.

### "సేవ్ ది గర్ల్ చైల్డ్" కార్యక్రమం

## ఘన విజయవంతం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా "సేవ్ ది గర్ల్ చైల్డ్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష మరియు జిల్లా సైన్స్ విభాగం సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్. కె.సలీం భాషా, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మమ్మి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.హను మంతరావు, సెక్టోరియల్ ఆఫీసర్లు బి.వి.వి. సుబ్రహ్మణ్యం, రమేష్, ఎం.వి.వి. సత్యనారాయణ, ఎం.ఎ.కే. భీమారావు, జిల్లా ఉప విద్యాశాఖాధికారి జి. సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, జిల్లా జీఎస్టీ కార్యక్రమాల కోఆర్డినేటర్ శర్మ, మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఘన సత్యనారాయణ పాల్గొన్నారు.

**విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తేవడమే లక్ష్యం**

"సేవ్ ది గర్ల్ చైల్డ్" అనే కాన్సెప్ట్లో భాగంగా వ్యాసరచన, వాదవివాద (డిబేట్), చిత్రలేఖనం (డ్రాయింగ్) పోటీలను నిర్వహించారు. ఈ పోటీల ద్వారా బాలికల ఆలోచనా శక్తి, సృజనాత్మకత, సామాజిక అవగాహన ప్రతిభాపాటవాలు స్పష్టమయ్యాయి.

**వ్యాసరచన పోటీలు:**

ప్రథమ బహుమతి - జిల్లా ప్రజా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల, మండపేట
ద్వితీయ బహుమతి - మహాత్మా గాంధీ మున్సిపల్ హై స్కూల్, అమలాపురం
తృతీయ బహుమతి - జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, చేయరు

**డ్రాయింగ్ పోటీలు:**

ప్రథమ బహుమతి - జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, వాడపల్లి
ద్వితీయ బహుమతి-జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, దంగేరు
తృతీయ బహుమతి - ఎస్.జి. మున్సిపల్ హై స్కూల్, మండపేట

**డిబేట్ పోటీలు:**

ప్రథమ బహుమతి - జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, కె. జగన్నాథపురం
ద్వితీయ బహుమతి -జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, ముంగండ
తృతీయ బహుమతి - జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, గొల్లవిల్లి

**బాలిక విద్య - సమాజానికి వెలుగుదారి**

ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.కె. సలీం భాషా మాట్లాడుతూ,"ప్రస్తుతం కోనసీమ జిల్లాలో అన్ని రంగాలలోనూ బాలికలు ముందంజలో ఉన్నారు. బాలిక విద్యా ప్రోత్సాహం సమాజ అభివృద్ధికి బలమైన పునాది. బాలిక శిశు మరణాలను నిర్మూలించి, సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు.అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. మమ్మి మాట్లాడుతూ ప్రభుత్వం బాలిక విద్య, మహిళా సాధికారత కోసం వివిధ పథకాలను అందిస్తోంది. విద్యారంగంలో ప్రభుత్వ ప్రోత్సాహం సమృద్ధి దశలో ఉంది. సమిష్టి కృషి ద్వారానే స్థిరమైన మార్పు సాధ్యమవుతుంది" అని తెలిపారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి జి.సూర్యప్రకాశం మాట్లాడుతూ "సైన్స్, విద్య, సామాజిక అవగాహన కలగలిపిన ఈ పోటీలు విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచనను పెంపొందిస్తాయి" అన్నారు. కార్యక్రమం చివరలో విజేతలకు ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేయబడగా, నిర్వాహకులు మరియు పాల్గొన్న ఉపాధ్యాయులు ప్రశంసలు అందుకున్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలో పిడిఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బత్తుల సిద్దు పుట్టినరోజు వేడుకలు కాకినాడ జిల్లా సాధన కమిటీ జేఏసీ కన్వీనర్ న్యాయవాది మాగాపు అమ్మిరాజు పిలుపు మేరకు జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. న్యాయవాది అమ్మిరాజు ఆధ్వర్యంలో కేకును కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ వేడుక జరుపుకున్నారు.సిద్ధూ జన్మదిన సందర్భంగా లాయర్ అమ్మరాజు తన సందేశాన్ని అందజేశారు.

## ఆటో డ్రైవర్ను పరామర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్

### శెట్టి బలిజ సామాజిక వర్గ నేతలతో కలిసి బాధితులకు పరామర్శ
### నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు
### మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి..



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యం మత్తులో ఆటో డ్రైవర్, ప్రయాణికులపై దాడి చేసిన ఘటనలో బాధితులైన వాసంశెట్టి రామకృష్ణ, అనుసూరి అన్నపూర్ణ తదితరులను మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ మంగళవారం వి.సావరం గ్రామంలో వారి గృహం వద్ద పరామర్శించి,వారిని ధైర్య పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం తెల్లవారుజామున జరిగిన సంఘటన నిందితుల నేర స్వభావానికి నిదర్శనమని ఇట్టి పరిస్థితులను ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. ఈ సమస్య కేవలం ఒక సామాజిక వర్గానికి చెందినది కాదని, నిందితుల వెనుక ఉన్నది ఎంతటి పెద్ద వారైనా ఉపేక్షించేది లేదని, అందరినీ కలుపుకుంటూ న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని బాధితులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ శెట్టిబలిజ సంఘ అధ్యక్షులు కొప్పిశెట్టి శ్రీనివాస్ (డ్రైవర్ శీను), రాయుడు సురేష్, మండపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేష్, మారేడుబాక సర్పంచ్ రాయుడు గంగరాజు, మండపేట 13వ వార్డు ఇంచార్జ్ పలివెల వెంకన్న, సొసైటీ డైరెక్టర్ గుత్తుల శ్రీనివాస్, సోమేశ్వరం దేవస్థాన కమిటీ చైర్మన్ గుత్తుల పవన్ కుమార్, వెదురుపాక సొసైటీ చైర్మన్ పిల్లి గణేష్ ,మాజీ సర్పంచ్ వాసంశెట్టి గాంధీ, మండల తెదేపా సోషల్ మీడియా కన్వీనర్ కేతా సతీష్ కుమార్ (నాని), శెట్టిబలిజ సంఘ సభ్యులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



# కత్తిపూడిలో రూ.200 కోట్ల మైనింగ్ అక్రమ తవ్వకాలు...!

**ఏడాదిన్నరలో 70 ఎకరాల్లో కంకర తవ్వేసారు - ప్రాంతీయ గనులు, ఖనిజాలశాఖ నిఘా తనిఖీలు**
**ఎన్ని ఎకరాల్లో, ఎన్ని టన్నులో తేలని వైనం - లెక్కలు ఇప్పట్లో తేలవంటున్న అధికారులు**
**రెండు లారీలు, మూడు జేసీబీలు, ఒక ట్రాక్టర్ సీజ్ - గుర్తు తెలియని నిందితులపై కేసులు నమోదు**





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకటా, అరా... ఏకంగా సుమారు 70 ఎకరాల్లోని రూ. 200 కోట్ల విలువ చేసే మైనింగును అక్రమంగా తవ్వేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నిర్భయంగా లక్షలాది రూపాయల కన్నం వేసారు. పంచాయతీ, రెవిన్యూ, గనులు, ఖనిజాలు, పర్యావరణ, అటవీ శాఖల అనుమతులు లేకుండా ఏడాదిన్నర కాలంలో మొత్తం ఒక కొండ కొండనే మొత్తంగా నామ రూపాలు లేకుండా తవ్వేశారు. ఇది చాలన్నదన్నట్టు రెండో కొండకు కూడా విస్తరించి తవ్వేస్తున్నారు. టన్నులు, టన్నుల కొద్దీ కంకర మట్టిని భారీ టిప్పర్ లారీల్లో నిత్యం రేయింబవళ్లు తవ్వుకుని బహిరంగంగా తరలించుకు పోతూంటే స్థానిక సంస్థలైన పంచాయతీ, రెవిన్యూ, మండల ప్రజా పరిషత్తు, అటవీశాఖల అధికారులు మాత్రం స్వచ్ఛందంగా కళ్ళు మూసుకుని ధృతరాష్ట్ర పాలన కొనసాగిస్తున్నారు. ఈ అతి భారీ అక్రమ మైనింగ్ దోపిడీని కళ్ళారా చూసిన ఏలూరు ప్రాంతీయ గనులు, ఖనిజాల శాఖ నిఘా అధికారులు గుడ్లు తేలేసారు. ఎన్ని ఎన్ని ఎకరాల్లో ఎన్ని టన్నుల మైనింగును దోచేసారో కొలతలు వేసేందుకు రెవిన్యూశాఖ సర్వేయర్లు ఆపసోపాలు పడుతున్నారు. ఏలూరు ప్రాంతీయ గనులు, ఖనిజాల శాఖ నిఘా అధికారులు మీడియాకు ఏ మాత్రం వివరాలనూ వెల్లడించని ఈ భారీ దోపిడీకి సంబంధించి లభించిన ప్రాథమిక సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి-నెల్లిపూడి రోడ్డులోని కోళ్ళ ఫారం వెనుక ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 1లోని చినకొండ, పెదకొండలపై ఏడాదిన్నర కాలంగా జరుగుతున్న అక్రమ మైనింగు నిగ్గు తేల్చేందుకు ఏలూరు ప్రాంతీయ గనులు, ఖనిజాలశాఖ నిఘా బృందం (ఏలూరు మైన్స్, మినరల్స్ రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్) అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని అక్రమ మైనింగ్ మాఫియా దోపిడీపై శంఖవరం సామాజిక సేవా కర్త మేకల కృష్ణ ఏడాది కాలంగా ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో శంఖవరం మండలంలోని వజ్రకూటం, కత్తిపూడి, నెల్లిపూడి, కొంతంగి, శంఖవరం, ఎస్.జగ్గంపేట, అన్నవరం, మండపం గ్రామాల్లోని అక్రమ మైనింగును అరికట్టాలని, ఈ క్వారీలను తాను స్వయంగా తనిఖీ అధికారులకు చూపించ గలనని సెప్టెంబర్ 8,9 తేదీల్లో జిల్లా ఉన్నత అధికారులు, మైనింగ్ శాఖల అధికారులకు మేకల కృష్ణ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఏలూరు ప్రాంతీయ గనులు, ఖనిజాలశాఖ నిఘా బృందం సహాయ సంచాలకులు కిషోర్ బాబు ఆదేశాల మేరకు రాయల్టీ ఇన్స్పెక్టర్ జంగం గంగాధర్, టెక్నికల్ అసిస్టెంట్ గుర్రపు ప్రవీణ్ కుమార్ మంగళవారం మధ్యాహ్నం 11 గంటలకు తనిఖీలను నిర్వహించారు. శంఖవరం మండలం మొత్తం మీద ఒక పెదమల్లాపురం పంచాయతీ పరిధిలోని సిద్దివారిపాలెం సర్వే నెంబర్ 39 లో 15 ఎకరాలకు 31.07.20027 న ఎస్.నారాయణరెడ్డికి (గుర్తింపు నెంబరు 411070381)కి తప్ప మిగతా ఎవరికీ, ఏం గ్రామంలోనూ మైనింగ్ లీజులను ఇప్పటికీ కూడా ఇవ్వక పోవడంతో కత్తిపూడిది అక్రమ మైనింగుగా అధికారులు గుర్తించారు. స్థానిక వీఆర్వో పాండవులు సమక్షంలో గ్రామ సర్వేయర్లు అప్పారావు, శివరామ్ లతో సర్వే ప్రారంభించారు. అయితే సాయంత్రానికి సర్వే పూర్తి కాలేదు. ఎన్ని ఎకరాల్లో ఎన్ని టన్నుల మైనింగును తవ్వేసారు. ప్రభుత్వ ఖజానాకు ఎంత నష్టం సంభవించిందీ లెక్కలు ఇంకా తేలలేదు. బుధవారం కూడా ఈ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది. అక్రమ మైనింగ్ వద్ద లభించిన రెండు లారీలు, మూడు జేసీబీలు, ఒక బ్లాస్టింగ్ కటింగ్ ట్రాక్టర్ను అధికారులు సీజ్ చేశారు. గుర్తు తెలియని నిందితులపై కేసును నమోదు చేశారు.

**నిందితుల పేర్లను చెప్పడం లేదు : ఏడాది కిషోర్ బాబు**

ఈ అక్రమ మైనింగ్ తవ్వకాల నిఖీలపై ఏలూరు ప్రాంతీయ గనులు, ఖనిజాలశాఖ నిఘా బృందం సహాయ సంచాలకులు కిషోర్ బాబును రాత్రి 8.02 గంటలకు చరవాణీలో "విశ్వం వాయిస్" విలేఖరి జక్కల నాగసత్యనారాయణ వివరణ కోరగా... కొద్దిపాటి సమాచారాన్ని చూచాయగా చెప్పారు. తనిఖీలు, విచారణ ఇంకా పూర్తి కాలేదు. ప్రస్తుతానికి మూడు ఎకరాల్లో మాత్రమే సర్వే పూర్తి అయింది. అక్రమ మైనింగ్ నిర్వాహకుల పేర్లను స్థానికులు వెల్లడించడం లేదు. మేకల కృష్ణ ఫిర్యాదు చేసినట్టు ఇంకా మరిన్ని చోట్ల కూడా తనిఖీలు చేసి పూర్తి సమాచారాన్ని బుధవారం వెల్లడిస్తామని వివరణ ఇచ్చారు.








# డాక్టర్ పిల్లా చంద్రంకు అరుదైన గౌరవం...!



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అఖిల భారత పాఠశాలల పేరెంట్స్ అసోషియేషన్ (అప్పా) చైర్మన్ డాక్టర్ పిల్లా చంద్రంను అరుదైన గౌరవం వరించింది. ఈయన్ని దక్షిణ భారతదేశ సమన్వయకర్తగా, ఆసియా ఇంటర్ నేషనల్ సాంస్కృతిక అకాడమీకి సలహా మండలి సభ్యులుగా ఆసియా ఇంటర్ నేషనల్ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం (యు.ఎస్.ఏ) నియమించింది. ఈ మేరకు కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం కొడవలికి చెందిన డాక్టర్ చంద్రంకు అధికారిక నియామక పత్రాన్ని సోమవారం అందజేసింది. ఈ నియామక పత్రంలో దక్షిణ భారత దేశంలో సలహా,ట్క మండలి సభ్యుల విధి విధానాలను, భాధ్యతలను ఆసియా ఇంటర్ నేషనల్ సాంస్కృతిక పరిశోధన విశ్వ విద్యాలయం వివరంగా తెలిపింది. ఈ సందర్భంగా డాక్టర్ పిల్లా చంద్రం మీడియాతో మాట్లాడారు. తాను గత కొన్నేళ్లుగా అప్పా వేదికగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యార్థులు, విద్యారంగం అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా తనకు ఈ అదనపు సేవా అవకాశం కలిగింది అన్నారు. తాను ఈ నూతన బాధ్యతలతో నిరంతరం విశ్వ విద్యాలయం డైరెక్టర్‌తో సంప్రదింపులు జరుపుతూ విద్యా, విద్యార్థుల అభివృద్ధికి వ్యవహారాల విభాగపు చైర్మన్ తో కలిసి సలహాలు ఇస్తూ సహకరిస్తానన్నారు. అంతే కాకుండా సెనేట్ సభ్యులు సిఫారసు చేసిన విధానాలు, కార్యక్రమాలపై సమీక్షిస్తా అన్నారు. యూనివర్సిటీ కమ్యూనిటీ సభ్యులతో కలిసి పనిచేస్తూ విద్యార్థుల వసతి సదుపాయాలపై కొత్త దిశా నిర్దేశాలను ప్రతిపాదిస్తామన్నారు. వనరులు, పర్యావరణ కమిటీతో కలిసి విశ్వవిద్యాలయ విద్యా మిషన్‌కు సంబంధించిన విషయాలపై చర్చిస్తానని పేర్కొన్నారు. ఈ కమిటీలో పని చేస్తూ విద్యా, విద్యార్థుల అభివృద్ధికి సేవ చేయడానికి అవకాశం కల్పించిన ఆసియా ఇంటర్ నేషనల్ సాంస్కృతిక అకాడమీకి దక్షిణ భారతదేశ సలహా మండలి సభ్యునిగా నియమించిన ఆసియా ఇంటర్ నేషనల్ సాంస్కృతిక పరిశోధన విశ్వ విద్యాలయ యాజమాన్యానికి డాక్టర్ పిల్లా చంద్రం కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** బోయవాడైనా ఒక సాధారణ మనిషి మహా ఋషిగా మరి రామాయణం వంటి దివ్యమైన గ్రంథాన్ని రచించిచడం గొప్ప విశేషమని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. ఆదికవి వాల్మికి జయంతిని పురస్కరించుకుని మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ,జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, రంపచోడవరం ఐటీడీఏ పీవో బి.స్మరన్ రాజ్, బీసీ సంక్షేమ సంఘాల నాయకులు, అధికారులతో కలిసి మహర్షి వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు అలంకరించారు. ఈ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. భారత ఇతిహాసాలలో తొలి కావ్యంగా పేరుగాంచిన రామాయణం గ్రంథాన్ని సమాజానికి అందించిన మహర్షి వాల్మీకి జీవితం మనకందరికీ ఆదర్శప్రాయం అని అన్నారు. బోయవాడైనా ఒక సాధారణ మనిషి మహా ఋషిగా మరి రామాయణం వంటి దివ్యమైన గ్రంథాన్ని రచించిచడం గొప్ప విశేషమన్నారు. వాల్మీకి అకుంఠిత దీక్షతో చిరకాలం తపస్సు ఫలితంగా స్వయం మహర్షి అయ్యారన్నారు. రామాయణం వంటి మహాకావ్యాన్ని ఈ సమాజానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి ఆదికవి వాల్మీకి అని ఆయన కొనియాడారు. మహర్షి వాల్మీకి జీవిన విధానాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎం.లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, సెట్రాజ్ సీఈవో కెవస్వీ కాశీ విశ్వేశ్వరరావు, కాకినాడ, పెద్దాపురం అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారులు, బీసీ సంక్షేమ సంఘాల నాయకులు, వెనకబడిన తరగతుల శాఖ సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం..

**ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్**





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో బీచ్ పార్క్, బీచ్ ఫ్రంట్ పనులు పూర్తి చేయడం జరిగిందని కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఈ కార్యక్రమానికి కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఇతర ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై కవుడా బీచ్ పార్క్, బీచ్ ఫ్రంట్ అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో రూ. 4.58 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన కావుడా బీచ్ పార్క్, బీచ్ ఫ్రంట్ అభివృద్ధి పనులకు పూర్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. భారత రక్షణ రంగంలో నౌకాదళంలో సుదీర్ఘంగా 30 సంవత్సరాల పాటు సేవలు అందించిన ఎయిర్ క్రాఫ్ట్ ను కాకినాడ బీచ్ పార్క్‌లో ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామం అన్నారు. అత్యంత బరువు, వేగంగా ప్రయాణించే ఈ ఎయిర్ క్రాఫ్ట్ భారత రక్షణ రంగం నౌకాదళంలో విశేష సేవలు అందించిందన్నారు. సముద్ర తీరం కలిగిన కాకినాడ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఎంతో ఆస్కారం ఉందని కాకినాడ జిల్లా వాసులకు ఆహ్లాదకర వాతావరణం అందించడంతోపాటు భారత సాయుధ దళాల కార్యకలాపాలపై యువతలో స్ఫూర్తిని రగిలించే లక్ష్యంతో ఈ విమాన ప్రదర్శనశాల ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్ వైజాగ్ తర్వాత మన కాకినాడ బీచ్ పార్కులో ఏర్పాటు చేయడం జరిగిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలతో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు కూడా ఎంతో ఆహ్లాదం నింపుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పాఠశాలల్లోని విద్యార్థులకు ఇక్కడకు తీసుకొచ్చి ఈ యుద్ధ విమానం గురించి వివరించాలని ఆయన సూచించారు. నామమాత్రపు ఫీజు 20 రూపాయలు మాత్రమే తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ఎయిర్ క్రాఫ్ట్ ను సందర్శించి పరిశీలించడం ద్వారా విద్యార్థులు, యువతలో మంచి స్ఫూర్తిని పొందవచ్చన్నారు. దేశవ్యాప్తంగా కలకత్తా, విశాఖపట్నం తర్వాత మూడోవది గా కాకినాడలో ఇటువంటి యుద్ధ విమానం ప్రదర్శనశాల ఏర్పాటు కావడం మనకందరికీ గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో యువత నేవీ, నౌకాదళ ఇతర మంచి రంగాల్లో రాణించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడతాడని అన్నారు. ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ మాట్లాడుతూ కాకినాడ బీచ్ అభివృద్ధి చేయడంలో ప్రజలు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పొందుతారని ఆమె అన్నారు. ఇక్కడికి వచ్చి ప్రజలు ఎంజాయ్ చేయాలని ఆమె సూచించారు. గతంలో బీచ్ ఏ విధంగా ఉండేది ఇప్పుడు ఏ విధంగా ఉన్నాదో ప్రజలు గమనించాలని, కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు బీచ్ ను సుందరంగా అభివృద్ధి చేయడం జరిగిందని ఆమె తెలిపారు. పేరా బత్తుల రాజశేఖరం మాట్లాడుతూ సుమారు ఐదు కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతం తూర్పుగోదావరి జిల్లాలో ఎంతో సుందరంగా ఉందని గోవా, విశాఖపట్నం తర్వాత మన బీచ్ అంత సుందరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇప్పుడు ప్రస్తుతం వారాంతరంలో 500 నుండి 1000 మంది పర్యాటకులు వచ్చి ఇక్కడ ఆనందాన్ని పొందుతున్నారని అలా కాకుండా 5 వేల నుండి 10 వేల మంది పర్యటకులు వచ్చి ఇక్కడ ఎంజాయ్ చేసే విధంగా అన్ని వసతులు సమకూర్చాలని ఆయన సూచించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు నానాజీ మాట్లాడుతూ కాకినాడ గ్రామీణ నియోజకవర్గంలో ప్రాంతంలో ఉన్న బీచ్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తాను తొలిసారిగా శాసనసభ్యునిగా ఎన్నికైనటువంటి నుంచి ఒక ప్రత్యేక విజన్ తో కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కాకినాడలో అభివృద్ధి పనులు చేయడంతో పాటు కాకినాడ బీచ్ ను సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందని ఆయన తెలిపారు. కాకినాడ తీర ప్రాంతంలో ఉన్న మత్యకారులకు వారి జీవనోపాధి వేట ఒకటే కాకుండా పర్యాటకంలో కూడా వారిని భాగస్వామ్యం చేసి వారికి షాపులు ఇతర కేటాయించి వారిని అభివృద్ధి చేసే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి( బాబు) మాట్లాడుతూ కవుడా నిధులతో బీచ్ పార్క్ బీచ్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, సుమారు 4.58 కోట్లతో బీచ్ పార్కును, ఈట్ స్ట్రీట్, రోడ్డు, లైటింగ్, బెంచీలు టాయిలెట్లు బోరు మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి పనులు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఇక్కడ పర్యాటకులకు ఎంతో సౌకర్యంగా అన్ని వసతులు సమకూర్చడం జరిగిందని ఆయన తెలిపారు. ఇక్కడ హెయిర్ క్రాఫ్ట్ మ్యూజియం అభివృద్ధి చేయడంతో పాటు పార్కు ,బెంచీలు ,లైటింగ్, రోడ్లు ,టాయిలెట్లు, మంచినీరు తదితర అన్ని వసతులను ఏర్పాటు చేయ డంతో పాటు బీచ్ క్లీనింగ్ కూడా చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి సామాన్లు విక్రయములో భద్రతా చర్యలు పాటించాలి

**రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లిబాబు సమీక్ష**





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రెవెన్యూ డివిజనల్ అధికారి, కాకినాడ ఎస్. మల్లి బాబు అధ్యక్షతన 20వ తేదీన జరుగనున్న దీపావళి పండుగ సందర్భముగా తాత్కాలిక బాణాసంచా తయారీదారులు మరియు అమ్మకందారులుతో సమావేశము ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశములో రెవిన్యూ, పోలీసు, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్ శాఖ, వాణిజ్య పన్నులు అధికారులు మరియు బాణాసంచా తయారీదారులు మరియు విక్రయదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.డి.ఒ. ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ భద్రతా పరంగా రక్షణ చర్యలు చేపట్టాలని తాత్కాలిక బాణాసంచా అమ్మకందార్లు నిర్దేశించిన పరిమాణము ప్రకారం మాత్రమే పిలుడు పదార్ధములను విక్రయ కేంద్రములో ఉంచవలెను అని అంతకంటే ఎక్కువగా నిల్వ ఉంచినచో మూర్వులు అని బాణాసంచా విక్రయ కేంద్రములో చెక్క లేదా ఆస్బెస్టాస్ తో చేసిన షెడ్స్ ఉండాలి అని, తాత్కాలి బాణాసందా అమ్మకందార్లు నందు ఎలక్ట్రికల్ వైర్లు ఇన్సులేట్ చేసినవి పైపుల ద్వారా ఏర్పాటు చేసి, ఎటువంటి స్పార్కులు ఏర్పడకుండా క్వాలిఫైడ్ ఎలక్ట్రీషియన్ ద్వారా వైరింగ్ చేయించవలెనని, తాత్కాలిక బాణాసందా అమ్మకందార్లు సదరు ప్రదేశములో ఫస్ట్ అయిడ్ మరియు ఫైర్ ఫైటింగ్ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేయాలని, వ్యాపార ప్రదేశము వద్ద సంబంధిత ప్లాన్ ఫ్లెక్సీ ను మరియు పొగ త్రాగుట నిషేదించి పొగ త్రాగరాదని బోర్డులు ఉండాలని మందుగుండు సామాగ్రి ట్రాన్స్-పోర్ట్ మరియు అమ్మకముల సమయములో ప్రమాదములు జరగకుండా మరియు ప్రాణ సష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని, అనుకోని పరిస్థితులలో ప్రమాదములు జరిగినట్లైతే, ప్రభుత్వం వారు తీసుకొను క్రిమినల్ మరియు సివిల్ చర్యలకు తయారీదారులు బాధ్యత వహించాలని తెలియచేసియున్నారు. ముఖ్యముగా లైసెన్స్ పొందిన తరువాత మాత్రమే దీపావళి సామాగ్రి నిల్వ ఉంచాలని, లైసెన్స్ పొందకుండా నిల్వ ఉంచినట్లయితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించి యున్నారు. అదేవిధముగా తయారీ కేంద్రములలో మరియు అమ్మకం జరుపు బాణా సంచా కేంద్రములలో సిబ్బంది సమాచారము ఖచ్చితం గా తెలియపరచవలెనని వృద్ధులు, వికలాంగులు, బాలలు బాణాసంచ తయారీ కేంద్రములలో ఉండకుండా చూడవలెనని ప్రతి కార్మికునికి ఇన్సూరెన్స్ చేయించాలని ఆదేశించియున్నారు. ఈ సమావేశములో తహసిల్దార్లు, పోలీసు సర్కిల్ ఇనస్పెక్టర్లు, డివిజనల్ ఫైర్ ఆఫీసర్ సుబ్బారావు, మున్సిపల్ ఆఫీసర్ పృధ్వీ చరణ్, వాణిజ్య పన్నులు మరియు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కేజీబివికి స్వచ్ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర అవార్డు ప్రదానం




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి ఈ ఆర్థిక సంవత్సరపు జిల్లా స్థాయి స్వచ్ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర పురస్కారం లభించింది. ఈ బాలికా విద్యాలయాన్ని రాష్ట్ర స్వచ్ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర ప్రతినిధుల బృందం సెప్టెంబర్ 19 న సందర్శించింది. ఇక్కడి పచ్చదనం, సంపూర్ణ పారిశుధ్యం నిర్వహణా తీరుతెన్నులను అధ్యయనం చేసింది. ఈ ఏటి స్వచ్ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర జిల్లా స్థాయి పురస్కారాలకు ఎంపికైన సంస్థల ప్రతినిధులకు పురస్కారాల ప్రదానోత్సవాన్ని కాకినాడ కళా క్షేత్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంఖవరం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ ప్రిన్సిపాల్ బి.బాలామణికుమారికి జిల్లా కలెక్టర్ షన్ మోహన్ సగిలి, కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన సంయుక్తంగా ఆ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కాకినాడ జిల్లాలో మొత్తం 5 పాఠశాలలు స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రకు ఎంపిక అయ్యాయని, అందులో శంఖవరం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ఒకటని, తమ పాఠశాలకు ఈ పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా బాలామణి కుమారి మీడియాతో పేర్కొన్నారు. పురస్కారం లభించడం పట్ల పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.



## శ్రీశ్రీశ్రీ శ్యామలాంబ అమ్మవారి ఆశయాలు

# పాలవర్గం నెరవేరేలా పనిచేయాలి

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అత్తి సత్యనారాయణ



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎంతో ఘన చరిత్ర కలిగిన శ్రీశ్రీశ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థానానికి నూతనంగా నియమించ బడిన పాలకమండలి దేవస్థాన ఆశయాలు నెరవేరే విధంగా పనిచేయాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు(వాసు) అన్నారు. కుటమి ప్రభుత్వం హిందూ దేవాలయాల అభివృద్ధికి, ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉందన్నారు. స్థానిక మంగళవారపు పేట రౌతు తాతాలు కళ్యాణ మండపంలో నూతన పాలకమండలి సభ్యులు చేత ఆలయ ఈ.వో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా రాజమండ్రి నగరంలోని దేవాలయ, ధర్మదాయ శాఖల కమిటీలు నియామకం జరుగుతుందన్నారు. ఇంతవరకు ఆరు కమిటీల నియామకం పూర్తి చేశామని, మరో ఏడు కమిటీలు త్వరలో నియామకం జరుగుతుందన్నారు. శ్రీశ్రీశ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థాన నూతన పాలకవర్గం దేవస్థాన అభివృద్ధికి, సంక్షేమానికి బాధ్యతతో పనిచేయాలని, ప్రభుత్వానికి ప్రజా ప్రతినిధులకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 14 నెలల కాలంలో రాజమండ్రి నగరంలో సుమారు రూ. 170 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన అన్నారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో తమ కూటమి విజయదుందుభి సాధించడం ఖాయమన్నారు. ప్రధాని మోడీ ఇటీవల జిఎస్టి పన్నులను సరళీకరించడంతో సామాన్య,మధ్యతరగతి ప్రజలులాభపడుతున్నారని అన్నారు. శ్రీ శ్రీ శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థాన నూతన పాలకవర్గం చైర్మన్‌గా నియమితులైన కడియాల వీర భద్రరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఎంతో ఘనచరిత్ర కలిగిన శ్రీ శ్రీ శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థాన పాలకవర్గం చైర్మన్ గా నియమించిన కూటమి ప్రభుత్వ అధిష్టానానికి సీఎం చంద్రబాబు నాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ శ్రీ శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థాన నూతన పాలకవర్గాన్ని మిత్రులు, అభిమానులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర,జనసేన సిటీ ఇన్చార్జి అనుశ్రీ సత్య నారాయణ,నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు, వర్రె శ్రీనివాసరావు, ఏవిడి ప్రసాద్, కోసూరి చండీప్రియ, చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి, శెట్టి జగదీష్, బంగారు నాగేశ్వరరావు, బుడ్డిగ రవి,బుడ్డిగ రాదా, దొండపాటి సత్యం బాబు, తురకల నిర్మల, ముసిని బాబురావు, కడలి రామకృష్ణ, చాపల చిన్నరాజు, మీసాల మణి, బయ్యపునిడి సూర్య, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. శ్రీ శ్రీ శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థాన నూతన పాలకమండలి చైర్మన్‌గా కడియాల వీరభద్రరావు, డైరెక్టర్లు ఏ.వెంకట సత్య అప్పారావు, బోను ఈశ్వరి, మల్లపురెడ్డి వరలక్ష్మి, తాడివలస వెంకటలక్ష్మి, కారుమూరు సురేష్, కూరగంటి త్రినాథ్, కెల్లా జయలక్ష్మి, తోర్లపాటి శాలిని, ఎం. పద్మావతి, అండలూరి చంద్రశేఖర్ తదితరులను పలువురు అభినందించారు.




## రాజమండ్రిలో బాక్సింగ్ రింగ్ లేదు..

# పోటీలకు కనీస సౌకర్యాలు కరువు..

- ♦ పోటీలకు విశాఖపట్నం అనువైన ప్రదేశం
- ♦ బాక్సింగ్ పోటీల ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ తరపున నిర్వహించాలి
- ♦ ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ జెనరల్ సెక్రటరీ పి.మధుసూదన్ రావు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రిలో నిర్వహించే స్కూల్ గేమ్స్, బాక్సింగ్ పోటీలకు మా అసోసియేషన్ కు కనీస సమాచారం లేదని ఆంధ్ర ప్రదేశ్ బాక్సింగ్ జెనరల్ సెక్రటరీ, మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ ఛైర్పర్సన్ పూజారి మధు సుధనరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మీడియాకు ఓ లేఖను విడుదల చేశారు. రాజమండ్రిలో స్కూల్ గేమ్స్ బాక్సింగ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం తెలిసిందని, అయితే ఇక్కడ సరైన బాక్సింగ్ రింగ్, సదుపాయం లేవని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే అవగాహనఉన్న కమిటీ సభ్యులు టోర్నమెంట్‌ను నిర్వహించడంలేదని వాపోయారు. మా అసోసియేషన్‌కు అధికారికంగా ఎటువంటి సమాచారం టోర్నమెంట్ నిర్వాహకులు ఇవ్వలేదన్నారు. కేవలం ఫిజికల్ డైరెక్టర్ (పీడీలు) ద్వారా బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జడ్జిమెంట్ విషయంలో సరైన అవగాహన ఉండదన్నారు. గతంలో విజయవాడలో స్కూల్ గేమ్స్ సరైన కమిటీ సభ్యులు నిర్వహించకపోడం వలన బాక్సింగ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు గాయాలు పాలైయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. అంతే కాకుండా పక్షపాతంతో జడ్జిమెంట్ ఇవ్వడం వలన ఎంతోమంది నేషనల్ మెడలిస్టులు బాక్సింగ్ పోటీలలో పాల్గొని అవకాశం కోల్పోయారని అన్నారు. రాజమండ్రిలో బాక్సింగ్ పోటీలు ఏ విధమైన పరికరాలు లేకుండానే జరుపుతున్నారని, చెక్కబల్లలు, మ్యాట్లు వేసి బాక్సింగ్ గేమ్‌ను నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనివలన ఎంతోమంది పిల్లలకు గాయాలయ్యే అవకాశం ఉన్నదని, వాళ్లు స్పృహ కూడా కోల్పోయే అవకాశం మెండుగా ఉందన్నారు. మోకాలు దెబ్బతిని పరిస్థితి కలుగుతుందని, ఆందోళన వ్యక్తం చేశారు. బాక్సింగ్ రింగ్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ భానుమూర్తి, ఈ బాక్సింగ్ టోర్నమెంట్ సరైన పద్ధతిలో నిర్వహించాలని సూచించినా కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని ఈ బాక్సింగ్ టోర్నమెంట్ను విశాఖపట్నం జిల్లాలో నిర్వహించాలని ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ తరపున నిర్వహించాలని కోరారు . ప్రభుత్వం నుండి టోర్నమెంట్ నిర్వహించడానికి సగం ఖర్చులు అందిస్తే మిగతా సగం అసోసియేషన్ తరపున ఖర్చు పెట్టుకుని పిల్లలకు లాడ్జింగ్ అండ్ బోర్డింగ్ ఖర్చులు చూసుకుంటామని తెలిపారు. ఈ టోర్నమెంట్ను విశాఖపట్నంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత సమక్షంలో, ఇంటర్నేషనల్ క్వాలిఫైడ్ కోచ్, బీఎఫ్ ఐ రెఫరీలు నేషనల్ లెవెల్ లో జూనియర్ అండ్ సబ్ జూనియర్ బాక్సింగ్ ఆటగాళ్లతో నిర్వహిస్తామన్నారు . పిల్లల సంరక్షణకు పూర్తి బాధ్యత మా ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ తరపున వహిస్తుందని చెప్పారు. పిల్లలు భవిష్యత్తు దృష్ట్యా ఈ టోర్నమెంట్ ను విశాఖపట్నంలో అవగాహన కలిగిన కమిటీ సభ్యులతో నిర్వహించాలనేది మా కోరిక అన్నారు. ఈమేరకు మంత్రి నారా లోకేష్ తో పాటు శాప్ చైర్మన్, క్రీడా శాఖ మంత్రి, పాఠశాల విద్యాశాఖ కమీషనర్లకు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

## ఆదివాసీల హక్కుల,చట్టాల కోసం

# అలుపెరగని పోరాటం చేసిన కొమరం భీం

### గోండు బొబ్బిలి కొమరం భీంకు ఘననివాళి..

### ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** గోండు బొబ్బిలి కొమరం భీం 85వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించమని ఏపీ ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లంశేఖర్ తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గం,దేవీ పట్నం మండలం, పోతవరం గ్రామంలో కొమరం భీం 85వ వర్ధంతి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు నైజాం పాలనకు వ్యతిరేకంగా అమాయక ఆదివాసులను చైతన్య పరుస్తూ.. జల్ జంగిల్ జమీన్ అని నినాదించి భూమి, నీరు, అడవి, సహజ వనరులపై సర్వహక్కులు ఆదివాసులకే సొంతం అని హక్కులు ఆదివాసీల హక్కుల కోసం చట్టాల కోసం అలుపెరగని పోరాటం చేసిన గోండు బొబ్బిలి కొమరం భీం నేటితరం ఆదివాసి యువతీ యువకులకు ఆదర్శమన్నారు. కొమరం భీం పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదివాసి యువతీ యువకులు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆదివాసి హక్కుల ఉద్యోగాల సాధన కమిటీ మండల ప్రధాన కార్యదర్శి చవలం విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ నెల 13 వ,తేదీన ఆదివాసీ ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని చలో రంపచోడవరం కార్యక్రమాన్నికి ఆదివాసి ప్రజలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర,కొమరం వెంకటేశ్వర్లు దొర, మడకం రామకృష్ణ దొర, తుర్రం వీరాయమ్మ, గ్రామ కమిటీ ట్రెజరర్ కారం శ్రీనివాసు దొర, మడకం వెంకటేష్ దొర, కుంజం రామకృష్ణ దొర, తుర్రం బాలు దొర, చవలం వెంకాయమ్మ, తాటి గంగాభవాని, తెల్లం కామన్న దొర, చవలం పోశమ్మ, తుర్రం గౌరీ సాహితి, తుర్రం శిరీష మొదలైన వారు పాల్గొన్నారు.

# ఆరు సంవత్సరాల కార్మికుల నిరీక్షణ ఫలించింది

### పేపరుమిల్లు వేతన ఒప్పందం కూటమి ప్రభుత్వ విజయం..: ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గడిచిన ఆరు సంవత్సరాలుగా పేపరుమిల్లు కార్మికుల నిరీక్షణకు మంచి అగ్రిమెంట్ లభించి, వారి జీవితాల్లో వెలుగులు వచ్చాయని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఇది కూటమి ప్రభుత్వ విజయమని గర్వంగా చెబుతున్నామన్నారు. పేపర్ మిల్లు కార్మికులకు నూతన వేతన ఒప్పందం కుదిరిన నేపథ్యంలో పేపర్ మిల్లు యూనియన్ నాయకులు, కార్మికులు మంగళవారం ఉదయం స్థానిక తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ని కల్సి ధన్యవాదములు తెలియజేసారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కార్మికుల శ్రేయస్సు కంటే వారి స్వలాభమే చూసుకున్నారని, ప్యాకేజిపై ఉన్న శ్రద్ధ కార్మికుల వేతన ఒప్పందంపై చూపించలేదని వ్యాఖ్యానించారు. తరచూ కార్మికులు తమకు జరుగుతున్న అన్యాయంపై వివరించినపుడు తెలుగుదేశం పార్టీని, టీఎన్టియుసిని నమ్మాలని, తప్పకుండ తాము అధికారంలోకి వచ్చాక మంచి అగ్రిమెంట్ చేసి, న్యాయం చేస్తామని చెప్పామని ఎమ్మెల్యే వాసు గుర్తుచేసారు. తమపై విశ్వాసం ఉంచి తమను గెలిపించి, వైసిపి వాళ్ళను ఇంట్లో కూర్చోబెట్టారని ఆయన అన్నారు. ఇచ్చిన హామీ మేరకు కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కార్మికులకు న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని, పరంపరంలో నష్టపోయినవారికి న్యాయం చేశామని, కార్మికులకు అన్యాయం చేసినవారిపై కేసులు కట్టించామని ఆయన అన్నారు. ఇంత చేస్తున్నా సరే, ఎప్పుడూ గొప్పలు చెప్పుకోలేదని, వైసిపి విమర్శలకు జవాబు ఇవ్వకుండా, పనిచేసి చూపించి నోరు మూయించామని ఎమ్మెల్యే వాసు అన్నారు. పర్మినెంట్ కార్మికుల మొదలుకుని కాంట్రాక్ట్ కార్మికుల వరకు అందరికీ న్యాయం జరిగేవిధంగా మంచి అగ్రిమెంట్ చేయించగలిగామని ఎమ్మెల్యే వాసు అన్నారు. తాము చేసిన ప్రయత్నానికి ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, అధికారులు, కూటమి నాయకులు, కార్మికులు అందరూ సహకరించారని అలాగే మేనేజిమెంట్ దిగిరాకపోయేసరికి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినప్పుడు అధికారులతో కమిటీ వేసి సమస్య పరిష్కారం అయ్యేలా చేశామని ఆయన వివరించారు. అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ 15ఈనెలల కాలంలో పేపరు మిల్లు గేటు దగ్గర ఆందోళనలు జరుగుతుంటే, మాజీ ఎంపీ భరత్ అక్కడకు ఎందుకు రాలేదని ఆయన ప్రశ్నించారు. 'నీవు సూట్ కేసులు గురించి ఆలోచించావు .. నేను కార్మికుల బాగుండాలని చూసా. కార్మికులకు ఏమిచేయాలో తెలుసుకు కాబట్టే నిన్ను ఇంట్లో కూర్చోబెట్టారు. కూటమిని గెలిపించారు... నీ అసమర్థత వలన అగ్రిమెంట్ చేయలేదని ఒప్పుకోవాలి' అని భరత్ నుద్దేశించి ఎమ్మెల్యే వాసు వ్యాఖ్యానించారు. ఆఖరికి అగ్రిమెంట్ అవుతుంటే, వైసిపి వాళ్ళు మోకాలడ్డారని ఆయన విమర్శించారు. నేను లేని రాజమహేంద్రవరం ఏమైపోతుందోనని భరత్ ఊహించుకున్నప్పటికీ ఇప్పుడు రాజమహేంద్రవరం చాలా బాగుందని ఆయన చురకలంటించారు. మిల్లులో 4000మంది కార్మికులుంటే అందులో తన ఓటర్లు ఎంతమంది ఉంటారన్నది భేరీజు వేసుకుకోండా అందరికీ న్యాయం చేయాలని చూశానని ఎమ్మెల్య్ వాసు అన్నారు. అగ్రిమెంట్ ఆలస్యం కారణంగా కార్మికులు కడుపుమంటతో కేకలు వేస్తుంటే, నిస్సహాయతకు మదన పడ్డానని ఆయన గుర్తుచేసుకున్నారు. మొత్తానికి బాగా నలిగిపోయినప్పటికీ కార్మికులందరికీ న్యాయం చేయగలిగామన్నారు.

**ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెల్పిన కార్మిక నాయకులు...**

కార్మిక నాయకులు మాట్లాడుతూ 5సంవత్సరాలకు పైగా ఎన్నికలు, అగ్రిమెంట్ లేకపోవడంతో కూటమి ప్రభుత్వ దృష్టికి తెచ్చామని ఎమ్మెల్యే వాసు ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్ తదితరులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలో జరిగిన అగ్రిమెంట్ లో కార్మికులకు 5800జీతం, కాంట్రాక్ట్ కార్మికులకు 2200 రూపాయలు జీతం పెంచారని తెలిపారు. ఎన్నాళ్ళనుంచో చూస్తున్న అగ్రిమెంట్ చేసి 4000కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపినందుకు కూటమి ప్రభుత్వానికి కార్మికుల తరపున ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్లుగా కార్మికులు చాలా బాధలు పడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చి న్యాయం చేసిందని, ముఖ్యంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నాయకత్వంలో ముందుండి నడిపించడం వలన మంచి అగ్రిమెంట్ చేసుకోగలిగామని అన్నారు. ఏలూరులో కాపీ ఇచ్చారని, 11యూనియన్లు సంతకాలు పెట్టాయని తెలిపారు. మీడియా సమావేశంలో టిడిపి నాయకులు కాశీ నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, ఉప్పులూరి జానకి రామయ్య, కొయ్యల రమణ, బుడ్డిగ రవి, దుత్తరపు గంగాధర్, అధిక సంఖ్యలో పేపర్ మిల్లు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# కార్మికుల వ్యతిరేక బిల్లును ఆపాలి..

### 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలి

### సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం కార్మికులకు పని గంటలను 8 నుండి 10 గంటలకు పెంచడాన్ని వ్యతిరేకస్తూ సిఐటియు తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం రాజమహేంద్రవరం స్థానిక శ్యామల సెంటర్ వద్ద మంగళవారం ఉదయం సీఐటీయూ ఆధ్వర్యంలో పని గంటలు పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో ఏమోదించిన కార్మిక వ్యతిరేక బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ కార్మికవర్గం అంతర్జాతీయంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని మార్చడం దుర్మార్గం అని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ లోని అంశాలను రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అమలు చెయ్యడాన్ని ఖండించారు. రాష్ట్ర ఏర్పడినప్పటి నుండి నేటి వరకు కనీసవేతనాలు పెంచని ప్రభుత్వం పని గంటలు పెంచడాన్ని విమర్శించారు.మహిళలకు రక్షణ కొరవాడుతున్న పరిస్థితులు ఉన్న సమయంలో రాత్రి షిఫ్ట్ లో పనిచెయ్యాలని చట్టం చెయ్యడం దుర్మార్గం అన్నారు. కార్మిక వర్గం పై కనీసమైనా చిత్తశుద్ధి ఉంటే బిల్లును ఉపశమహరించాలని డిమాండ్ చేశారు. బిల్లుకు వ్యతిరేకంగా కార్మిక వర్గం తమ నిరసనను తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు టి.అరుణ్, ఎస్.ఎస్.మూర్తి, బి.పూర్ణిమరాజు, ఎస్. వెంకటేశ్వరావు, సోమేశ్వరావు, ఐ.సుబ్రహ్మణ్యం, శేషరావు, కాంతారావు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

# సిజెఐ గవాయిపై దాడి కాదు.. రాజ్యాంగం మీద దాడి..

**- దేశ ప్రజల మనోభావాలు, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి -ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరబోయిన న్యాయవాదిని తక్షణం అరెస్టు చేయాలి**

**- ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ళ సుబ్బారావు - రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయిపై జరిగిన దాడి.. ప్రజాస్వామ్యంపైన, రాజ్యాంగం పైన జరిగిన దాడిగా ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక రాజమండ్రి బార్ అసోసియేషన్ హాల్ వద్ద నుండి న్యాయవాద సభ్యులు మంగళవారం ఉదయం కోర్టు విధులను బహిష్కరించి ఊరేగింపుగా అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శనగా చేరుకుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ దాడికి పాల్పడిన న్యాయవాదిపై సుమోటోగా కేసు నమోదు చేసి.. తక్షణం అరెస్టు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రజల మనోభావాలను ఈ ఘటన గాయ పరచిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశం యొక్క పరువును అంతర్జాతీయంగా దిగజార్చిందని విమర్శించారు. ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి... ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న సంకేతాలను అందిస్తుంద న్నారు.ఇంత దాడి జరిగినప్పటికీ ప్రధాన న్యాయమూర్తి గవాయి చాలా స్థిరంగా,ధైర్యంగా నిలబడి..ఇటువంటి దాడులకు తాను భయపడేది లేదని స్పష్టం చేయడం గొప్ప విషయం అన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన న్యాయవాదిని తాత్కాలికంగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సస్పెండ్ చేసిందని, ఢిల్లీ బార్ కౌన్సిల్ నోటీసులు జారీ చేసిందన్నారు. అయితే ఈ దాడికి పాల్పడిన న్యాయవాదిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శోభనాద్రి, పెల్లూరి రమేష్,ట్రెజరర్ కవి హనుమంతరావు, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, పడమట గణేశ్వరరావు, ఐ.రాంబాబు, ఎస్.సురేష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

### కొబ్బరి పీచు, తాళ్లు తయారీకి

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలును ప్రోత్సహించాలి : కలెక్టర్ మహేష్





**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి ముడిసరుకు ఆధారిత కొబ్బరి పీచు, కొబ్బరి తాళ్లు తయారీకి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆ దిశగా ఔత్సాహిక పారిశ్రా మికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధి కారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మాచవరం గ్రామంలో అంబటి భూలక్ష్మి శ్రీ రాజరాజేశ్వరి క్వాయర్ పరిశ్రమను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్వాయర్ పరిశ్రమల స్థాపనకు రాయితీల ద్వారా ప్రోత్సహించి స్థానిక ప్రజానీకానికి జీవనోపా దులు మెరుగుపరచాలని అధికారులు ఆదేశించారు. కొబ్బరి డొక్కల నుండి పీచు తయారీ, అలాగే పీచు నుండి తాళ్లు తయారీ ప్రక్రి య గురించి వివరాలను ఆయన నిర్వాహకులను అడిగి తెలుసుకు న్నారు. కొబ్బరి డొక్కల నుండి పీచు తయారీ,పీచు తయారీకి ముందుగా ముదురు కొబ్బరి డొక్కలను సేకరి స్తారని డొక్కలను యాంత్రిక పరికరాల ద్వారా ఫైబర్‌ను వేరు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వేరు చేసిన ఫైబర్‌ను బాగా ఉతికి, ఎండబెట్టి, ఉత్ప త్తులను తయారు చేయడం జరుగుతుందని జిల్లా కలె క్టర్ వారికి వివరించారు. సిద్ధమైన ఫైబర్ (పీచు)ను యంత్రం లేదా చేతితో యార్న్ (నూలు)లా తిరిగే పరిక రాల్లో వేసి నూలుగా తయారు చేస్తారన్నారు. తాడు తయారీ యంత్రం ద్వారా తయారు చేసిన తాడును అవసరమైన పరిమాణంలో కట్ చేస్తా రన్నారు ఈ తాళ్లు పారి శ్రామిక, వ్యవసాయ అవసరాలకు ఉపయోగి స్తారని నిర్వాహకులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకులు శివరాం ప్రసాద్, తాసిల్దార్ జి.చిన్నబాబు తదితరులు పాల్గొ న్నారు.

# కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి వేడుకలు

### జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జీవితం యువతరానికి గొప్ప సందేశం : జేసి టీ నిషాంతి




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహర్షి వాల్మీకి రచించిన రామాయణం ధర్మ పారా యణులకు నేటికీ దారి చూపుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు మహర్షి వాల్మీకి జయంతి వేడుకల ను జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వ హిం చారు.సంస్కృతంలో ఆదికవి, పవిత్ర రామా యణ ఇతిహాస రచయిత, మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సకల జనులకు శు భాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ వాల్మీకి మహర్షి జీవితం భక్తిశ్రద్ధలతో భారతీ య సంస్కృతి సాంప్రదా యాలకు భారతీయ జీవన ఆధారమన్నారు వాల్మీకి జీవితం గొప్ప సందేశమని యువతరానికి వాల్మీకి జీవితం మంచి ప్రేరణ అన్నారు ధర్మ న్యాయబద్ధ విధానాన్ని ఆచరించే వారిని ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నిలవాలన్నా రు జ్ఞానం సముపార్జన కు పరిమితిలేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అన్నారు పరిస్థి తుల ప్రభావం కారణంగా కిరాతకుడిగా వ్యవహ రించినా తపస్సుతో మహ నీయుడుగా మారి ప్రపం చానికే జ్ఞాన జ్యోతిని చూపించిన కారుణ్యమూర్తి వాల్మీకి మహర్షి అన్నారు మహర్షి వాల్మీకి జీవితం ఈ సృష్టి ఉన్నంత కాలం స్ఫూర్తి నిస్తూనే ఉంటుంద న్నారు. ఆచంద్ర తారార్కం నిలబడి పోయే మహర్షి వాల్మీకి కీర్తిప్రతిష్టల్ని ఆయన జయంతి సందర్భంగా స్మరించుకోవడం మన పూర్వజన్మ సుకృతం. అన్నారు.జ్ఞాన సముపా ర్జనకు హద్దు లేదన్న విషయాన్ని వాల్మీకి మహర్షి నిరూపించాడన్నారు. భావితరాలకు వాల్మీకి రచించిన రామాయణం ఎంతో స్ఫూర్తిగా ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వాల్మీకి అసలు పేరు రత్నా కరుడు, ఆయన ఒక బ్రాహ్మణుడు, తర్వాత దోపిడీలు చేసి బంది పోటుగా మారారని చరిత్ర చెబుతోందన్నారు నారద మహర్షి బోధనతో తపస్సులో మునిగిపోయి, ఏళ్ల తరబడి రామనామం జపించి, చుట్టూ పుట్టలు పెరిగిన తర్వాత వాల్మీకిగా మారారని కథనాలు ఉన్నాయ న్నారు. పుట్టను సంస్కృ తంలో వాల్మీకం' అనే కథనం కూడా ఉందనీ అందుకే ఆయనకు వాల్మీకి అని పేరు వచ్చిందన్నారు మహర్షి వాల్మీకి, రామాయ ణం అనే ప్రసిద్ధ హిందూ ఇతిహాసాన్ని రచించారన్నారు. ఆయనను ప్రాచీన జ్ఞానానికి ప్రతీక'గా భావిస్తారన్నారు. అతని పూర్వా శ్రమంలో పేరు రత్నాకరు డు, అతను దారి దోపిడీ దారుడిగా ఉండే వాడని, తర్వాత ఒక ఋషిని కలిసిన తర్వాత గొప్ప ఋషిగా మారాడన్నారు. వాల్మీకి జయంతి అనేది పురాణ రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి జన్మదినోత్సవాన్ని జరు పుకునే హిందూ పండుగ. ఈ పండుగను పర్గత్ దివస్ అని కూడా అంటారన్నారు పురస్కరించుకొని, ఆల యాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు, సాం స్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపులు నిర్వహిస్తార న్నారు. జ్ఞానం ధర్మానికి మార్గదర్శకుడైన వాల్మీకి మహర్షి బోధనలు అందరికీ శాంతి విజయాన్ని తెచ్చి పెట్టాలని ఆకాంక్షించారు రామాయణ మహాకావ్యం భారతీయ సంస్కృతికి నైతిక విలువలకు గొప్ప మార్గమన్నారు. వాల్మీకి మహర్షి జీవితం మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. రామాయణ రచన ద్వారా సమాజంలో ధర్మానికి సత్యానికి ప్రాముఖ్యతను అందించారన్నారు. వాల్మీకి రామాయణం అనే ప్రసిద్ధ హిందూ ఇతిహాసాన్ని రచించారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పి జ్యోతిలక్ష్మి దేవి ఏవో కాశీ విశ్వేశ్వరరావు ల్యాండ్ సెక్షన్ సూపరిం టెండెంట్ సుబ్బరాజు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, కలెక్టరేట్ సిబ్బంది బీసీ వెల్ఫేర్ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

### పని గంటలు పెంపు తీర్మాణాన్ని

# తక్షణం వెనక్కి తీసుకోవాలి

### సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు కౌలు,రైతు సంఘాలు డిమాండ్




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని కూటం ప్రభుత్వం కార్మికుల యొక్క పని గంటలు పెంచుతూ రాష్ట్ర శాసనసభ తీర్మానం చేయడానికి నిరసిస్తూ సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు,కౌలు, సంఘాలు నేడు అమలాపురం గడియారం సెంటర్ వద్ద నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం మాల మహానాడు పౌర హక్కుల సంఘంకేవీపీస్ సంఘాలు మద్దతుగా నిలవడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు సిఐటియు జిల్లా అధ్యక్షులు జి దుర్గాప్రసాద్ రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎం.వెంకటేశ్వరరావులు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు దళిత సంఘాల నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని అనేక పోరాటాల ఫలితంగా రక్తాన్ని చిందించి 18 గంటల పని దినాన్ని ఎనిమిది గంటల పని దినాలుగా పోరాడు సాధించుకున్నారని నేడు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం యొక్క ఒత్తిడికి లోనై ఎనిమిది గంటలు ఉన్నపని గంటలను 13 గంటలకు పెంచుతూ తీర్మానం చేయడం కార్పొరేట్ కంపెనీలకు మేలు చేకూర్చే విధంగా మానవశ్రమను దోపిడీ చేసేందుకు ఈ పని గంటలు పెంపు జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు మహిళలపై రోజురోజుకీ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో రాత్రిపూట కూడా మహిళలతో పని చేయించే కుట్రకు చేస్తున్నారని ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు తక్షణం పనిగంటలు పెంచిన అసెంబ్లీ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు వ్యవసాయ కార్మికుల కౌలు రైతు సంఘం కెవిపిఎస్ రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం పౌరహక్కుల సంఘాల నాయకులుటి నాగ వరలక్ష్మి,బి సతీష్, నాగబాబు, సిహెచ్ బాబ్జి,జి దైవ కృప, విజయ పార్వతి,రత్నకుమారి, బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామ్మూర్తి,శెట్టిబత్తుల తులసిరావు, అమలుదాసు బాబురావు, రాంబాబు జల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని కోరుతూ

# ఆశావర్కర్ల నిరసన

### ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశావర్కర్ల నిరసన కార్యక్రమం
### ఆరోగ్య కేంద్ర సిబ్బందికి వినతిపత్రం అందజేత



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశావర్కర్లుగా మార్పు చేసి, అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని కోరుతూ,మండల కేంద్రమైన రాయవరంలో గల స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్ల యూనియన్ లీడర్ జి.దుర్గ ఆద్వర్వంలో ఆశావర్కర్లు నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా యూనియన్ లీడర్ దుర్గ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే అన్ని రకాల జాతీయ సెలవులు, పండుగ సెలవులు, వారాంతపు సెలవు, క్యాజువల్ శెలవులు, మెడికల్ శెలవులు వంటివి తమకివ్వాలని, నాణ్యమైన యూనిఫామ్‌లు తమకివ్వాలని, ఏఎన్ఎం, జిఎన్ఎం శిక్షణ పొందిన ఆశాలకు పర్మినెంట్ పోస్టుల భర్తీ సమయంలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆశావర్కర్ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల నియామకాలను ప్రభుత్వాలే చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. తమతో వెట్టిచాకిరి చేయిస్తూ రికార్డ్స్ వంటి అదనపు పనులు చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఆశావర్కర్ల దహన సంస్కారాల ఖర్చులకు గానూ రూ. 20,000 చెల్లించాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆరోగ్య కేంద్ర సి.హెచ్.వో ప్రభావతి కి అందించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ ప్రెసిడెంట్ పంపన మంగాదేవి, సెక్రటరీ జె.అనంతలక్ష్మి ఆశావర్కర్లు రమా, రజిని,లక్ష్మీ తదితర ఆశావర్కర్లు పలువురు పాల్గొన్నారు.

### ఆటోడ్రైవర్, ప్రయాణికులపై

# దాడి చేసిన నిందితుల అరెస్ట్

### ఘటన జరిగిన 48 గంటలలోపే కేసును చేధించిన పోలీసులు
### చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అభినందనలు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రయాణికులతో వస్తున్న ఆటోను అడ్డగించి ఆటోడ్రైవర్, ప్రయాణికులపై దాడి చేసిన ఘటనలో నిందితు లైన శాఖా వినయ్ వంశీ, మాచవరపు వెంకట సాయి గణేష్, రిమ్మలపూడి శ్రీ సాయి కృష్ణ, పర్వతిని మౌళి సాయి క్రిష్ణ లను మంగళ వారం అదుపులోకి తీసుకుని, రిమాండ్ కు తరలించినట్లు మండపేట రూరల్ సీఐ దొర రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అక్టోబర్ 06 సోమవారం ఉదయం 3.30 గంటలకు వెదురుపాక సావరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వాసంశెట్టి రామకృష్ణ, తన బంధువులైన అనసూరి శ్రీనివాస్ కుటుంబం, హైదరాబాద్ నుండి స్వగ్రామమైన వి.సావరం గ్రామానికి తీసుకురావడానికి వెళ్ళగా, మాచవరం వంతెన వద్ద అప్పటికే బస్సు దిగి, ఆటో కోసం వేచి చూస్తున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులను నిందితులైన శాఖ వంశీ, అతని ముగ్గురు స్నేహితులు హేళన చేస్తూ, ఇబ్బంది పెడుతుండగా, రామకృష్ణ అక్కడికి చేరుకుని తమ బంధువులను ఆటో ఎక్కించుకుని, మాచవరం నుండి వెదురుపాక సావరం ఆటోలో వెళ్ళు చుండగా, సోమేశ్వరం గ్రామంలోని శివాలయం వద్దకు వచ్చేసరికి నిందితుడైన శాఖ వంశీ తన కారుతో ఆటోను వెంబడించి, ఓవర్టేక్ చేసి ముందుకు వెళ్లి, అడ్డగించి ఆటో ను ఆపి, ఆటోలో ఉన్న ప్రయాణికులును చంపేస్తామని బెదిరించి, ఆటో డ్రైవర్ అయిన రామకృష్ణ ను కొట్టి, బలవంతంగా అతని వద్దనుండి సెల్ ఫోన్ లాక్కొనగా, కొడుతున్న వారిని ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు ఎందుకు కొడుతున్నారు అని అడగగా, మహిళల పై సైతం దాడిచేసి గాయ పరిచారని, దీనిపై అనపర్తి ఏరియా హాస్పిటల్ నుండి వచ్చిన ఇంటిమేషన్, రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయవరం పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పిర్యాదు పై మండపేట రూరల్ సిఐ పి.దొర రాజు అధ్వర్యంలో ఇన్చార్జి ఎస్సై జి.హరీష్ కుమార్ దర్యాప్తు చేసి, మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటలకు ఖచ్చితమైన సమాచారం తో మాచవరం పాత పెట్రోల్ బంకు వద్ద నిందితులైన శాఖ వినయ్ వంశీ, మాచవరపు వెంకట సాయి గణేష్, రిమ్మలపూడి శ్రీ సాయి కృష్ణ, పర్వతిని మౌళి సాయి క్రిష్ణ లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి నేరానికి వినియోగించిన మహేంద్రా ఎక్స్.యు.వి 700 కారును, మోటరోలా కంపెనీ ఫోన్ ను, స్వాధీనం పరుచుకుని నిందితులను కోర్టు తరలించినట్లు మండపేట రూరల్ సీఐ తెలిపారు. త్వరితగతిన కేసును చేదించి, ఘటన జరిగిన 48 గంటలలోపే నిందితులను అదుపులోకి తీసుకున్న సిఐ దొర రాజు, ఎస్సై జి.హరీష్ లను, సిబ్బందిని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేకంగా అబినందించారు.

# బీసీ కులగనన తక్షణమే చేపట్టాలని ఎమ్మెల్సీ కుడిపూడి డిమాండ్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ గత వైసిపి హయాంలో చేపట్టిన కులగనన నేడు నిలిచిందని. వెంటనే కుల గణన ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తున్నట్లు చెప్పడం కాదని. ఏ కులానికి ఎంత మేర రిజర్వేషన్లు ఇస్తున్నారు తెలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ నాయకులు కుడిపూడి త్రినాధరావు, ముంగర ప్రసాద్ పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితునికి మంత్రి సుభాష్ పరామర్శ

### 20 వేలు ఆర్థిక సహాయం అందజేత



**కాజులూరు , విశ్వం వాయిస్ న్యూస్ :** తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన కాజులూరు మండలం తణుకువాడ గ్రామానికి చెందిన యల్లమిల్లి అప్పారావుని మంగళవారం రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శిం చారు. కాలుకు తగిలిన గాయంకి ఇన్ఫెక్షన్ రావడంతో శస్త్ర చికిత్స చేసి వైద్యులు కాలును తొల గించారు. ఈ విషయం స్థానిక కూటమి నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ పరామర్శించి మనోధైర్యాన్నిచ్చారు. అప్పారావు ఆర్ధిక ఇబ్బందులతో బాధపడుతున్నాడని తెలిసి మంత్రి సుభాష్ 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. జాగ్రత్తగా ఉండి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ధైర్యం చెప్పారు. మంత్రి సుభాష్ మానవత్వానికి, సామాజిక సేవా తత్వానికి బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక కూటమి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చావ్వాకుల నారాయణమూర్తి, ఉపాధ్యక్షులు మేడిశెట్టి వీరవెంకట సత్యనారాయణ(పెద్ద), టీడీపీ సీనియర్ నాయకులు వల్లు అర్జునరావు, జడ్పీ మాజీ చైర్మన్ గుత్తుల బులిరాజు, స్థానిక సొసైటీ చైర్మన్ పితాని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుక

### వాల్మీకి చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించిన ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదికవి వాల్మీకి జయంతిని పుష్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్, అడిషనల్ ఎస్పీ ఏవిఆర్‌పిబీ ప్రసాద్, ఏఆర్‌డిఎస్‌పిసుబ్బరాజు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వాల్మీకి అనే పేరు వాల్మీక (పురుగు) నుండి ఉద్భవించింది, ఎందుకంటే అతను చాలా సంవత్సరాల ధ్యానం తర్వాత ఒక ఋషిగా అవతరించాడు, ఆ సమయంలో అతని చుట్టూ చీమల పుట్టలు పెరిగాయి. ఆయన జీవిత కథ విముక్తికి మరియు లోతైన ఆధ్యాత్మిక పరివర్తనకు శక్తివంతమైన చిహ్నం. రామాయణం హిందూ మతం మరియు దక్షిణాసియా సంస్కృతిలో అత్యంత ప్రభావవంతమైన గ్రంథాలలో ఒకటిగా మిగిలిపోయింది, విధి నైతికత మరియు నీతిమంతమైన జీవనం (ధర్మం) గురించి కాలాతీత పాఠాలను అందిస్తుంది తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి ఏవిఆర్‌పిబి ప్రసాద్, ఏఆర్‌డిఎస్‌పి సుబ్బరాజు , ఎస్‌బి సిఐ పుల్లారావు, ఏఆర్ఆర్ఐ శ్రీ కోటేశ్వరరావు బ్రహ్మానందం, సిబ్బంది పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న కోర్టులో ఊరట

**హైదరాబాద్ :** ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన పార్టీ గుర్తింపు, గుర్తుకు సంబంధించిన అభ్యర్థనను పరిశీలించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న మల్లన్నకు ఊరట లభించినట్లు యింది. ఇటీవల తాను స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీకి గుర్తింపునిచ్చి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు గుర్తును కేటాయించాలని కోరుతూ తీన్మార్ మల్లన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకుని, నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది.తెలంగాణలో బీసీలకు రాజ్యాధికారం దక్కాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ'ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎరుపు, ఆకుపచ్చ రంగుల జెండా మధ్యలో పిడికిలి, కార్మిక చక్రం, వరి కంకులతో పార్టీ పతాకాన్ని రూపొందించారు. 'ఆత్మగౌరవం, అధికారం, వాటా' అనే నినాదాలను జెండాపై ముద్రించారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో పార్టీ గుర్తింపు, గుర్తు కేటాయింపునకు గల అవకాశాలను ఎన్నికల సంఘం పరిశీలించనుంది.

## అనుమానంతో భార్య హత్య

**ఖమ్మం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామంలో భార్య సునీతను భర్త గోపి కత్తితో నరికి చంపాడు. వీరికి 17 సంవత్సరాల క్రితం పెళ్లి అయ్యింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్, 9వ తరగతి చదువుతున్న ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. మద్యానికి బానిసైన భర్త, సునీతపై అనుమానంతో తరచూ గొడవ పడేవాడు. సోమవారం ఉదయం భార్యను బైక్‌పై ఎక్కించుకుని పత్తి చేనుకు వెళ్ళాడు. పొలంలో కంప నరకాలని తన వెంట కత్తి కూడా తీసుకు వెళ్ళాడు.ఇద్దరూ భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవారు. అయితే గోపికి తన భార్యపై అక్రమ సంబంధం ఉందనే అనుమానం కలిగి తరచూ గొడవపడేవాడు. తనతో తీసుకెళ్లిన కోటకత్తితో సునీతను నరికి హత్య చేశాడు. భార్యను కత్తితో నరికి అక్కడే పత్తి చేనులో పడేశాడు. సాయంత్రం అయినా తల్లిదండ్రులు ఇంటికి రాకపోవడంతో కుమార్తెలు బంధువులతో కలిసి చుట్టుపక్కల ఆరా తీశారు. వర్షం వచ్చిన నేపథ్యంలో పిడుగు పడి ఏమైనా జరిగిందేమో అని ఆందోళన వ్యక్తం చేశారు. తర్వాత కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో సునీత మృతదేహాన్ని చూసి బోరున విలపించారు.విషయం తెలిసిన వెంటనే జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, ఎస్ఐ రవి సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. నిందితుడు గోపి పరారీలో ఉన్నాడు. అనుమానం పెను భూతం అయ్యి.. మాటల్లో దింపి పొలానికి తీసుకువెళ్ళి అతి కిరాతకంగా నరికి హత్య చేసాడు. అదే పత్తి చేనులో పడేసి పరారయ్యాడు.

# గెలిచాక పార్టీ మారితే తుక్కుతుక్కు చేస్తాం

**కరీంనగర్ :** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచారు. తెలంగాణలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు కష్టపడి గెలిపించుకున్న అభ్యర్థి? కనుక పార్టీ మారితే వదిలిపెట్టేది లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక ఎన్నికల కోసం బీఆర్ఎస్ ప్రచారం మొదలుపెట్టింది. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి కౌశిక్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేసే బీఆర్ఎస్ అభ్యర్థులను స్థానిక ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కానీ ఎన్నికల్లో గెలిచాక ఆ అభ్యర్థులు పార్టీ మారితే మర్యాద దక్కదని హెచ్చరించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచాక ఎవరైనా పార్టీ మారితే కనుక 1000 మందిని తీసుకొచ్చి వారి ఇంటిపై దాడి చేసి తుక్కుతుక్కు చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలోని 5 మండలాల్లోని తమ అభ్యర్థులందరికీ ఇది వర్తిస్తుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలని వదిలిపెట్టలేదని, అలాగే మిమ్మల్ని కూడా వదిలిపెట్టమని కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. నాకోసం కష్టపడ్డారు, ఇప్పుడు మీకోసం కష్టపడతా. యూరియా అందించని ప్రభుత్వానికి ఓట్లు అడిగే హక్కు లేదు. కమలాపూర్ గడ్డపై గులాబీ జెండా ఎగరవేస్తాం, హుజురాబాద్ నియోజకవర్గంలో అత్యధిక సీట్లు గెలిపించి కేసీఆర్ కి కానుక ఇస్తాం' అన్నారు కౌశిక్ రెడ్డి. ఈనెల 9



నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది, అంతా సిద్ధంగా ఉండాలని గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనకోసం కష్టపడి గెలిపించిన కార్యకర్తలు, నాయకులకు తాను అండగా నిలబడి, స్థానిక సంస్థల ఎన్నికల్లో వారిని గెలిపించేందుకు కష్టపడతా అన్నారు. సోమవారం కమలాపూర్ లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ? హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కేసీఆర్ వందల కోట్లు వెచ్చించారని గుర్తుచేశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కదాన్ని కూడా పూర్తిగా అమలు చేయలేదు. రైతులు యూరియా కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతుండగా, యూరియా అందించని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓట్లు అడిగే హక్కే లేదు. ప్రజల విశ్వాసం గెలుచుకున్న వారికి మాత్రమే బీఆర్ఎస్ టికెట్లు కేటాయిస్తాం. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగానే ఉంది. హుజురాబాద్ నియోజకవర్గం నుంచి అత్యధిక సీట్లు గెలిపించి కేసీఆర్ కి కానుకగా అందిస్తాం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో వర్గ రాజకీయాలు ముదిరిపోయాయని, కానీ బీఆర్ఎస్‌లో మాత్రం ఒక్కటే వర్గం అది "కేసీఆర్ వర్గం" అని' కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా హుజురాబాద్ మొత్తం మీద గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 9 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అదే సమయంలో ఉప్పల్ గ్రామం రైల్వే బ్రిడ్జ్ నిర్మాణ పనులను ఃఖీూ ప్రభుత్వం దాదాపు పూర్తిచేసినా, మధ్యలో కేంద్ర ప్రభుత్వం పనులు నిలిపివేసిందని విమర్శించారు. ప్రస్తుత రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సంపత్ రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, మాజీ జడ్పీటీసీలు లక్ష్మణరావు, నవీన్, సీనియర్ నాయకులు సత్యనారాయణ రావు, తిరుపతి రావు, కేడీసీసీ డైరెక్టర్ కృష్ణ చైతన్య, సమన్వయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓబీ కంపెనీలలో పూర్తిస్థాయి రక్షణ సూత్రాలు అమలు చేయాలి

**ఫిట్నెస్ యంత్రాలనే నడపాలి**

**ప్రజాస్వామిక పద్ధతిలో నాయకులకు పాత్రికేయులకు సందర్శనకు అనుమతి ఇవ్వాలి**

**కర్నే బాబురావు డిమాండ్**

**భద్రాద్రి కొత్తగూడెం :** మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న ఓబీ కంపెనీలలో పూర్తిస్థాయి రక్షణ సూత్రాలు అమలు చేయాలని ఫిట్నెస్ అయిన యంత్రాలను మాత్రమే నడిపేలా చూడాలని ప్రజాస్వామ్య పద్ధతిలో కార్మిక సంఘాల నాయకులు గాని పాత్రికేయులు గాని సమస్య ఉన్నప్పుడు ఆయా ప్రాంతాలను సందర్శించే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు చేపట్టాలని కోరుతూ సామాజిక సేవకులు కర్నే బాబురావు మంగళవారం నాడు ఏరియా సేఫ్టీ ఆఫీసర్ డి. వెంకట రామారావుకి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ మల్లెపల్లి ఓసి లో ఇటీవల మట్టి వెలికితీత పనుల కాంట్రాక్ట్ పొందిన గౌరవ్ ఓబి కంపెనీ పూర్తిస్థాయి కండిషన్ లో ఉన్న భారీ యంత్రాలను ప్రవేశపెట్టాల్సి ఉంది అందుకు విరుద్ధంగా సర్వేడ్ ఆఫ్ అయిన యంత్రాలను, మరమ్మతులకు వచ్చిన యంత్రాలను ప్రవేశపెట్టి వాటికి ఎలాంటి ఫిట్నెస్ లేకుండా క్వారీలో నడుపుతున్నారని ఫలితంగా అట్టి యంత్రాలు క్వారీలో ఎక్కడ పడితే అక్కడే ఆగిపోతున్నాయి నడవడానికి మొరాయిస్తున్నాయన్నారు వాటిని గ్యారేజీకి తరలించాలంటే కొన్ని గంటల సమయం



పడుతోంది వేరే వెహికల్ పెట్టి లాగించుకొని పోవాల్సిన పరిస్థితి కండిషన్లో లేని యంత్రాలను నడిపే ప్రయత్నంలో భాగంగా ప్రమాదాలకు కూడా అవకాశం ఉంది ఈ అంశంపై యాజమాన్యం తక్షణ విభాగం ఆధ్వర్యంలో తనిఖీ కార్యక్రమం ఏర్పాటు చేయాలని కోరుతున్నాను అదేవిధంగా గౌరవ్ ఓబి కంపెనీ దగ్గరకి కార్మిక సంఘాలు యూనియన్ లీడర్లు జర్నలిస్టులు సందర్శనకు వెళితే గేటు వద్ద సెక్యూరిటీ గార్డులు అన్ని సరిగా ఉంటే గౌరవం ఓబి యాజమాన్యానికి ఎందుకు అంత ఉలుకు అనేది అర్థం కావడం లేదు దయచేసి అలాంటి సంఘటనలు పునరావతం కాకుండా ప్రజాస్వామ్యక పద్ధతుల్లో ఎవరికి ఇబ్బంది కలిగించకుండా చూసే విధంగా గౌరవ ఓబి కంపెనీ యాజమాన్యానికి తగు ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోరారుగౌరవ్ ఓబి కంపెనీలో కండిషన్లో ఉన్న భారీ యంత్రాలను, వాహనాలను మాత్రమే అనుమతించాలిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అన్ని యంత్రాలను తనిఖీ చేయాలిమెడికల్ విటిసి సంబంధిత యంత్రాలపై శిక్షణ లేకుండా ఎవరిని అనుమతించరాదు వీటికి శిక్షణ సమయంలో డ్యూటీ లకు అనుమతించరాదు ×డీజీఎంఎస్ గైడ్ లైన్స్ మరియు కోల్ మైన్స్ రెగ్యులేషన్ ప్రకారం (సి ఎం అర్)సేఫ్టీ డిపార్ట్మెంట్ అధికారులు హాల్ రోడ్ లను, వ్యక్తిగత రక్షణ పరికరాల ధరింపు, మద్యపానం, ఇతర మత్తు పదార్థాల సేవింపు, సీట్ బెల్ట్ ధరింపు, సెల్ ఫోన్ డ్రైవింగ్ పై అవగాహన, అగ్ని ప్రమాదాలు , ప్రాథమిక వైద్యం,క్యాంటీన్లో పరిశుభ్రతను రక్షణ సూత్రాలు అమలు లైటింగ్ మరియు గ్యారేజీలో ప్రతిరోజు రక్షణ తనిఖీ నిర్వహించాలి, ఎండి ఆదేశానుసారం ప్రతిరోజు ఎస్ఓపి కార్యక్రమం రక్షణ ప్రతిజ్ఞ క్రమం తప్పకుండా నిర్వహించాలి దీనిపై అధికారుల మరియు హెడ్ ఓవర్ మెన్ ల పర్యవేక్షణ తప్పకుండా ఉండాలి రిజిస్టర్లలో నమోదు చేయాలి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ కూడా వారానికి ఒకసారి తనిఖీ నిర్వహించాలి అని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

# మహనీయుడు వాల్మీకి మహర్షి

**జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**

**కలెక్టరేట్‌లో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు**

**జగిత్యాల :** ఇతిహాస రామాయణ మహాకావ్యాన్ని గ్రంథం రూపంలో మానవాళికి అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అనిజిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు. ప్రపంచానికి ధర్మం, న్యాయం,సత్యం, సేవా మార్గాలను చాటిన శ్రీ రామాయణ మహాకావ్య రచయిత, ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆ మహనీయుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇతిహాస రామాయణ మహాకావ్యాన్ని గ్రంథం రూపంలో మానవాళికి అందించిన మహనీయుడు మహర్షి.అన్నదమ్ముల బంధాన్ని,ఇచ్చిన మాటకు కట్టుబడే విధానం, గురు భక్తి లాంటి ఆచరణీయమైన పద్ధతులను రామాయణం ద్వారా రచించారని గుర్తు చేశారు.ఈరోజు వాల్మీకి జయంతి సందర్భంగా, మనకు జీవిత పాఠాలను నేర్పిన రామాయణాన్ని గుర్తు చేసుకోవాలని పేర్కొన్నారు.వాల్మీకి రచించిన



రామాయణం, మంచి మీద చెడు విజయం సాధిస్తుందన్న సందేశాన్ని అందిస్తుంది అని అన్నారు.ఇది కేవలం ఒక కథ మాత్రమే కాదు, ధర్మం, నీతి, స్నేహం, కుటుంబ విలువలను మనకు నేర్పే ఒక అద్భుత పాఠంలా ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రతియేట అక్టోబర్ 7నమహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బిఎస్. లత,బి.రాజా గౌడ్, జిల్లా బి.సి సంక్షేమ శాఖ అధికారిణి సునీత, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరన్,డిపివో మదన్ మోహన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తిపై దాడి న్యాయ వ్యవస్థపైనే దాడిగా భావిస్తున్నాం

**కోర్టులో విధులను బహిష్కరించి న్యాయవాదుల నిరసనలు**

**కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్**

**కోరుట్ల :** సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి భారత న్యాయ వ్యవస్థపైనే జరిగిన దాడిగా భావిస్తున్నామని కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్ అన్నారు. కోరుట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ పై సోమవారం జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం తమ విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్ మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి భారత న్యాయ వ్యవస్థపైనే జరిగిన దాడిగా భావిస్తున్నాం, ఇది భారత న్యాయ చరిత్రలో చీకటి రోజు ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య న్యాయ వ్యవస్థ కు మంచివి కావని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ ఫసియోద్దీన్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కడకుంట్ల సదాశివరాజు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఊరడి నరేందర్, రాసభక్తుల రాజశేఖర్, సీనియర్ న్యాయవాదులు మచ్చ వెంకటరమణ మూర్తి, బద్ది నర్సయ్య, సంగ విజయ్ బూరుగు గణేష్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



# నకిలీ మద్యం ఏరులై పారుతుంది...

**ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది : ఆక్షేపం వ్యక్తం చేసిన బొమ్మి**



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలల కాలంలో రాష్ట్రంలో అనేక కేంద్రాల్లో వేల కోట్ల రూపాయల నకిలీ మద్యం పట్టుబడింది అని, దీనిపై ప్రభుత్వం మరియు ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ లోపం మరియు నిర్లక్ష్యమే కారణమని ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ ఆక్షేపించారు. ఇటీవల ఇబ్రహీంపట్నంలో భారీగా కల్తీ మద్యం బయటపడిన విషయం తెలిసిందే. బయటపడిన నకిలీ మద్యానికి సంబంధించిన మూలాలు అన్నమయ్య జిల్లా మ్నొలకలచెరువులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.నకిలీ మద్యం బాటిళ్లు, తయారీ యంత్రాలు, ఖాళీ సీసాలు, మద్యం ప్యాకింగ్ సామాగ్రి, పెద్ద ఎత్తున స్వాధీనంలోకి తీసుకున్నారు.అలాగే రాష్ట్రంలోని చాలా కేంద్రాల్లో అన్ని బ్రాండ్లు నకిలీ మద్యం తయారు చేసి బహిరంగ మార్కెట్లో షాపుల ద్వారా విక్రయిస్తున్నారు. దీని ద్వారా ఈ మద్యం సేవించే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని, వారి ధన దాహంతో నకిలీ మద్యం విక్రయించి ప్రజల జీవితాలతో ఆట్లాడుకుంటున్నారని తెలియజేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అనేక గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు మామూలు మత్తులో తూలుతూ పట్టించుకోవటం లేదని,ఇది కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధుల కమిషన్లకి కక్కుర్తి పడి పేదవారి కుటుంబాలతో చెలగాటమాడుతున్నారన్నారు అని ఆయన తెలియజేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బెల్ట్ షాప్ నిర్వాహకుల మీద అక్రమ మద్యం తయారుదారులు మీద కేసులు నమోదు చేసి కట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు.

**చొల్లంగి అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం**

# పాలక మండలి ప్రమాణ స్వీకారం

**ముఖ్యఅతిథిగా హాజరైన ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు**

**టిడిపి రాష్ట్ర కార్యదర్శి నరసాపురం నియోజకవర్గ పరిశీలకు గుత్తుల సాయి**



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు మండలం చోళ్ళంగిలో అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని దేవస్థానం చైర్మన్‌గా ప్రమాణ స్వీకార చేసిన సింహాద్రికి మరియు పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియచేసిన ముమ్మిడివరం నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నరసాపురం నియోజకవర్గ పరిశీలకులు గుత్తుల సాయి, తాళ్లరేవు మండల పార్టీ అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుముడి లక్ష్మణరావు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బి.సి సెల్ అధ్యక్షులు వాడ్రేవు వీరబాబు తాళ్లరేవు మాజీ ఏఎంసి చైర్మన్ మందాల గంగ సూర్యనారాయణ, సీనియర్ నాయకులు బాబ్జి రాజు, తాళ్లరేవు మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు మరియు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న**

# ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ సమావేశం శాసనసభ్యులు వారు మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించడంలో సమస్యలు ఉన్నాయని గత ప్రభుత్వ హయాంలో పూడికతీతలు నిర్లక్ష్యం చేసిన కారణంగా క్రింద ప్రాంతాలకు నీరు సరఫరా చేయడంలో ఇబ్బందులు ఉన్నాయని వాటిని అధికమించడానికి అధికారులు ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఇంజరంలో బ్రిడ్జ్ కు త్వరలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా మహర్షి వాల్మీ జయంతి వేడుకలు

**జగిత్యాల :** జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అదికారులు, సిబ్బంది మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మనకు నీతి, ధర్మం, కర్తవ్యబోధలను తెలియజేసే అమృత గ్రంథమని వారి బోధనలు సమాజంలో సత్యం,న్యాయం, సమానత్వం స్థాపనకు ప్రేరణగా నిలుస్తాయని మహర్షి వాల్మీకి బోధనలను ఆచరణలో పెట్టి సత్యం, నీతి మార్గంలో నడవలని ఆయన ఆశయాలను కొనసాగించడమే మననీ ఆయనకు ఇచ్చే ఘన నివాళులని ఈ సందర్భంగా స్మరించుకోన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ వెంకటం మణ,సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ,ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్ ,అరిఫ్ అలీ ఖాన్, రఫీక్ ఖాన్ ,శ్రీధర్,ఆర్ లు కిరణ్ కుమార్, వేణు, సైదులు,ఆర్ ఎస్సైలు,జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# వారి వివరాలు ఇవ్వండి

న్యూఢిల్లీ

బిహార్ తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలను గురువారంలోగా ఇవ్వాలని సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ముసాయిదా జాబితాతో పోలిస్తే తుది జాబితాలో ఓటర్ల సంఖ్య పెరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ... అందులో చేర్చిన పేర్లు గతంలో తొలగించినవా లేక కొత్త ఓటర్లవా అని ప్రశ్నించింది. ఈ విషయంలో గందరగోళం నెలకొందని, దాన్ని తొలగించాలంటే కొత్తగా చేర్చిన పేర్లను వెల్లడించాలని కూడా స్పష్టం చేసింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం మంగళవారం విచారణను కొనసాగించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ముఖ్యమని, ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను కూడా సంబంధిత కార్యాలయాల్లో ఓటర్లకు అందుబాటులో ఉంచాలని ఆదేశించిన విషయాన్ని గుర్తుచేసింది. కాగా, తుది జాబితాలో చేర్చిన పేర్లు చాలావరకు కొత్త ఓటర్లవేనని ఈసీ తరఫున న్యాయవాది రాకేశ్ ద్వివేది తెలిపారు. తొలగించిన ఓటర్ల నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. ఎన్నికల కమిషన్ ఆగస్టు 1న బిహార్ ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించింది. ఎస్ఐఆర్ అనంతరం వివిధ కారణాలతో 65 లక్షల పేర్లను తొలగించామని, రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 7.24 కోట్లుగా పేర్కొంది. ఎస్ఐఆర్‌కు ముందు రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 7.89 కోట్లుగా ఉంది. ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. తొలగించిన ఓటర్ల వివరాలను వెల్లడించాలని కోర్టు ఆదేశించింది. ఎన్నికల కమిషన్ సెప్టెంబరు 30న తుది జాబితాను ప్రకటించింది. ఇందులో 21.53 లక్షల పేర్లను చేర్చగా.. 3.66 లక్షల పేర్లను తొలగించింది. దాంతో ముసాయిదా జాబితాలో కంటే ఓటర్ల సంఖ్య 17.87 లక్షలు పెరిగి.. 7.42 కోట్లకు చేరింది.

# బిహార్‌లో సీటు పోరు!



పట్నా/న్యూఢిల్లీ

బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. షెడ్యూల్ వెలువడిన మరుసటి రోజు నుంచే సీట్ల పంపకాల రాజకీయం మొదలైంది. పెద్దన్న పాత్ర కోసం కూటముల్లోని పార్టీల్లో ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఎన్డీయే కూటమిలో ప్రధానమైన బీజేపీ, జేడీయూ సమాన సంఖ్యలో సీట్లలో పోటీచేయాలనే భావనకు వచ్చినట్టు తెలిసింది. మరోవైపు మహాఘట్‌బంధన్ కూటమిలో సీట్ల లెక్కతోపాటు సీఎం అభ్యర్థి అంశమూ సందిగ్ధత రేపుతోంది. ఇక చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ తాజాగా ఎన్డీయే కూటమిని వీడి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిషోర్ జన సురాజ్ పార్టీతో జట్టుకట్టవచ్చనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే బిహార్ ఎన్నికలు మూడు కూటముల ముక్కోణపోటీగా మారవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**బీజేపీ, జేడీయూ.. సమానంగా సీట్లు!**

బిహార్‌లో ఎన్డీయే కూటమిలో బీజేపీ, జేడీయూతోపాటు లోక్‌జనశక్తి (ఎల్‌జేపీ), హిందుస్థానీ అవామీ మోర్చా (హెచ్ఏఎం), రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ (ఆర్ఎల్ఎం) భాగస్వాములుగా ఉన్నాయి. ఇందులో బీజేపీ, జేడీయూతోపాటు చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ కూడా కీలకం. ప్రతిసారి కూటమిలో భాగంగా బీజేపీ కంటే జేడీయూ ఎక్కు వ స్థానాల్లో పోటీ చేస్తూ వస్తోంది. అయితే ఈసారి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు కేటాయించే సీట్లు పోగా.. మిగతా సీట్లలో ఇరు పార్టీలు సమానంగా పోటీచేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఎల్‌జేపీకి 25, హెచ్ఏఎంకు ఏడు, ఆర్ఎల్ఎంకు ఆరు సీట్లు ఇస్తామని బీజేపీ, జేడీయూ ప్రతిపాదించినట్టు సమాచారం. ఎల్‌జేపీ ఎక్కువ సీట్లు ఇవ్వాలని కోరుతోందని, అదే జరిగితే హెచ్ఏఎం, ఆర్ఎల్ఎంల సీట్లకు కోతపడవచ్చని.. వాటికి రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు ఆఫర్ చేయవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఎన్డీయే కూటమి మళ్లీ గెలిస్తే ముఖ్యమంత్రి మార్పు ఉండవచ్చని చర్చ కూడా జరుగుతోంది. నితీశ్‌కుమార్ కాకుండా బీజేపీ నేత సీఎం అయ్యే అవకాశాలూ ఉన్నాయని, అందులో భాగంగానే బీజేపీ, జేడీయూ సమానంగా సీట్లలో పోటీచేయాలనే నిర్ణయానికి వచ్చాయని కమలం వర్గాలు పేర్కొంటున్నాయి.

**మహాఘట్‌బంధన్‌లో సీఎం గిరికి పోటీ!**

విపక్ష మహాఘట్‌బంధన్ కూటమిలో సీఎం అభ్యర్థి ఎవరనే అంశంతోపాటు సీట్ల పంపకాల విషయంలోనూ భేదాభిప్రాయాలు పొడసూపుతున్నాయి. కూటమి తరఫున తేజస్వియాదవ్ సీఎం అభ్యర్థి అని ఆర్జేడీ ధీమాగా ఉండగా, కాంగ్రెస్ ఇంకా దీనికి బహిరంగంగా అంగీకారమేదీ తెలపకపోవడంతో సందిగ్ధత నెలకొంది. దీనికితోడు మంగళవారం బిహార్ కాంగ్రెస్ నేత ఉదిత్‌రాజ్ చేసిన చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. "తేజస్వి యాదవ్ ఆర్జేడీ వాళ్లకు సీఎం అభ్యర్థి కావొచ్చు. కానీ కూటమి తరఫున సీఎం అభ్యర్థి ఎవరనేది అంతా కలిసి నిర్ణయం తీసుకుంటారు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌కు దీటుగా నిలబడేది తేజస్వియాదవ్ మాత్రమేనని ఆర్జేడీ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ బహిరంగంగా ఆ పార్టీ తరఫున ఎవరూ దీనిపై స్పందించలేదు.

**ప్రశాంత్ కిషోర్‌తో చిరాగ్ పాశ్వాన్ జట్టు?**

జన సురాజ్ పార్టీతో తెరపైకి వచ్చిన ప్రశాంత్‌కిషోర్‌తో చిరాగ్ పాశ్వాన్ ఎల్‌జేపీ జట్టు కట్టవచ్చనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో ఉన్న ఎల్‌జేపీ ఈసారి ఎక్కువ సీట్ల కోసం డిమాండ్ చేస్తోంది. 25 సీట్లు ఇస్తామని బీజేపీ ప్రతిపాదించగా.. 40కిపైనే ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. రాష్ట్రంలోని ప్రతినియోజకవర్గంలో 20,25 వేల ఓట్లను తాము ప్రభావితం చేయగలమని.. తాము బయటికి వెళ్తే కూటమికి ఇబ్బందులు తప్పవని చిరాగ్ పాశ్వాన్ ఇప్పటికే స్పష్టంచేశారని ఎల్‌జేపీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సీట్ల లెక్కపై సయోధ్య కుదరలేదని.. ఎన్డీయే నుంచి ఎల్‌జేపీ బయటికి రావొచ్చని అంటున్నాయి. అదే జరిగితే ప్రశాంత్ కిషోర్‌తో చిరాగ్ జట్టుకట్టి కూటమిగా ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి.

**రాజకీయాల్లోకి మైథిలీ ఠాకూర్!**

అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శబరిపై పాటపాడి, ప్రధాని మోదీ ప్రశంసలు పొందిన జానపద గాయని మైథిలీ ఠాకూర్‌ను బీజేపీ బిహార్ ఎన్నికల బరిలోకి దింపనుంది. ఇటీవల ఆమె బిహార్ బీజేపీ ఇన్‌చార్జి వినోద్ తావ్డే, కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్‌లతో సమావేశమయ్యారు కూడా. దీనిపై మీడియా ఆమెను ప్రశ్నించగా.. ఎన్నికల్లో పోటీపై తుది నిర్ణయమేదీ రాలేదన్నారు. తన స్వస్థలం బిహార్‌లోని మధుబని జిల్లా బేణిపట్టికి వెళుతున్నానని.. ప్రజలను కలిసి, మాట్లాడాలని చెప్పారు.

# బడా సంస్థల చేతుల్లోనే భవిష్యత్తు

న్యూఢిల్లీ

కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ) సాంకేతికత వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తోంది. అదేసమయంలో పెను ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) హెచ్చరించింది. ఏఐ, దాని ప్రభావంపై మార్కెట్ అధ్యయనం నిర్వహించిన సీసీఐ, గత నెలలో ఇందుకు సంబంధించి నివేదికను విడుదల చేసింది. ఏఐ మార్కెట్‌లో కొన్ని బడా టెక్నాలజీ సంస్థల ఆధిపత్యం పెరుగుతోందని, ఇది భవిష్యత్తులో గుత్తాధిపత్యానికి దారితీసి, ఆరోగ్యకరమైన పోటీని దెబ్బ తీస్తుందని ఈ నివేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అల్గారిథమ్‌ల ద్వారా రహస్య కుమ్మక్కు, ధరల వివక్ష, స్టార్టప్‌లకు అడ్డంకులు వంటి అనేక సవాళ్లను ఈ నివేదిక వెలుగులోకి తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ మార్కెట్ 2020లో 93.24 బిలియన్ డాలర్ల నుంచి 2024 నాటికి 186.43 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారతదేశంలో ఏఐ మార్కెట్ పరిమాణం 2020లో 3.20 బిలియన్ డాలర్లుండగా 2024 నాటికి 6.05 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2031 నాటికి ఇది 31.94 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ గణాంకాలు ఏఐ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తున్నాయి.

**బడా కంపెనీలదే పెత్తనం**

సీసీఐ నివేదిక ప్రకారం, ఏఐ పర్యావరణ వ్యవస్థను (ఏఐ ఎకో సిస్టం) కొన్ని పొరలుగా (ఏఐ స్టాక్) విభజించారు. ఇందులో డేటా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (క్లౌడ్ కంప్యూటింగ్, చిప్స్), డెవలప్‌మెంట్ (అల్గారిథమ్స్, ఫౌండేషన్ మోడల్స్) వంటి కీలకమైన ప్రాథమిక (అప్‌స్ట్రీమ్) పొరలు ఉన్నాయి. ఈ కీలకమైన రంగాల్లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), గూగుల్, మైక్రోసాఫ్ట్ అజూర్, ఎన్విడియా వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలదే పూర్తి ఆధిపత్యం. మనదేశంలోని దాదాపు 67% స్టార్టప్‌లు కేవలం ఏఐ అప్లికేషన్లను అభివృద్ధి చేసే (డౌన్‌స్ట్రీమ్) స్థాయిలోనే పనిచేస్తున్నాయి. ఇవి తమ కార్యకలాపాల కోసం పూర్తిగా ఈ బడా సంస్థల క్లౌడ్ సేవలు, టెక్నాలజీలపైనే ఆధారపడి ఉన్నాయి. ఇది మార్కెట్‌లో తీవ్ర అసమానతలకు దారితీస్తోందని నివేదిక పేర్కొంది.

**మార్కెట్‌ను శాసించే అల్గారిథమ్స్**

ఏఐ రాకతో మార్కెట్‌లో పోటీతత్వం స్వరూపమే మారిపోతోంది. ముఖ్యంగా, ధరలను నిర్ణయించే అల్గారిథమ్‌ల వాడకం పెరగడం పెను సవాలుగా మారింది. సీసీఐ నివేదిక ప్రకారం, అల్గారిథమ్‌ల ద్వారా కంపెనీలు రహస్యంగా కుమ్మక్కయ్యే (అల్గారిథమ్ కొల్యూషన్) ప్రమాదం పొంచి ఉంది. మనుషుల ప్రమేయం లేకుండానే, అల్గారిథమ్‌లు ఒకదానికొకటి సంకేతాలు పంపుకుంటూ ధరలను కృత్రిమంగా పెంచే అవకాశం ఉంది. ఈ నివేదిక కోసం సర్వే చేసిన స్టార్టప్‌లలో 37% మంది అల్గారిథమిక్ కుమ్మక్కుపై ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో 'టాప్‌కిన్స్'కేసు, యూకేలో 'ట్రాడ్/జీబీ ఐ'కేసు వంటివి ఇందుకు నిదర్శనాలని నివేదిక ఉదహరించింది. అంతేకాకుండా, వినియోగదారుడి కొనుగోలు శక్తి, ప్రవర్తనను బట్టి ఒక్కొక్కరికీ ఒక్కో ధరను చూపే 'ధరల వివక్ష'కూడా పెరిగిపోతోందని, దీనిపై 32% స్టార్టప్‌లు ఆందోళన చెందాయని సర్వేలో తేలింది.

**ప్రవేశానికి అడ్డంకులు.. స్టార్టప్‌లకు సవాళ్లు**

ఏఐ రంగంలోకి కొత్తగా ప్రవేశించాలనుకునే స్టార్టప్‌లకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయని సీసీఐ అధ్యయనంలో వెల్లడైంది. స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న ప్రధాన అడ్డంకుల్లో 68% మంది డేటా లభ్యత అతిపెద్ద అడ్డంకిగా పేర్కొన్నారు. అత్యుత్తమ ఏఐ మోడల్స్ అభివృద్ధికి భారీ మొత్తంలో నాణ్యమైన డేటా అవసరం, కానీ అది బడా సంస్థల వద్దే పోగుపడి ఉంది. 61% మంది క్లౌడ్ సేవలు అత్యంత ఖరీదైనవిగా మారాయని తెలపడం ఇందుకు ఉదాహరణ. 61% మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగులు దొరకడం కష్టంగా ఉందని చెప్పారు. 66% మంది నిపుణులు సులభంగా అందుబాటులో లేరని అభిప్రాయపడ్డారు. 59% మంది కంప్యూటింగ్ సౌకర్యాల ఖర్చు అడ్డంకిగా భావించారు. 56% మంది స్టార్టప్‌లు నిధులు సమీకరించడం పెద్ద సవాలుగా ఉందని తెలిపారు. సర్వే ప్రకారం, 83% స్టార్టప్‌లు సొంత నిధులతోనే నడుస్తున్నాయి. తదుపరి దశ నిధులు పొందడం చాలా కష్టంగా ఉందని 50% మంది పేర్కొన్నారు. ఈ అడ్డంకుల వల్ల ఆవిష్కరణలు తగ్గి, మార్కెట్‌లో పోటీతత్వం నీరుగారిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొని, ఏఐ రంగంలో ఆరోగ్యకరమైన పోటీ వాతావరణాన్ని సృష్టించేందుకు సీసీఐ తన నివేదికలో పలు కీలక సూచనలతో ఒక కార్యాచరణ ప్రణాళికను ప్రతిపాదించింది. అందులోని అంశాలివీ...

స్వీయ%-%తనిఖీ : ఏఐ వ్యవస్థలను వినియోగించే సంస్థలు, తమ అల్గారిథమ్‌లు పోటీ చట్టాలకు విరుద్ధంగా పనిచేయకుండా చూసేందుకు స్వీయ%-%తనిఖీ విధానాన్ని పాటించాలి. ఇందుకు ఒక మార్గదర్శక పత్రాన్ని సీసీఐ జతచేసింది.

పారదర్శకత: ఏఐ ఆధారిత నిర్ణయాల విషయంలో కంపెనీలు పారదర్శకతను పాటించాలి. ఏఐని ఏ ఉద్దేశంతోవాడుతున్నారో వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాలి.

అవగాహన కార్యక్రమాలు: ఏఐ, పోటీ చట్టాలపై వాటాదారులందరికీ అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహిస్తుంది.

అడ్డంకుల తొలగింపు: స్టార్టప్‌లకు అవసరమైన కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు, నాణ్యమైన డేటా అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించింది.

నియంత్రణ సంస్థల మధ్య సమన్వయం: ఏఐకి సంబంధించిన అంశాలు బహుళ నియంత్రణ సంస్థల పరిధిలోకి వస్తున్నందున, వాటి మధ్య సమన్వయం కోసం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలని సీసీఐ భావిస్తోంది.

అంతర్జాతీయ సహకారం: ప్రపంచవ్యాప్తంగా ఉన్నకాంపిటీషన్ ఏజెన్సీలతో కలిసి పనిచేయడం ద్వారాఅంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను అందిపుచ్చుకోవాలని నిర్ణయించింది. మొత్తమ్మీద ఏఐ సాంకేతికతను ప్రోత్సహిస్తూనే, మార్కెట్‌లో గుత్తాధిపత్య ధోరణులను అరికట్టి, చిన్న సంస్థలు, స్టార్టప్‌లు కూడా రాణించేందుకు సమాన అవకాశాలు కల్పించేలా పటిష్టమైన నియంత్రణ యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరముందని సీసీఐ స్పష్టం చేసింది.

# ప్రభుత్వాధినేతగా పాతికేళ్లు!

న్యూఢిల్లీ

ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన ఘనత సాధించారు. ప్రభుత్వాధినేతగా పాతికేళ్లుగా అప్రతిహతంగా కొనసాగుతున్నారు. 2001 అక్టోబరు 7న గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. 2014 మే 22 వరకు ఆ పదవిలో ఉన్నారు. అదే నెల 26న ప్రధానమంత్రిగా ప్రమా ణం చేసిన మోదీ 11 ఏళ్లకుపైబడి ఆ పదవిలో కొనసాగుతున్నారు. ఈ చరిత్రాత్మక ఘట్టంపై మంగళవారం ఆయన స్పందించారు. ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు.. ఇంత గొప్పదేశం పురోగతిలో పాలుపంచుకోవడానికి నిరంతరాయంగా తాను కృషి చేస్తున్నానని 'ఎక్స్'లో వరుస ట్వీట్లు చేశారు. 2001లో ఇదే రోజు తొలిసారి గుజరాత్ సీఎంగా ప్రమాణం చేశాను. మొదట స్వరాష్ట్రంలో.. ఇప్పుడు దేశంలో మార్పులకు శ్రమిస్తున్నాను. సహచర భారతీయులు నిరాటంకంగా ఆశీర్వదిస్తున్నందుకు ధన్యవాదాలు. ప్రభుత్వాధినేతగా 25వ ఏట అడుగుపెడుతున్నాను. భారత ప్రజలకు కృతజ్ఞుడిని' అని పేర్కొన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు 2013లో బీజేపీ తనను ప్రధాని అభ్యర్థిగా ఎంపిక చేసేనాటికి దేశం పాలన, విశ్వాస సంక్షోభంలో పడి ఉందని చెప్పారు. యూపీఏ హయాంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, విధాన పక్షవాతంతో విలవిలలాడిన భారత్.. ఇప్పు డు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థ, సామాజిక భద్రత పథకాలకు నెలవుగా మారిందన్నారు. 'దేశం స్వావలంబన సాధించేందుకు మన రైతులు కొత్త పుంతలు తొక్కుతున్నారు. భారత్ అన్ని రంగాల్లో స్వయంసమృద్ధి సాధించేందుకు (ఆత్మనిర్భర భారత్) ప్రభుత్వం విస్తృత సంస్కరణలు చేపడుతోంది. 'ఇది స్వదేశీ వస్తువని గర్వంగా చెప్పండి' అన్న నినాదంలో అవి ప్రతిబింబిస్తున్నాయి. 11 ఏళ్లుగా భారత ప్రజలందరం కలిసికట్టుగా పనిచేస్తున్నాం. ఎన్నో పరివర్తనలు తీసుకొచ్చాం. విప్లవాత్మక చర్యలతో దేశవ్యాప్తంగా వివిధ వర్గాలను.. ముఖ్యంగా నారీశక్తి, యువ శక్తి, అన్నదాతలను సాధికారత దిశగా నడిపిస్తున్నాం. 25 కోట్ల మందికిపైగా ప్రజలను పేదరికం నుంచి విముక్తి చేశాం. ప్రధాన ప్రపంచ ఆర్థిక శక్తుల నడుమ చోటు సంపాదించాం' అని మోదీ వివరించారు.

**పుతిన్‌కు మోదీ పుట్టిన రోజు శుభాకాంక్షలు**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ప్రధాని మోదీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పుతిన్ 73వ జన్మదినం కావడంతో ఆయనకు ఫోన్ చేసి మాట్లాడారు.

# ఊహించని విధ్వంసం

తీవ్రంగా నష్టపోయిన ఇజ్రాయెల్, గాజా
యుద్ధానికి రెండేళ్లు



ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జర్మనీ రాజధాని బెర్లిన్‌లో మృతుల చిత్రాలకు నివాళులర్పిస్తున్న స్థానికులు

యుద్ధంతో పెను విధ్వంసమే.. రెండు దేశాలకూ నష్టమే. ఆధునిక కాలంలో అయితే అన్ని దేశాలకూ ఆర్థికంగా భారమే. 2023 అక్టోబరు 7వ తేదీన ఇజ్రాయెల్‌పై హమాస్ విరుచుకుపడటంతో ప్రారంభమైన ఇజ్రాయెల్, గాజా యుద్ధం రెండేళ్లుగా కొనసాగుతూనే ఉంది. వేల మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఊహించని విధ్వంసం జరుగుతోంది. లక్షల మంది నిరాశ్రయులయ్యారు. బందీలు పూర్తిగా విడుదల కాలేదు. అమెరికా జోక్యంతో ప్రస్తుతం ఈజిప్టులో జరుగుతున్న చర్చలు ఫలిస్తే యుద్ధానికి ముగింపు పలికే అవకాశముంది. లేదంటే మరింత కాలం విధ్వంసం తప్పదు.

యుద్ధం కారణంగా ఇజ్రాయెల్‌లో ప్రజలు రెండుగా చీలిపోయారు. బందీలను విడిపించడంలో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు విఫలమయ్యారని వారి బంధువులు ఆరోపిస్తున్నారు. కాల్పుల విరమణ కుదుర్చుకోవడంలో ఆయన సరిగా వ్యవహరించలేదని విమర్శిస్తున్నారు.

ఇక గాజాలో పెను విధ్వంసమే జరిగింది. 67వేల మందికిపైగా మరణించారు. పలు పట్టణాలు, నగరాలు ధ్వంసమయ్యాయి. లక్షల మందికి నిలువనీడ లేకుండా పోయింది. తినడానికీ తిండి దొరకడం లేదు.

ఇజ్రాయెల్ చరిత్రలోనే హమాస్ అతి పెద్ద దాడి చేసింది. రాకెట్లతో విరుచుకుపడి 1,200 మందిని హతమార్చింది. సైనిక స్థావరాలు, వ్యవసాయ కమ్యూనిటీలు, అవుట్‌డోర్ సంగీత కచేరీ వంటి వాటిపై దాడులు జరిగాయి. 251 మందిని హమాస్ మిలిటెంట్లు అపహరించుకుపోయారు. ఆ తర్వాత యుద్ధం కొనసాగుతున్న కాలంలో తాత్కాలిక కాల్పుల విరమణ ద్వారా చాలా మందిని హమాస్ విడిచిపెట్టింది. ఇంకా 48 మంది బందీలుగా ఉన్నారు.

గాజాతో యుద్ధం అంతటితో ఆగలేదు. ఇరాన్, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా, యెమెన్‌లోని హూతీలతో ఇజ్రాయెల్ యుద్ధం చేయాల్సి వచ్చింది.

ఈ యుద్ధ కాలంలోనే పలు మిలిటెంట్ గ్రూపుల నేతలను ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. కొంత మంది ఇరాన్ జనరల్స్‌నూ హతమార్చింది.

గాజాలో ఇప్పటికీ వేల మంది జాడ తెలియడం లేదు. లక్షల మంది ఇజ్రాయెల్ బాంబు దాడుల్లో గాయపడ్డారు. 6,000 మంది శిథిలాల కిందే సమాధయ్యారని అంటున్నారు.

గాజాలోని 21 లక్షల మంది యుద్ధం కారణంగా ప్రభావితమయ్యారు. 365 చదరపు కిలోమీటర్ల పరిధిలో విధ్వంసం చోటుచేసుకుంది. ప్రతి 10 మందిలో ఒకరు చనిపోవడంగానీ, గాయపడటంగానీ జరిగింది.

ప్రతి 10 మందిలో ముగ్గురు రోజులపాటు ఆహారానికి దూరమయ్యారు. ప్రతి 100 మంది చిన్నారుల్లో నలుగురు.. తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయారు.

ప్రతి 10 భవనాల్లో 8 ధ్వంసమయ్యాయి. మొత్తంగా 1,02,067 భవనాలు శిథిలమయ్యాయి. ప్రతి 10 ఎకరాల వ్యవసాయ భూముల్లో 8 ఎకరాలు పనికిరాకుండా పోయాయి.

ఆహారం కోసం క్యూలలో నిల్చున్న వారిలో 2,000 మంది అక్కడ జరిగిన ఘర్షణల్లో మరణించారు. 30శాతం మందికి ఆహారం అందలేదు.

బిజినెస్ వాయిస్

## కొత్త బొలెరో విడుదల చేసిన మహీంద్రా.. ప్రారంభ ధర రూ. 8 లక్షలు




ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) సోమవారం తన కొత్త బొలెరో మోడల్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. సరికొత్తగా తీసుకొచ్చిన బొలేరో మోడల్‌ను రీఫ్రెష్‌డ్ స్టైలింగ్, అధునాతన ఫీచర్లతో లభిస్తుందని కంపెనీ తెలిపింది. అప్‌గ్రేడ్ చేసిన ఈ వాహనంలో టాప్-ఎండ్ వేరియంట్ బొలెరో బీ8, బొలెరో నియో ఎన్11 మరింత ప్రీమియం, ఇప్పుడున్న ఎస్‌యూవీల స్థాయిలో ఫీచర్లను అందిస్తాయని కంపెనీ వెల్లడించింది. ఈ వాహన ధర రూ. 7.99 లక్షల నుంచి మొదలై రూ. 9.69 లక్షల వరకు(ఎక్స్‌షోరూమ్) ఉంటుందని, బొలెరో నియో ధర రూ. 8.49 లక్షల నుంచి రూ. 9.99 లక్షల మధ్య(ఎక్స్‌షోరూమ్) లభిస్తుందని కంపెనీ పేర్కొంది. అప్‌గ్రేడ్ చేసిన బొలెరో వాహనంలో రిఫ్రెష్ చేసిన గ్రిల్, ఫ్రంట్ ఫాగ్ ల్యాంప్స్, డైమండ్-కట్ ఆర్15 అల్లాయ్ వీల్స్ ఉన్నాయి. అంతేకాకుండా కస్టమర్లకు కొత్త స్టెల్త్ బ్లాక్ కలర్ ఆప్షన్ కూడా ఉందని, 17.8 సెం.మీ టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, స్టీరింగ్-మౌంటెడ్ ఆడియో ఫీచర్లు కలిగి ఉంది. 25 ఏళ్లకు పైగా దేశీయ వాహన మార్కెట్లో బొలేరో మోడల్ కస్టమర్లకు ఎస్‌యూవీ విభాగంలో అత్యంత ఇష్టమైన వాహనంగా ఉందని కంపెనీ ఆటోమోటివ్ డివిజన్ సీఈఓ నళినీకాంత్ పేర్కొన్నారు.

## సొంత ఫెర్రైట్ మోటారు అభివృద్ధి చేసిన తొలి భారతీయ కంపెనీగా ఓలా రికార్డు




ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ అరుదైన ఘనతను దక్కించుకుంది. స్వంతంగా అభివృద్ధి చేసిన రేర్-ఎర్త్-ఫ్రీ ఫెర్రైట్ మోటారును రూపొందించిన తొలి భారతీయ కంపెనీగా నిలిచింది. ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వం నుంచి సర్టిఫికేట్‌ను అందుకుంది. ఈ రకమైన మోటార్ కోసం రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ అవసరం ఉండదు. ఇటువంటి కొత్త మోటార్ల కారణంగా అరుదైన భూఅయస్కాంతాల దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని ఓలా సోమవారం ప్రకటనలో వెల్లడించింది. కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ నోటిఫై చేసిన ఏఐఎస్ 041 నియమాల ప్రకారం.. ఓలా రూపొందించిన కొత్త మోటార్ అన్ని రకాల పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. ఇది భూఅయస్కాంతాలతో తయారైన మోటార్లకు సమానంగా మెరుగైన పనితీరును కలిగి ఉంది. పనితీరుతో పాటు నాణ్యత, సామర్థ్యం వంటి అంశాల్లోనూ సమానంగా నిలిచింది. దీనివల్ల రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు, ఖర్చు కూడా తగ్గుతుందని ఓలా ఎలక్ట్రిక్ అధికారిక ప్రకటనలో తెలిపింది. గత కొంతకాలంగా అత్యంత అరుదైన భూఅయస్కాంతాలపై ఆధిపత్యం కలిగిన చైనా వాటి సరఫరాను నిలిపేసింది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా వీటి కొరత ఆందోళనగా మారింది. ముఖ్యంగా ఈవీ, కంప్యూటర్లు, విమానాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో వీటి వినియోగం అధికం కావడంతో విలువైన లోహాల కొరత ప్రపంచానికే సవాలుగా నిలిచింది. ఈ క్రమంలో ఓలా ఎలక్ట్రిక్ ఫెర్రైట్ మోటారును తయారు చేయడం ఆసక్తికరం.

# భగ్గుమన్న పసిడి ఒకే రోజు రూ.9,700 ప్రియం

భారతీయులకు బంగారం అంటే కేవలం అలంకరణగానే కాదు.. పెట్టుబడికి కూడా మంచి సాధనంగా ఉంది. ఇంకా ఇది మన సంస్కృతిలో అంతర్భాగంగా ఉంది. ఇటీవల అంతర్జాతీయంగా అనిశ్చితి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా దిగుమతి సుంకాల్ని పెంచుతుండటం సహా కేంద్ర బ్యాంకులు బంగారం నిల్వల్ని పెంచుకుంటుండటం.. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుండటం ఇలా చాలా కారణాలతో బంగారం ధరలు అలా పెరుగుతూ పోతూనే ఉన్నాయి. మొదట 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1 లక్ష దాటితేనే షాకయ్యారు. తర్వాత అది రూ. 1.30 లక్షల దిశగా పరుగులు పెడుతుండగా.. 22 క్యారెట్ల గోల్డ్ జువెల్లరీ రేటు రూ. 1.10 లక్షలు దాటేసింది. దీంతో సామాన్యులు అసలు కొనలేకపోతున్నారు. ఈ క్రమంలోనే వారికి ప్రత్యామ్నాయంగా 14 క్యారెట్లు, 18 క్యారెట్ల బంగారం ఉంది. వీటి ధరలు కాస్త తక్కువగా ఉండటంతో ఇటువైపు మొగ్గుచూపుతున్నారు. ఇక్కడ స్వచ్ఛతలో కొంచెం బంగారం తక్కువగా ఉన్నప్పటికీ.. ధర చాలా తక్కువ. మన్నిక ఎక్కువ కారణంగా కొనుగోళ్లు జరుపుతున్నారు. ఇండియన్ బులియన్ జువెల్లర్స్ అసోసియేషన్ ప్రకారం.. వీటి రేట్లు అక్టోబర్ 6న ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. 24 క్యారెట్స్ గోల్డ్ రేటు గ్రాముకు రూ. 1,19,06 గా ఉంది. అంటే తులం రూ. 1.19 లక్షలకుపైనే ఉంది. 22 క్యారెట్ల ధర గ్రాము రూ. 11,620 గా ఉంది. 18 క్యారెట్ల గోల్డ్ జువెల్లరీ రేటు చూస్తే గ్రాముకు రూ. 9644 గానే ఉంది. 10 గ్రాములకు రూ. 96,440 పడుతుంది. ఇంకా 14 క్యారెట్ల బంగారు ఆభరణాల ధర ఇంకా తక్కువగా రూ. 7679 గా ఉంది. తులం రూ. 76,790 పడుతుంది. స్వచ్ఛత విషయానికి వస్తే.. 24 క్యారెట్ అంటే ప్యూర్ గోల్డ్. ఇందులో 99.9 శాతం బంగారం ఉంటుంది. 22ఖ అంటే ఇక్కడ 91.7 శాతం బంగారం ఉంటుంది. మిగతాది లోహాల్ని కలుపుతారు. 18ఖ అంటే 75 శాతం బంగారం ఉంటుంది. 14ఖ విషయానికి వస్తే ఇక్కడ 58.33 శాతం బంగారం ఉంటుంది. ఈ తక్కువ క్యారెట్ల బంగారు ఆభరణాల్లో ఇతర మిశ్రమాలు ఎక్కువగా ఉండటం వల్ల ఇది.. 22ఖ క్యారెట్ గోల్డ్ కంటే గట్టిగా, మన్నికగా ఉంటుంది. రోజూ ధరించేటువంటి గొలుసులు, ఉంగరాలు వంటి జువెల్లరీకి ఇది బెస్ట్ అని చెబుతుంటారు. ధర కాస్త తక్కువగా ఉండటంతో.. పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది మంచి ఎంపిక. అయితే ఈ తక్కువ క్యారెట్ల బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు కూడా తప్పనిసరిగా బీఐఎస్ హాల్‌మార్కింగ్ చెక్ చేసుకోవాలి. ఇక్కడ ఆభరణంపై బీఐఎస్ లోగో, క్యారెట్స్, ప్యూరిటీ ముద్రించి ఉంటుంది. ఆరంకెల హెచ్‌యూఐడీ నంబర్ ఉంటుంది. ఇంకా బీఐఎస్ కేర్ యాప్‌లో దీనిని ఈజీగా చెక్ చేసుకోవచ్చు. అక్కడ పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.



## ఆరు నెలల్లో పెట్రోల్ వాహనాల ధరలకు సమానంగా ఈవీ ధరలు

దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) ధరలు మరో 4-6 నెలల్లో పెట్రోల్ వాహనాల ధరలతో సమాన స్థాయికి చేరుకుంటాయని కేంద్ర రోడ్డు, రవాణా రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు.సోమవారం జరిగిన ఫిక్కీ ఉన్నత విద్యా సదస్సు-2025 కార్యక్రమంలో ప్రసంగించిన గడ్కరీ.. భారత సాంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటం ఆర్థిక భారం అవుతుంది. ఇంధన దిగుమతుల కోసం మనదేశం ఏటా రూ. 22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది. పైగా ఈ ఇంధన వాడకం పర్యావరణానికి ముప్పు కలిగిస్తుందని మంత్రి తెలిపారు. ఈ పరిణామాలే దేశ పురోగతికి క్లీన్ ఎనర్జీ కీలకంగా మారేందుకు దోహదపడుతున్నాయి. వచ్చే ఐదేళ్లలో దేశ ఆటోమొబైల్ పరిశ్రమను ప్రపంచంలోనే నంబర్ 1గా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. మరో 4-6 నెలల్లో ఈవీల ధరలు పెట్రోల్ వాహనాల ధరలకు సమానంగా ఉంటాయి. తాను రవాణా మంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పుడు, దేశ ఆటోమొబైల్ పరిశ్రమ పరిమాణం రూ. 14 లక్షల కోట్లుగా ఉంది. ఇప్పుడు అది రూ. 22 లక్షల కోట్లకు పెరిగింది. ప్రస్తుతం అమెరికా ఆటోమొబైల్ పరిశ్రమ విలువ రూ. 78 లక్షల కోట్లు, చైనా రూ. 47 లక్షల కోట్లు, భారత్ రూ. 22 లక్షల కోట్లతో కొనసాగుతున్నాయి. మొక్కజొన్న నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేయడం ద్వారా రైతులు అదనంగా రూ. 45,000 కోట్లు సంపాదించారని గడ్కరీ ప్రస్తావించారు. 2027 నాటికి దేశంలోని మొత్తం ఘన వ్యర్థాలను రోడ్డు నిర్మాణంలో ఉపయోగించాలని, తద్వారా వ్యర్థాల నుంచి విలువను సృష్టించే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్టు మంత్రి వివరించారు. ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్య తను ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో అభివృద్ధి సాధించేందుకు సరైన జ్ఞానంతో స్పష్టమైన, తెలివైన ప్రణాళిక ఇప్పుడు మనకు అవసరం, ఇతర దేశాలతో పోలిస్తే మనదేశంలో యువత, ప్రతిభావంతులైన, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి ఉందని మంత్రి అన్నారు. ఇదే భారత్‌కు ఉన్న అతిపెద్ద బలం, ఈ బలాన్ని ఉపయోగించడం ద్వారా వారికి సరైన విద్య, నైపుణ్యాలను అందించడంలో మనం విజయవంతమైతే, ప్రపంచంలో ముందుకు సాగవచ్చని ఆయన పేర్కొన్నారు.



# భారత్-పాక్ మ్యాచ్‌లు వద్దు.. అందుకు వారు ఒప్పుకొంటారా?: బీసీసీఐ

ఆసియాప్-2025లో భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య ఊహించని పరిణామాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ టోర్నీ అంతటా భారత జట్టు ఆటగాళ్లు పాక్ ప్లేయర్లతో అంటిముట్టనట్టే ఉన్నారు. కనీసం కరచాలనం చేసేందుకు కూడా ఇష్టపడలేదు. అంతేకాకుండా ఫైనల్ మ్యాచ్ అనంతరం ఆసియా క్రికెట్ కౌన్సిల్ చీఫ్ మొహ్సిన్ నక్వీ చేతుల మీదగా ట్రోఫీని తీసుకోవడానికి కూడా భారత్ నిరాకరించింది. నక్వీ పీసీబీ చీఫ్‌తో పాటు పాక్ మంత్రిగా ఉండడమే అందుకు కారణం. అయితే ఈ ఆసియాకప్‌లో జరిగిన సంఘటనలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొంతమంది భారత్‌కు సపోర్ట్ చేస్తే మరి కొతమంది పాక్‌కు మద్దతుగా నిలిచారు. ఇదే విషయంపై ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ మైఖేల్ అథర్టన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇరు దేశాల మధ్య సమస్యలు పరిష్కారం అయ్యే వరకు భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌లను నిర్వహించవద్దని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కి అథర్టన్ సూచించాడు. అతడి వ్యాఖ్యలపై బీసీసీఐ అధికారి ఒకరు స్పందించారు. "భారత్-పాకిస్తాన్ మధ్య సమస్యలు అంత సులువుగా పరిష్క రం కావు. బయట నుంచి వ్యక్తులు ఏదైనా మాట్లాడుతారు. ఏదైనా చెప్పినంత ఈజీ కాదు. అందుకు స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్లు అంగీకరిస్తారా? ప్రస్తుత పరిస్థితుల్లో టీమిండియానే కాదు ఏ ప్రధాన జట్టు అయినా టోర్నమెంట్ నుండి వైదొలిగితే తర్వాత స్పాన్సర్లను ఆకర్షించడం చాలా కష్టమని" సదరు అధికారి పేర్కొన్నారు. కాగా ఈ ఏడాది ఆసియాకప్‌లో మూడు సార్లు పాక్-భారత్ జట్లు తలపడ్డాయి. మూడు మ్యాచ్‌లలోనూ పాక్‌ను టీమిండియా చిత్తు చేసింది. అయితే విన్నింగ్ ట్రోఫీ ఇప్పటివరకు ఇంకా భారత్ వద్ద చేరలేదు.



## ఇండియాతో సిరీస్.. ఆసీస్ వన్డే, టీ20 కెప్టెన్‌గా మిచెల్ మార్ష్

**సిడ్నీ:** ఇండియాతో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌కు ఆస్ట్రేలియా తమ జట్లను ప్రకటించింది. గాయం నుంచి కోలుకుంటున్న ప్యాట్ కమ్మిన్స్‌ను ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. ఆస్ట్రేలియా వన్డే, టీ20 సిరీస్‌కు మిచెల్ మార్ష్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అక్టోబర్ 19వ తేదీ నుంచి ఇండియా, ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే జరగనున్నది. వన్డే జట్టులో ఆస్ట్రేలియా కొన్ని మార్పులు చేసింది. వన్డే స్క్వాడ్ నుంచి లబు షేన్‌ను తప్పించింది. అతని స్థానంలో మాథ్యూ రెన్‌షాను తీసుకున్నది. రెన్‌షా ఇప్పటి వరకు ఆస్ట్రేలియా తరపున 14 టెస్టులు ఆడాడు. అయితే 2022 పాకిస్థాన్ టూరులో అతను వన్డే జట్టులో ఉన్నా.. ఇంకా అరంగేట్రం చేయలేదు. కమ్మిన్స్ లేకపోవడంతో.. మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ ప్రధాన బౌలర్ల పాత్రను పోషించనున్నారు. వీరితో పాటు పేస్ బౌలింగ్ బృందంలో గ్జావియర్ బార్ట్‌లెట్, బెన్ డ్వార్షియస్ ఉన్నారు. బ్యాటర్ రెన్‌షా గత సీజన్‌లో క్వీన్స్‌ల్యాండ్ తరపున భారీగా పరుగులు సాధించాడు. అతను 50 సగటుతో 350 రన్స్ చేశాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో 80, 106, 62 రన్స్ స్కోర్ చేశాడు. పెర్త్‌లో జరగనున్న ఫస్ట్ వన్డే మ్యాచ్‌కు అలెక్స్ క్యారీ దూరం కానున్నాడు. అక్టోబర్ 15వ తేదీన ఓవల్‌లో జరగనున్న షీఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. మణికట్టుకు సర్జరీ కావడం వల్ల గ్లెన్ మ్యాక్స్‌వెల్‌ను టీ20 సిరీస్‌ను తప్పించారు. తొలి రెండు టీ20 లకు మాత్రమే ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. ఇండియాతో మొత్తం మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి.



వన్డే జట్టు: మిచెల్ మార్ష్, గ్జావియర్ బార్ట్‌లెట్, అలెక్స్ క్యారీ, కూపర్ కన్నోలీ, బెన్ డ్వార్షియస్, నాథన్ ఎల్లిస్, కెమరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్,జోష్ ఇంగ్లిష్, మిచెల్ ఓవన్, మాథ్యూ రెన్‌షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా.

టీ20 జట్టు: మిచెల్ మార్ష్, సీన్ అబాట్, గ్జావియర్ బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ డ్వార్షియస్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహనెమన్, మిచెల్ ఓవన్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా.

క్రీడా వాయిస్

## రోహిత్‌ను తప్పించడం సరైన నిర్ణయం.. కోహ్లి జట్టులో కొనసాగాలంటే: డివిలియర్స్



టీమిండియా వన్డే కెప్టెన్‌ను మారుస్తూ భారత క్రికెట్ నియంత్రణ మండలి తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అన్న చర్చ నడుస్తూనే ఉంది. రోహిత్ శర్మను తప్పించి శుబ్‌మన్ గిల్‌కు పగ్గాలు ఇవ్వడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో భారత దిగ్గజం సునిల్ గావస్కర్ తో పాటు మదన్ లాల్ వంటి వారు సెలక్టర్ల నిర్ణయాన్ని సమర్థిస్తుండగా. హర్భజన్ సింగ్, రాబిన్ ఊతప్ప, మహ్మద్ కైఫ్ వంటి మాజీ క్రికెటర్లు దీనిని తొందరపాటు చర్యగా అభివర్ణిస్తున్నారు. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా లెజండరీ బ్యాటర్ ఏబీ డివిలియర్స్ కూడా భారత వన్డే జట్టు కెప్టెన్ మార్పు అంశంపై తాజాగా స్పందించాడు. రోహిత్ శర్మను తప్పించి గిల్‌ను కెప్టెన్‌ను చేయడం సరైన నిర్ణయమని పేర్కొన్నాడు. ఇందుకు గల కారణాలు వివరిస్తూ..

### రోహిత్‌పై వేటు సరైన నిర్ణయం

"రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వన్డే వరల్డ్‌కప్?-2027 వరకు ఆడతారో లేదో నమ్మకం లేదు. ఆ ఆలోచనతోనే శుబ్‌మన్ గిల్‌ను వన్డే కెప్టెన్‌గా చేసి ఉంటారు. అతడికి గొప్ప అవకాశం లభించింది. యువకుడు.. బ్యాటర్‌గానూ మంచి ఫామ్‌లో ఉన్నాడు. అద్భుతమైన నాయకుడిగా ఎదగగలడు. రోహిత్, కోహ్లి జట్టులో ఉండగానే గిల్‌ను కెప్టెన్ చేయడం సరైన నిర్ణయం. ఈ ఇద్దరు గొప్ప, అనుభవజ్ఞులైన కెప్టెన్ల నుంచి గిల్ ఎంతో నేర్చుకునే అవకాశం లభిస్తుంది.

### రోహిత్, కోహ్లి జట్టులో కొనసాగాలంటే..

వారి అనుభవం తనకు ఉపయోగపడుతుంది. కెప్టెన్‌గా ఎదిగే క్రమంలో అతడికి ఇది ఎంతో ముఖ్యం. వాళ్లిద్దరు జట్టులో ఉండటం గిల్‌కు సానుకూలంగా ఉంటుంది. ఏదేమైనా ఒకవేళ రోహిత్, కోహ్లి 2027 వరల్డ్‌కప్ వరకు కొనసాగాలనుకుంటే.. తప్పకుండా పరుగులు రాబట్టాల్సి ఉంటుంది. సెలక్టర్లకు బ్యాట్ ద్వారానే సందేశం ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే ప్రస్తుతం టీమిండియాలో చోటు కోసం తీవ్రమైన పోటీ ఉంది. ఈ పోటీని దాటి ముందుకు వెళ్లాలంటే కచ్చితంగా పరుగులు చేయాల్సిందే. రోహిత్, కోహ్లి వరల్డ్‌కప్ వరకు జట్టులో ఉంటే.. టీమిండియాకు అంతకంటే గొప్ప ఆస్తి మరొకటి ఉండదు" అని డివిలియర్స్ పేర్కొన్నాడు.

### ఆసీస్‌తో సిరీస్‌తో రీఎంట్రీ

కాగా ఇప్పటికే అంతర్జాతీయ టీ20లకు, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్, కోహ్లి.. వన్డేల్లో మాత్రం కొనసాగుతున్నారు. చివరగా ఇద్దరూ ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 సందర్భంగా టీమిండియా తరఫున బరిలోకి దిగారు. ఇక ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా వన్డే సిరీస్‌తో రో- కో పునరాగమనం చేయనున్నారు. ఇదిలా ఉంటే.. ఇప్పటికే టీమిండియా టెస్టు కెప్టెన్‌గా గిల్ జట్టును ముందుకు నడిపిస్తుండగా.. టీ20 టీమ్‌కు సూర్యకుమార్ యాదవ్ సారథిగా ఉన్నాడు.

# ఆ రోజులు గుర్తుకొస్తున్నాయి



'నా కెరీర్ లో అక్టోబర్ నెలను మరచిపోలేను. ఎందుకంటే దాదాపు పద్దెనిమిది ఏళ్ల క్రితం నేను నటించిన తొలి చిత్రం "హ్యాపీడేస్" 2007లో ఇదే నెలలో విడుదలై, ఘన విజయం సాధించి, నా కెరీర్ నే మలుపు తిప్పింది. అందుకే నా జీవితంలో అక్టోబర్ మాసం గుర్తుండి పోయింది. ఇప్పుడు కానిస్టేబుల్ చిత్రం కూడా ఇదే నెలలో విడుదలవుతుండటంతో ఆ రోజులు గుర్తుకు వస్తున్నాయి' అని హీరో వరుణ్ సందేశ్ అన్నారు. వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్ లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, "సమాజంలో జరుగుతున్న అంశాల ప్రేరణతో ఈ చిత్రాన్ని మలచడం జరిగింది. కమర్షియల్, ఎంటర్టైన్మెంట్, సందేశం వంటి అంశాలను మిళతం చేసి రూపొందించడం జరిగింది" అని అన్నారు. నిర్మాత బలగం జగదీశ్ మాట్లాడుతూ, "ఈ చిత్రానికి సెన్సార్ యు/ఎ సర్టిఫికెట్ లభించింది. ఈ నెల 10న చిత్రాన్ని భారీగా విడుదల చేయబోతున్నాం. ఒక అమ్మాయికి అవమానం జరిగితే దాని పరిణామాలు ఎలా ఉంటాయి అన్న అంశాన్ని చూపించాం. అమ్మాయిలతో పాటు తల్లి తండ్రులు కూడా ఈ సినిమాను చూడాలి" అని అన్నారు. దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కె. మాట్లాడుతూ, ట్రైలర్, పాటలకు వచ్చిన స్పందన సినిమా పట్ల మా నమ్మకాన్ని పెంచింది. నిర్మాత కథను నమ్మి స్వేచ్ఛ ఇవ్వడం వల్లనే ఈ సినిమా తెరపైకి వచ్చింది" అని అన్నారు.

# ఆ ఇద్దరు హీరోల కోసం ఏదైనా చేస్తా



యంగ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి 'కేజీఎఫ్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది. ప్రస్తుతం ఈ అమ్మడు 'తెలుసు కదా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటిస్తుండగా.. రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం దీపావళి కానుకగా.. అక్టోబర్ 17న థియేటర్స్‌లో విడుదల కాబోతుంది. ఈనేపథ్యంలో.. ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన శ్రీనిధి శెట్టి వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటుంది. తాజాగా, శ్రీనిధి ఆసక్తికర కామెంట్స్ చేసి వార్తల్లో నిలిచింది. ఇందులో భాగంగా యాంకర్.. మహేష్ బాబు, ఎన్టీఆర్‌తో అవకాశాలు వస్తే మీరు ఏ హీరోతో చేస్తారని ప్రశ్నించగా.. శ్రీనిధి స్పందిస్తూ.. "ఒకేసారి ఆ ఇద్దరితో నటించే అవకాశం వస్తే నేను కచ్చితంగా ఆ చిత్రాలను చేస్తాను. ఈ ప్రాజెక్ట్స్ కోసం రాత్రి పగలు అనే తేడా లేకుండా కష్టపడి పని చేస్తాను. మహేష్ బాబు, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశం రావడం కోసం ఎంతో మంది సెలబ్రిటీలు ఎదురుచూస్తుంటారు. అలాంటికి ఇద్దరి సినిమాల్లో నాకు ఒకే సారి చాన్స్ వస్తే ఎవరు వదులుకోరు. వారిద్దరూ పాన్ ఇండియా స్థాయిలో ఎంతో మంచి ఆదరణ సొంతం చేసుకున్నారు. కాబట్టి వారి కోసం నేను ఏమైనా చేస్తాను" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం శ్రీనిధి కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.



# దీపావళి బరి నుంచి తప్పుకున్న 'లిక్'

కోలీవుడ్ యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్' సినిమాతో హిట్ అందుకుని ఫుల్ జోష్‌లో ఉన్నాడు. ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీ అయిపోయాడు. త్వరలో ప్రదీప్ డ్యూడ్, లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక ఈ రెండు సినిమాలు దీపావళి బరిలో ఉన్నాయి. రెండు ఒకేసారి రిలీజ్ కాబోతుండటంతో.. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' మూవీని వాయిదా వేసినట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. రెండు ఒక రోజు గ్యాప్‌తో విడుదల చేయడం చిత్రబృందానికి ఇష్టం లేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా, ఈ విషయంపై మూవీ మేకర్స్ స్పందిస్తూ ట్విట్టర్ ద్వారా అధికారిక ప్రకటనను విడుదల చేశారు. "ఈ రెండు సినిమాలు ఒకే ట్రాక్‌పై ఉన్న రెండు రైళ్లలాగే ఎదురెదురుగా ఢీకొనడం ఎవరికీ ఉపయోగపడదు. మా ప్రియమైన హీరో ప్రదీప్ రంగనాథన్ పట్ల నిజమైన ప్రేమతో ఈ రెండు చిత్రాల వెనుక ఉన్న కృషిని గౌరవిస్తూ.. మేము లిక్ విడుదల వాయిదా వేస్తున్నాం. ఈ సినిమా డిసెంబర్ 18న రిలీజ్ చేయాలని ఆలోచనాత్మకంగా నిర్ణయించుకున్నాము. మైత్రీ మూవీస్ సమన్వయం చేసుకోవడానికి మేము ఎంత ప్రయత్నించినా.. మాకు ఒక విషయంపై ఒక అభిప్రాయం రాలేకపోయాము. రెండు సినిమాలు ఒకదానికొకటి పోటీ పడకుండా.. దేనికదే ప్రకాశించేలా వాయిదా వేయడం తెలివైన పని అని మేము నమ్ముతున్నాము. ప్రదీప్ రంగనాథన్, డ్యూడ్ టీమ్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. ఈ సంతోషకరమైన దీపావళికి ఘన విజయం సాధించాలని కోరుతున్నాము" అని రాసుకొచ్చారు. కాగా, ఈ చిత్రంలో ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి జంటగా నటిస్తున్నారు.ఈ రొమాంటిక్ కామెడీ మూవీని స్టార్ హీరోయిన్ నయనతార భర్త విఘ్నేష్ శివన్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఎస్ జె సూర్య, యోగిబాబె, గౌరీ జీ కిషన్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను సెవెన్ స్క్రీన్ స్టూడియోస్, రౌడీ పిక్చర్స్ బ్యానర్‌పై నయనతార, లలిత్ కుమార్ నిర్మిస్తున్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్యా వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

# విశ్వక్ సేన్, కేవీ అనుదీప్ కాంబోలో 'ఫంకీ'.. టీజర్ వచ్చేది అప్పుడే




టాలీవుడ్ యువ నటుడు విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్నతాజా చిత్రం 'ఫంకీ'. వరుస ఫ్లాప్‌లతో సతమవుతున్న విశ్వక్ ఎలాగైన హిట్టు కొట్టాలనే కసితో ఈ సినిమాను చేస్తున్నాడు. ఈ సినిమాకు జాతిరత్నాలు, ప్రిన్స్ వంటి కామెడీ సినిమాలను తెరకెక్కించిన కేవీ అనుదీప్ దర్శకత్వం వహిస్తుండగా.. తమిళ నటి కాయదు లోహర్ కథానాయికగా నటిస్తుంది. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి మేకర్స్ టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఈ సినిమా టీజర్‌ను అక్టోబర్ 10న విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాత నాగవంశీ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం చిత్ర పరిశ్రమపై సెటైరికల్‌గా

# లాజిక్‌లెస్ కామెడీతో 'మిత్రమండలి' ట్రైలర్



ప్రియదర్శి, విష్ణు, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా, నిహారిక ఎన్ఎమ్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'మిత్రమండలి'. అక్టోబరు 16న థియేటర్లలోకి రానుంది. కొన్నాళ్ల క్రితం రిలీజైన టీజర్, పాటలు ఆకట్టుకోగా.. తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. నిర్మాత బన్నీ వాస్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ట్రైలర్ చూస్తుంటే ఫన్నీగా ఉంది. 'జాతిరత్నాలు' తరహాలో నవ్వించడమే మూవీ టీమ్ లక్ష?్యంగా పెట్టుకున్నట్లు కనిపించారు. వెన్నెల కిశోర్, సత్య తదితరులు కూడా కామెడీతో నవ్వించేలా కనిపిస్తున్నారు. దీపావళి బరిలో 'మిత్రమండలి'తో పాటు కిరణ్ అబ్బవరం 'కె ర్యాంప్', సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా' కూడా థియేటర్లలో రిలీజ్ కాబోతున్నాయి.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com